www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 59 | శుక్రవారం | 18 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

ప్రధాన పార్టీలకు కార్పొరేట్ల

మేత

రాజకీయ విరాళాల చిట్టాలో బిజెపిదే పెద్దపీట

ప్రజల ఓటుతో వారి ప్రతినిధులుగా వారి తరపున అధికారాన్ని చేపట్టే ప్రధాన రాజకీయ పక్షాలు ప్రజా ప్రయోజనాలతో నిమిత్తం లేకుండా పలు సందర్భాల్లో జనహితాన్ని కాలరాసి కేవలం అమిత లాభార్జనే లక్ష్యంగా పని చేసే కార్పొరేట్ వ్యాపార సంస్థల నుంచి భారీగా విరాళాలు పొందడం, అవి అందినవి అందినట్టుగా ప్రజల దృష్టికి రాకుండా చట్టంలోని పలు లొసుగులను ఉపయోగించుకోవడం ఎంత హీన మైనదో మరెంత ప్రజాస్వామ్య విరుద్ధమో తెలిసిందే. ప్రజాస్వామ్యాన్ని కంటికి రెప్పలా కాపాడే లక్ష్యంతో పని చేసే కొన్ని సంస్థల శోధనలో ఈ బండారం అప్పుడప్పుడు బయట పడు తుంటుంది. ప్రజా స్వామ్య సంస్కరణల సంస్థ(అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్–ఎడిఆర్) తాజాగా బయట పెట్టిన వివరాల ప్రకారం కార్పొరేట్ సంస్థల నుంచి భారీగా విరాళాలు పొందిన పార్టీలలో నేడు కేంద్రంలో, పలు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీదే పై చేయిగా నిరూపణ అవుతున్నది. ఎనిమిదేళ్ళలో రూ. 705.81కోట్లను బిజెపి వివిధ కార్పొరేట్ సంస్థల నుంచి విరాళాల రూపంలో పొందింది. ఆ తరువాత స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అదే కాలంలో రూ.198.16 కోట్ల విరాళాలను స్వీకరించింది. ఈ విరాళాల్లో అత్యధిక భాగం 2012–16 మధ్య గల నాలుగేళ్ళల్లోనే పార్టీలకు అందినట్టు వెల్లడైంది. ఎడిఆర్ ముఖ్యంగా బిజెపి, కాంగ్రెస్, ఎన్‌సిపి, సిపిఐ, సిపిఎం పార్టీల మీదనే దృష్టి ఉంచి ఈ విరాళాల వివరాలను సేకరించి, విశ్లేషించింది. కమ్యూనిస్టు పార్టీలు రెండూ కార్పొరేట్ విరాళాల కోసం దేహీ అనలేదు, తీసుకోలేదు. కేవలం ఉద్యోగులు, కార్మికుల సంఘాలు, యూనియన్ నుంచి మాత్రమే సిపిఐ, సిపిఎంలు కనీస మనుగడ కోసం విరాళాలు స్వీకరించాయి.



వివరాలు 3లో

విద్యుత్ ఎఇల భర్తీకి సుప్రీం

లైన్ క్లియర్

2015 అర్హత పరీక్షలో మెరిట్ ప్రాతిపదికన జరగాలని ఆదేశం



మనతెలంగాణ/న్యూఢిల్లీ: తెలంగాణ ట్రాన్స్ కో, నార్త్ డిస్కం, సౌత్ డిస్కం లలో 239 అసిస్టెంట్ ఇంజనీర్ల ఖాళీల భర్తీకి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మెరిట్ జాబితా ప్రకారం కాకుండా, కొత్తగా పరీక్ష నిర్వహించి ఈ ఖాళీలను భర్తీ చేయాలన్న ఉమ్మడి హైకోర్టు తీర్పును అత్యున్నత న్యాయ స్థానం తోసిపుచ్చింది. 2015లో తెలంగాణలోని జెన్ కో, ట్రాన్స్ కో, నార్త్ డిస్కం, సౌత్ డిస్కం లలో 600 పైగా అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల అయ్యింది. అందులో 1:1 నిష్పత్తిన అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలిచారు. అయితే కొంత మంది అభ్యర్థులు జెన్ కో, ట్రాన్స్ కో, నార్త్ డిస్కం, సౌత్ డిస్కంలలోని అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులకు ఎంపిక కావడం జరిగింది. దీంతో చాలా మంది అభ్యర్థులు జెన్‌కోలో చేరడానికి నిర్ణయించడంతో ఈ 239 ఖాళీలు ఏర్పడ్డాయి. అయితే కొంతమంది అభ్యర్థులు మిగిలిపోయిన ఖాళీలను మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. దీన్ని వ్యతిరేకిస్తూ అర్హత పరీక్షలో మెరిట్ సాధించని విద్యార్థులు మళ్లీ తాజాగా పరీక్ష నిర్వహించి ఈ ఖాళీలను భర్తీ చేయాలని హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. వీరి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కోర్టు ఈ 239 ఖాళీలను భర్తీ చేయడానికి మళ్లీ అర్హత పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ.... 2015లో నిర్వహించిన అర్హత పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మెరిట్ విద్యార్థుల తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, మరో న్యాయవాది శ్రావణ్‌లు వాదనలు వినిపించారు. ఈ

తరువాయి 6లో

ఉద్యోగ నియామకాలకు

అడ్డంకులివే

● ఇప్పటి వరకు 49,570 పోస్టులకు అనుమతి ఇవ్వగా, కేవలం 15,791 మాత్రమే భర్తీ అయ్యాయి ● రాష్ట్రపతి ఉత్తర్వులు, రిజర్వేషన్లు, విద్యార్హతలు, సిలబస్ అంశాలే కారణం ● స్పెషల్ సిఎస్ నేతృత్వంలో కమిటీ వేయాలి, వారానికోసారి సమీక్షించాలి

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు 49,570 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతించింది. ఆర్థిక శాఖ, క్యాబినెట్ కూడా ఆమోదం తెలిపింది. ప్రభుత్వం అనుమతించిన వాటిలో సగం కూడా భర్తీ కాలేదు. కేవలం 15,791 పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. తాజాగా ఆగస్టు 15వ తేదీన గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన తరువాత సిఎం కెసిఆర్ మాట్లాడుతూ కొద్ది నెలల్లోనే మొత్తం 1,12,536 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. అయితే ఇప్పటి వరకు ప్రకటించిన సర్కార్ కొలువుల భర్తీ ప్రక్రియకు కారణమవుతున్న అంశాలు, అడ్డంకులపై ఉన్నతస్థాయిలో చర్చించారు. విద్యార్హతలు, సిలబస్, ఉద్యోగి స్థానం, రిజర్వేషన్లు, కొత్త జిల్లాల ఏర్పాటు, రాష్ట్రపతి ఉత్తర్వులు, సర్వీసు నిబంధనలు అంశాలు ప్రధాన అడ్డంకిగా మారాయనే నిర్ణయానికి వచ్చారు. ఈ కారణాల వల్ల టిఎస్‌పిఎస్‌సి సకాలంలో నోటిఫికేషన్లు ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయి. ఒక నోటిఫికేషన్ కోసం మూడు నుంచి ఆరు నెలల పాటు కష్టపడుతున్నా న్యాయపరమైన అడ్డంకులు రావడంతో భర్తీ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోవడం జరుగుతోంది. ఈ అంశాలు విశ్లేషించి, మార్గదర్శనం చేసేందుకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో కమిటీ వేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు తెలిసింది. కమిటీ ప్రతి వారానికోసారి సమావేశమై పలు ప్రభుత్వ విభాగాలతో చర్చించి, సూచనలు, సలహాలు ఇవ్వనున్నది. ఈ విధానం అనుసరిస్తే తప్ప ఆరు నెలల్లో సమస్య కొలిక్కి వచ్చే పరిస్థితి లేదంటున్నారు. టిఎస్‌పిఎస్‌సితో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలలో ఉద్యోగాల భర్తీ, నోటిఫికేషన్లపై దాఖలైన పిటీషన్లు, కేసులపై అధ్యయనం చేసి నివేదిక అందచేయాల్సిందిగా రాష్ట్ర న్యాయ శాఖ, హైకోర్టు అడ్వకేట్ జనరల్‌ను కోరారు. ఉద్యోగాల భర్తీ, ఖాళీలపై ఈ మధ్య వరుసగా ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. గడచిన మూడేళ్లలో ఎప్పటికప్పుడు పోస్టులకు అనుమతులు మంజూరు చేస్తున్నా, నియామక ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ఏ స్థాయిలో జాప్యం జరుగుతున్నది, కారణాలు ఏమిటనేది తెలుసుకునే పనిలో



ఉద్యోగాల పోటీ పరీక్షల కోసం కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు (ఫైల్‌ఫోటో)

తరువాయి 6లో

జయ మృతిపై న్యాయ విచారణ

● ఆదేశించిన తమిళనాడు ప్రభుత్వం ● స్మారక చిహ్నంగా ఆమె నివాసం వేద నిలయం ● ఎఐఎడిఎంకె ప్రత్యర్థి శిబిరాల విలీనానికి వీలుగా కీలక నిర్ణయాలు 10

బాలికను కన్నదని హతమార్చిన భర్త యుపిలో దారుణం

10

శుష్క వాగ్దానాలే



మోడీ సర్కార్‌పై రాహుల్ విమర్శ 10

కుంచెపోటు



అన్నం, పప్పు, కూరలకు కూడా నాయకుల పేర్లు పెట్టొచ్చుగా..!

ఇరువురు పిల్లలతో గోదావరిలో దూకి మహిళ ఆత్మహత్య



మన తెలంగాణ/ఆదిలాబాద్ : మానసిక స్థితి సరిగ్గాలేని ఓ మహిళ తన ఇరువురు పిల్లలతో సహా గోదావరి నదిలో దూకి ప్రాణాలు తీసుకున్న సంఘటన సంచలనమైంది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి

తరువాయి 6లో

షేక్ చెరలో బాలిక

● 13ఏళ్ల హైదరాబాద్ బాలికను పెళ్ళి చేసుకొని ఒమన్‌లో చిత్రహింసలు పెడుతున్న ఓ అరబ్‌షేక్ ● చెర నుంచి విడిపించాలని ఆమె ఆర్తనాదం ● పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

మనతెలంగాణ/హైదరాబాద్,చాంద్రాయణగుట్ట : పాతబస్తీలో బాల్య వివాహ సంఘటన వెలుగు చూసింది. ఒమన్‌కు చెందిన 65 ఏళ్ల అరబ్‌షేక్‌కు పాతబస్తీలో ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల బాలికతో బలవంతంగా వివాహం జరిపించారు. అనంతరం గుట్టుచప్పుడు కాకుండా ఆరబ్ షేక్ ఆ బాలికను ఒమన్ దేశానికి తీసుకెళ్లాడు.మూడు నెలలుగా ఆ బాలికకు అతను నరకం చూపించాడు. అది తట్టుకోలేని ఆ బాలిక రెండు రోజుల క్రితం హైదరాబాద్ పాతబస్తీలో ఉన్న తల్లిదండ్రులకు ఫోన్ చేసింది. తాను ఇక్కడ నరకం అనుభవిస్తున్నాని.. తనను కాపాడాలని.. లేనిపక్షంలో చచ్చిపోతానని ఫోన్‌లో ఏడ్చింది. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు గురువారం ఫలక్‌నుమా పోలీసులను ఆశ్రయించడంతో పాతబస్తీలో షేక్‌ల పెళ్లిల వ్యవహారం మరోసారి బట్టబయలైంది. పోలీసులు, బాధితుల కథనం మేరకు పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పాతబస్తీలోని నవాబ్‌సాబ్‌కుంటకు చెందిన సయ్యద్ అప్సర్, సయీదున్నీసాలు దంపతులు. వీరికి ఒక కుమారుడు, ఒక కూతురున్నారు. కూతురు (13) ఫలక్‌నుమా ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. దంపతులు ఇద్దరు కూడా కూలీ పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. బాలిక మేనత్త అప్సర్ సోదరి గౌసియా బేగం ఒమన్ దేశంలో స్థిరపడింది. అక్కడిదేశానికి చెం దిన అరబ్‌షేక్ అహ్మద్ (65)తో గౌసియా బేగం ఒక ఒప్పందం



తరువాయి 6లో

డ్రగ్స్ కేసులో పబ్‌లకు సిట్ నోటీసులు

11

అమెరికా నుంచి ఆరు అపాచీ కాప్టర్లు కొనుగోలుకు నిర్ణయం

10

22న బ్యాంకుల సమ్మె



10

108 చర్చలు విఫలం

3

విద్యుదాఘాత మరణాలు నిరోధించండి : సిపిఐ



మన తెలంగాణ / హైదరాబాద్ : విద్యుదాఘాతంతో రైతులు, పశువులు మరణించకుండా చర్యలు తీసుకోవా లని, విద్యుత్ ఘాతుకంతో మరణించిన రైతు కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, చనిపోయిన పశువుల కు రూ.60 నష్టపరిహారం ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రధానంగా విద్యుత్ ఉత్పత్తికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం మంచి పరిణామమే అయినసప్పటికీ విద్యుత్ పంపిణీ వ్యవస్థపై దృష్టి పెట్టడం లేదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో వ్యవసాయం దాదాపు బోర్లు, బావుల మీద ఆధారపడి కొనసాగుతున్నదని, విద్యుత్ తీగలు పొలాల మధ్య నుంచి ఉండడం వల్ల అనేక సందర్భాల్లో విద్యుత్ వైర్లు తెగిపడి జరుగుతున్న ప్రమాదాల్లో పొలాల్లో పనిచేసే రైతులు, రైతు కూలీలు మృత్యువాత పడుతున్నారని, వందలాది పశువులు చనిపోతున్నాయని ఆయన వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యుత్ శాఖలోని క్రింద స్థాయి ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసి వ్యక్తిగత బాధ్యతలు ఇచ్చి రైతులు, పశువులు మరణించకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ శాఖాధికారులు స్పందించి పోలాల నుంచి విద్యుత్ వైర్లను దూరంగా వేసేందుకు, వదులుగా ఉన్న వైర్లను సరిచేసేందుకు చర్యలు తీసుకుని విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నృత్యాలతో అలరించిన విద్యార్థులు

మన తెలంగాణ/హైదరాబాద్ : నగరంలోని బాచుపల్లి క్యాంపస్‌లో ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 'రేడియంట్ రాప్‌సోడి' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్‌లోని పాఠశాలలకు చెందిన మ్యూజికల్ బ్యాండ్స్, థియేటర్ గ్రూప్స్ సంగీత, నృత్య ప్రదర్శనలతో అలరించారు. వివిధ పాఠశాలలకు చెందిన 400 మందికి పైగా విద్యార్థులు ప్రఖ్యాత సంగీత కళాకారులు అదినా కుమార్, ప్రమోద్ కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రదర్శనలిచ్చారు.

సరిగ్గా పని చేయకపోతే కఠిన చర్యలే

పరిశ్రమలు, ఐటి శాఖ సమీక్షలో కెటిఆర్ హెచ్చరిక

మన తెలంగాణ / హైదరాబాద్ : ఇకపైన వచ్చే ప్రతి మూడు నెలల్లో శాఖా పరంగా సాధించే మైలురాళ్లను అధికారులు ముందుగానే తెలియజేయాలని పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా ఈ మైలు రాళ్లను అందుకోలేని అధికారులపై శాఖా పరంగా కఠినంగా వ్యవహరించేందుకు వెనుకంజ వేయబోమని మంత్రి హెచ్చరించారు. గురువారం నాడిక్కడ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో పరిశ్రమలు, ఐటి శాఖపై మంత్రి కెటిఆర్ సమీక్షించారు.పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఇండస్ట్రీస్ కమిషనర్ నదీమ్ అహ్మద్, టిఎస్ఐఐసి ఎండి వెంకట నర్సింహారెడ్డి తదతర అధికారులతో జరిగిన సమావేశంలో ఈ రెండు శాఖల్లో నడుస్తున్న పలు కార్యక్రమాలు, ఫార్మా సిటి, మెడికల్ డివైజెస్ పార్కు ప్రాజెక్టుల ప్రగతిపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాల్లో అనేక అద్భుతమైన విధానాలను అమలులోకి తీసుకువచ్చిందన్నారు. అయితే ఇక ఈ రెండు సంవత్సరాల పాటు పాలసీల్లో ఇచ్చిన హామీల అమలును మరింత వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పాలసీలకు దేశ వ్యాప్తంగా ప్రశంసలు లభించాయన్న కెటిఆర్ రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు, పెట్టుబడులే ప్రాతిపదికగా పని చేయాలని అధికా



రులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో శాఖ వారిగా ఒక్కో కార్యక్రమం, ప్రాజెక్టులపై మంత్రి అధికారులను వివరాలు అడిగారు. ఫార్మాసిటీలో ఇప్పటి వరకు వివిధ సంస్థల నుండి వచ్చిన ఆసక్తి వ్యక్తీకరణ మేరకు సుమారు 8500 ఎకరాల ప్రాథమిక డిమాండ్ ఉన్నట్లు గుర్తించామని ఈ సందర్భంగా మంత్రికి అధికారులు తెలిపారు. త్వరలోనే ఎన్విరాన్‌మెంటల్ అనుమతుల మీద పబ్లిక్ హియరింగ్‌కు వెళ్లాల్సి ఉందని, ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలకు ఫార్మాసిటి ద్వారా కలిగే లాభాలు, ఉద్యోగాలు, కాలుష్య రహితంగా పార్కులో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ వంటి అంశాలను తెలియజేస్తామన్నారు. కెటిఆర్ స్పందిస్తూ ..గత ఏడాది సులభతర వాణిజ్య విధానంతో దేశంలో ప్రథమ స్థానంలో నిలిచామని, ఈ సారి అదే స్థానాన్ని కొనసాగించేలా అధికార యంత్రాంగం పని చేయాలని కోరారు. ఏరోస్పేస్ రంగంలో మరిన్ని పెట్టుబడులు వచ్చేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక సంస్థలు హైదరాబాద్ నగరంలో ఉన్నాయని, వీటికి తోడుగా మరిన్ని అంతర్జాతీయ కంపెనీలను నగరానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు, మిషన్ భగీరథ ప్రాజెక్టుతో కలిసి సమన్వయం చేసుకుంటున్నామని ఈ సందర్భంగా అధికారులు కెటిఆర్‌కు వివరించారు. మిషన్ భగీరథ ప్రాజెక్టుతో పాటే తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కూడా పూర్తి అవుతుందన్నారు. టాస్క్ ద్వారా ఇప్పటి దాకా ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. త్వరలోనే ఈ శిక్షణ కార్యక్రమాలను హెల్త్ సెక్టార్, ఫార్మా, ఆటోమోటివ్ రంగాలకు శిక్షణ కార్యక్రమాలను విస్తరించనున్నట్లు తెలిపారు. టాస్క్ కేంద్రాలను జిల్లాలకు విస్తరించేందుకు దశల వారీగా ప్రయత్నాలు ప్రారంభించాలని కెటిఆర్ అధికారులకు సూచించారు.

అంబేడ్కర్ వర్సిటీ ప్రవేశ పరీక్ష ఫలితాలు

మన తెలంగాణ/హైదరాబాద్: డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బిఆర్ఎ ఒయు) డిగ్రీలో ప్రవేశ అర్హత పరీక్షల ఫలితాలను ప్రకటించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయ పిఆర్‌వో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 14,518 మంది విద్యార్థులు హాజరుకాగా ఇందులో 12,018 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 6,173 మంది మహిళలు ఉండగా, 5,192 మంది పురుషులు ఉన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 24లోపు ఫీజును చెల్లించాలని ఆయన తెలిపారు.

విద్యాపీఠం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

మనతెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ సార్వ త్రిక విద్యాపీఠం "2017–18 విద్యా సంవత్సరా నికి" ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఆసక్తి ఉన్న వారు తమ దరఖాస్తులను సెప్టెంబర్ 14వ తేదీలోపు దరఖాస్తుల చేసుకోవాలని, మరిన్ని వివరాలకు తమ వెబ్‌సైట్ (www.telanganaopenschool.org) పొందపర్చినట్లు విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గురువారం ఒక ప్రకటలో పేర్కొన్నారు.

'నిన్నటి నేపథ్యం...రేపటి సంకల్పం'

నేటి నుంచి విక్రయం

మన తెలంగాణ/హైదరాబాద్: "నిన్నటి నేపథ్యం...రేపటి సంకల్పం" అనే అంశంపై సామాజిక, ఆర్థిక ముఖచిత్రం 2017 తెలుగు అనువాద పుస్తకం శుక్రవారం నుంచి అన్ని జిల్లా కలెక్టరేట్లు, గణాంకాల భవన్‌లో అందుబాటులో ఉంటుందని ప్రణాళిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.పి.ఆచార్య తెలిపారు. ఈ పుస్తకం విద్యార్థులకు, పరిశోధకులకు ఎంతో ఉపయోగ కరమని, దీనిని రూ.150 విక్రయించనున్నట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ఈ పుస్తకాన్ని ప్రణాళిక వైస్ ఛైర్మన్ ఎస్.నిరంజన్ రెడ్డి ఆవిష్కరించిన విషయం తెలిసిందే.

విదేశీ విద్యా నిధి పథకం సద్వినియోగం



మన తెలంగాణ/హైదరాబాద్: అంబేద్కర్ విదేశీ విద్యా నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకుని, రాష్ట్రానికి మంచి పేరు తీసుకు రావాలని ఎస్‌సి అభివృద్ధి శాఖ సంచాలకులు పి.కరుణాకర్ అన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్తున్న విద్యార్థులు మంచి ఫలితాలను సాధిం చాలన్నారు. హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో గురువారం ఓవర్‌సిస్ ఎంపిక కమిటీ ఇంటర్వ్యూలను నిర్వహించింది. ఈ పథకానికి 37 మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో 31 మంది విద్యార్థులు ఎంపిక య్యారు.కరుణాకర్ మాట్లాడుతూ విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుక వెళ్తున్న వారికి పలు సూచనలు సలహాలనిచ్చారు.

27 నుంచి ఉద్యాన మహోత్సవం



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని ఉద్యాన, పట్టు పట్టు పరిశ్రమల పంటల విశిష్టతను తెలిపేందుకు ఈ నెల 27వ తేదీ నుంచి 31 వరకు ఉద్యాన మహోత్సవాలు2017 నిర్వహించనున్నట్లు వ్యవసాయ, ఉద్యాన కార్యదర్శి సి. పార్థసారధి తెలిపారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో ఉన్న పీపుల్స్ ప్లాజాలో ఉద్యాన మహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యాన శిక్షణ సంస్థలో గురువారం మహోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై వివిధ కమిటీల ఛైర్మన్లు, సభ్యులతో పార్థసారధి, ఉద్యాన కమిషనర్ ఎల్. వెంకట్రామ్ రెడ్డి సమీక్షించారు. ఇతర రాష్ట్రాలలో ఉద్యానంపై నిర్వహించిన కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించి తదనుగుణంగా రైతులకు అన్ని రకాలుగా ఈ కార్యక్రమం ఉపయోగపడేలా ఏర్పాట్లు చేయాలని పార్థసారధి అధికారులను ఆదేశించారు.

రైల్వే ఖాళీలను భర్తీ చేయండి

రైల్వే సహాయ మంత్రికి ఎస్‌సిఆర్ఇఎస్ విజ్ఞప్తి

మన తెలంగాణ /హైదరాబాద్: రైల్వేలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి కార్మికులపై పనిభారాన్ని తగ్గించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ (ఎస్‌సిఆర్ఇఎస్) కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రాజెన్ గోహెన్‌కు విజ్ఞప్తి చేసింది. హైదరాబాద్‌లో స్వచ్ఛ రైల్ పక్షోత్సవాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన మంత్రి రాజెన్ గోహెన్‌ను ఎస్‌సిఆర్ఇఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.రాఘవయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం రైల్ నిలయంలో కలిసి ఒక విజ్ఞాపన పత్రాన్ని అందించింది. ఎస్‌సిఆర్ఇఎస్ అధ్యక్షులు జి.ప్రభాకర్ ఆండ్రూ, అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.భరణి భానుప్రసాద్, హైదరాబాద్ డివిజన్ అధ్యక్షులు కె.వి.ఆర్. ప్రసాద్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. రైల్వేలో పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఉద్యోగుల సంఖ్యను, బోగీలను పెంచాలని, ఎస్‌సిఆర్ పరిధిలో పిఒహెచ్‌ను ఏర్పాటు చేయాలని డాక్టర్ రాఘవయ్య సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆరోగ్య పరమైన సమస్యలను ఎదుర్కొంటున్న 20 ఏళ్ల లోపు సర్వీసు ఉన్న ఉద్యోగులను స్వచ్ఛంధ ఉద్యోగ విరమణకు అనుమతించి



పెన్షన్ ఇవ్వడంతో పాటు వారి పిల్లలకు ఉద్యోగాలను ఇవ్వాలని రాఘవయ్య మంత్రిని కోరారు. తాము లేవనెత్తిన సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని అనంతరం డాక్టర్ రాఘవయ్య మీడియాకు చెప్పారు.

గవర్నర్‌తో సిఎస్ భేటీ

మన తెలంగాణ/ హైదరాబాద్: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పి సింగ్ గురువారం రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌తో భేటీ అయ్యారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలు, ఉద్యోగుల పరస్పర బదిలీలపై చర్చించినట్ల తెలిసింది. దీంతో పాటు జిఎస్టీ అమలు తీరుతెన్నులు, డ్రగ్స్ కేసు, హరిత హారం, శాంతిభద్రతలు, ఉమ్మడి సమస్యలపై గవర్నర్ సమావేశాల కొనసాగింపు, ఐదు నెలల ఆదాయ, వ్యయాలపై కూడా ప్రస్తావించినట్లు తెలిసిం ది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి సుజనా చౌదరి గవర్న ర్‌ను కలిసారు. మర్యాదపూర్వకంగా కేంద్ర మంత్రి కలిసినట్లు సమాచారం.



ఉప రాష్ట్రపతి సన్మానానికి ఏర్పాట్లు

మనతెలంగాణ /హైదరాబాద్ : ఈ నెల 21న రాజ్‌భవన్‌లో పౌర సన్మానం అందుకోవడానికి రాష్టానికి వస్తున్న నూతన ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు రాక సందర్భంగా ఏర్పాట్లపై సచివాలయంలో సిఎస్ ఎస్‌పి సింగ్ సమీక్ష జరిపారు. బేగంపేట ఏయిర్‌పోర్టులో ఏర్పాట్లు ,రహదారుల మరమ్మత్తు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు వంటి అంశాలను చర్చించారు. ఉప రాష్ట్రపతి నేరుగా బేగంపేట ఏయిర్ పోర్టు నుండి నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్తారని, అనంతరం రాజ్ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వం పౌర సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారని సిఎస్ ఎస్‌పి సింగ్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు అధర్ సిన్హా, సునీల్ శర్మ, ఫైర్ సర్వీసెస్ డిజిపి రాజీవ్ రతన్, ఇంటలిజెన్స్ ఐజి ఎంకె సింగ్, ప్రొటోకాల్ డైరెక్టర్ అర్విందర్ సింగ్, ప్రోటోకాల్ డిఐజి అంజనీ కుమార్, హైదరాబాద్ ఇంఛార్జ్ కలెక్టర్ ప్రశాంతితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాచకొండ కమిషనరేట్‌కు విఎం హోం స్థలం

మన తెలంగాణ/హైదరాబాద్ : రాచకొండ పోలీసు కమిషనరేట్ కార్యాలయానికి స్థల కేటాయింపు ఒక కొలిక్కి వచ్చింది. సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ (విఎం హోమ్)కు చెందిన 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు డిజిపి కార్యాలయానికి సమాచారం అందింది. రెండేళ్ళ క్రితం సైబరాబాద్ కమిషనరేట్‌ను రెండుగా విభజించిన అనంతరం రాచకొండ కమిషనరేట్ ఏర్పాటైన విషయం తెలిసిందే. గడచిన ఏడాది కాలంగా రాయదర్గలోని సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయం నుంచి రాచకొండ కమిషనరేట్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. రాచకొండ కమిషనరేట్ పరిధిలోకి వచ్చే భువనగిరి, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు కమిషనరేట్‌కు వెళ్ళాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. కమిషనరేట్‌ను అన్ని ప్రాంతాలలో ప్రజలకు అనుకూలంగా ఉండే ప్రాంతంలో నిర్మించాలని భావించిన పోలీసు అధికారులు పలు ప్రాంతాలలోని స్థలాలను గడచిన ఏడాది కాలంగా పరిశీలిస్తున్నారు. చివరకు విఎం హోం స్థలాన్ని అనుకూలమైందిగా గుర్తించి ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అయితే విఎం హోం స్థలంపై కొన్ని కోర్టు వ్యాజ్యాలు ఉన్నందున అధికారుల నివేదికపై అన్ని కోణాలలో పరిశీలించిన అనంతరం చివరకు 10 ఎకరాల స్థలాన్ని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకటి రెండు రోజులలో స్థల కేటాయింపునకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నాయన్న సమాచారం అందడంతో అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థల కేటాయింపునకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడిన వెంటనే స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని, వీలైనంత తొందరగా అక్కడి నుంచే కమిషనరేట్ కార్యాలయ విధులను నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. పూర్తి స్థాయిలో కమిషనరేట్ భవనం అందుబాటులోకి రావాలంటే కనీసం నాలుగు సంవత్సరాలు పడుతుందని అధికారులు చెప్పారు.


2022 నాటికల్లా రైల్వే ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రాజెన్ గోహెన్

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో రైల్వేల విస్తరణకు కేంద్రం ఇతోధికంగా సహకరిస్తోందని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రాజెన్ గోహెన్ అన్నారు. రాష్ట్రంలోని ప్రస్తుతం కొనసాగుతున్న పనులకు కావాల్సిన నిధులను సంపూర్ణంగా కేటాయించామని చెప్పారు. బడ్జెట్‌లో తెలంగాణకు నిధులను పెంచామని 2016–17లో బడ్జెట్‌లో కేవలం రూ. 601 కోట్లను కేటాయించగా, 2017–18 బడ్జెట్‌లో రూ. 17,059 కోట్లకు పెంచినట్లు వివరించారు. ఒక రోజు పర్యటన నిమిత్తం గురువారం హైదరాబాద్‌కు వచ్చిన మంత్రి రాజెన్ గోహెన్ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే పనితీరుపై అధికారులతో సమీక్షించారు. రైల్ వికాస్ నిగం (ఆర్‌విఎన్ఎల్) చేపట్టిన పలు ప్రాజెక్టుల నిర్మాణ పురోగతిని, ప్రయాణికులు, సరుకు రవాణ, ఉద్యోగుల సంక్షేమం తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, డబ్లింగ్, ట్రిప్లింగ్, విద్యుదీకరణ పనులు అత్యంత వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి రాజెన్ ఈ సందర్భంగా చెప్పారు. దక్షిణ మధ్య జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్, అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్‌తో పాటు పలువురు రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరిగిన 'స్వచ్ఛ రైల్వేస్వచ్ఛ భారత్' రైల్వే పరిశుభ్రత వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. రైల్వే స్టేషన్‌ను పరిశీలించి ప్రయాణికుల సంఘాల ప్రతినిధులతో మంత్రి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రాజెన్ రైల్వే పనితీరు, చేపట్టిన కార్యక్రమాలపై మాట్లాడారు. హైదరాబాద్ చుట్టూతా ఉన్న ఔటర్ రింగ్‌కు ఆనుకుని 162 కిలో మీటర్ల పొడవునా సర్క్యులర్ రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను విస్తరిస్తామని, ఇందుకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌పై భారాన్ని తగ్గించేందుకు వీలుగా లింగంపల్లి, చర్లపల్లి, మౌలాలి రైల్వే స్టేషన్‌లను కూడా విస్తరిస్తామని పేర్కొన్నారు. ఖాజీపేటలోని రైల్వే వర్క్‌షాప్‌నకు కావాల్సిన స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని, స్థలం కేటాయించిన వెంటనే పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు.

చేరికలు నిరంతరం : లక్ష్మణ్

క్రమక్రమంగా రాష్ట్రంలో బిజెపి బలపడుతోందని, పార్టీలోకి చేరికలు నిరంతర ప్రక్రియ అని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి నిరంతరం తీసుకు వెళ్ళేందుకు పోలింగ్ బూత్ స్థాయిలో ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నామన్నారు. పార్టీ విస్తరణను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర కార్యాలయంలో కొన్ని మార్పులు, చేర్పులు చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెఎల్‌పి నేత జి. కిషన్ రెడ్డి, ఎంఎల్‌ఎలు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, నేతలు ప్రేంరాజ్ యాదవ్, ప్రేమేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





తాజ్ ధ్వంసం చేయాలనుకుంటున్నారా? : సుప్రీం

న్యూఢిల్లీ : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తాజ్‌మహల్‌ను నాశనం చేయాలనుకుంటున్నారా? అని సుప్రీంకోర్టు గురువారం కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజ్‌మహల్ పరిసరాలను దెబ్బతీసే చర్యలు తగవని ధర్మాసనం స్పష్టం చేసింది. మధుర నుంచి ఢిల్లీకి అదనపు రైల్వే మార్గం వేయడానికి తాజ్‌మహల్ సమీపంలో చెట్ల నరికివేతకు అనుమతిని ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయమూర్తులు మదన్ బి లోకూర్, దీపక్ గుప్తాతో కూడిన ధర్మాసనం ఘాటైన వ్యాఖ్యలకు దిగింది. ఖ్యాతి వహించిన కట్టడాన్ని సర్వనాశనం చేసేలా ఉన్నారే...ఇటీవలి కాలంలో ఈ అద్భుత కట్టడానికి ఎంతగా నష్టం వాటిల్లిందనేది గ్రహించారా? ఈ మధ్యకాలంలో ఛిద్రమైన చిత్తరువులు చూశారా? చూడకుంటే ఇంటర్నెట్‌లో చూడండని ధర్మాసనం చురకలు పెట్టింది. పర్యావరణవేత్త ఎంసి మెహతా దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ప్రేమకు చిహ్నంగా, చలువరాతితో షాజహాన్ నిర్మించిన అప్పటి ఈ కట్టడం ఇప్పుడు పాలకుల నిర్లక్ష్యానికి గురి కావడంపై వేదన చెందిన మెహతా తానే ఈ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తూ , దీని పరిరక్షణకు ఉద్యమిస్తున్నారు.

ప్రధాన పార్టీలకు కార్పొరేట్ మేత


న్యూఢిల్లీ: వివిధ కార్పొరేట్ సంస్థలు 2012–2013, 2015–2016 మధ్య నాలుగేళ్లలో మొత్తం రూ. 956.77 కోట్లు పార్టీలకు ఇచ్చాయి. అంతకు ముందు ఎనిమిదేళ్లలో అందిన కార్పొరేట్ విరాళాలు కేవలం రూ. 378.89 కోట్లు కాగా పైన పేర్కొన్న నాలుగేళ్లలో ఈ మొత్తం దాదాపు మూడు రెట్లు అధికం. 'అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్)' సంస్థ ఈ వివరాలు అందించింది. మన పార్టీలలో బిజెపి అత్యధికంగా రూ.705.81 కోట్ల విరాళాలు కార్పొరేట్ సంస్థల నుంచి పొందింది. ఆ తర్వాత రూ. 198.16 కోట్ల కార్పొరేట్ విరాళాలతో కాంగ్రెస్ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఉభయ కమ్యూనిస్టు పార్టీలయిన సిపిఐ, సిపిఎం ఈ విషయంలో తమ నిజాయితీని నిరూపించుకున్నాయి. ఆ రెండు పార్టీలు కార్పొరేట్ విరాళాల మసి అంటకుండా ఉద్యోగుల, కార్మికుల అసోసియేషన్లు, యూనియన్ల నుంచి పార్టీ విరాళాలు స్వీకరించాయి. 2004 నుంచి 2012 మధ్య 8 సంవత్సరాలలో వివిధ వ్యాపార రంగాల కార్పొరేట్ సంస్థల నుంచి అందిన మొత్తం కంటె 2016 ముందు నాలుగేళ్లలో పార్టీలకు కార్పొరేట్ సంస్థల నుంచి అధికంగా విరాళాలు అందడం రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అలా విరాళాలు పొందిన పార్టీలలో బిజెపి, కాంగ్రెస్, ఎన్‌సిపి, సిపిఐ, సిపిఎం విరాళాలను ఎడిఆర్ విశ్లేషించింది. అయితే బిఎస్‌పి విరాళాలు అందులో లేవు. రూ. 20,000 మించి స్వచ్ఛంద విరాళాలు కార్పొరేట్ సంస్థలతో సహా ఎవరి నుంచి ఆ కాలంలో తమకు అందలేదని ఆ పార్టీ ప్రకటించినందున ఆ పార్టీని పరిగణనలోకి స్వీకరించలేదు. వివిధ వ్యాపార రంగాల నుంచి పార్టీలకు అందిన విరాళాల శాతం కూడా ఆ విశ్లేషణలో పేర్కొన్నారు. ట్రస్టులు, గ్రూప్ ఆఫ్ కంపెనీల నుంచి 45.22 శాతం వస్తూత్పత్తి రంగం నుంచి 12.93 శాతం, రియల్ ఎస్టేట్ నుంచి 12.67 శాతం, గనులు నిర్మాణం ఎగుమతి దిగుమతుల రంగం నుంచి 9.11 శాతం, రసాయనాలు / ఔషధాల రంగం నుంచి 4.93 శాతం, విద్యుత్ చమురు 3.83 శాతం, ఆర్థిక సంస్థల నుంచి 3.77 శాతం విరాళాలు పార్టీలకు అందాయి. లోక్ సభ ఎన్నికలు జరిగిన 2014–15 ఆర్థిక సంవత్సరంలో మన జాతీయ పార్టీలు గరిష్ఠంగా కార్పొరేట్ విరాళాలను పొందాయి. 2012–13 నుంచి 2015–16 ఆర్థిక సంవత్సరాలలో మన జాతీయ పార్టీలకు అందిన మొత్తం కార్పొరేట్ విరాళాలలో ఎన్నికల ఏడాది ఒక్కదానిలో (2014–15 ఆర్థిక సంవత్సరం) అందినది 60 శాతం దాకా ఉంది. 2014–2015, 2015–2016 ఆర్థిక సంవత్సరాల మధ్య జాతీయ పార్టీలకు కార్పొరేట్ విరాళాల మొత్తం 86.58 శాతం తగ్గింది. పార్టీలకు విరాళాలు ఇచ్చిన అగ్రశ్రేణి కార్పొరేట్ సంస్థల్లో సత్య ఎలక్టరల్ ట్రస్ట్, జనరల్ ఎలక్టరల్ ట్రస్ట్ వంటివి ఉన్నాయి. మూడు జాతీయ పార్టీలకు 2012–16 మధ్య నాలుగేళ్లలో సత్య ఎలక్టరల్ ట్రస్ట్ అత్యధిక మొత్తం విరాళాలిచ్చిన దాతగా నిలిచింది. ఆ కాలంలో మొత్తం రూ. 260.87 కోట్లు ఆ సంస్థ విరాళంగా ఇచ్చింది. అది 35 సార్లు ఆ మొత్తాన్ని అందించింది. ఆ కాలంలో ఆ ట్రస్ట్ నుంచి రూ. 193.62 కోట్లు అందినట్లు బిజెపి ప్రకటించింది. కాంగ్రెస్‌కు అందిన మొత్తం రూ. 57.25 కోట్లు. ఎన్‌సిపి రూ. 10 కోట్లు ఆ ట్రస్ట్ నుంచి పొందింది. జనరల్ ఎలక్టరల్ ట్రస్ట్ బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు 2012–13, 2015–16 మధ్య అత్యధికంగా విరాళం ఇచ్చిన రెండవ కార్పొరేట్ సంస్థగా నిలిచింది. బిజెపికి రూ. 70.7 కోట్లు, కాంగ్రెస్‌కు 54.1 కోటి ఆ ట్రస్ట్ నుంచి ఆ కాలంలో విరాళాలు అందాయి. ఉభయ కమ్యూనిస్టు పార్టీలయిన సిపిఐ, సిపిఎంలకు 'అసోసియేషన్లు', 'యూనియన్లు' నుంచి అధికంగా విరాళాలు అందాయి. సిపిఐకి 15 అసోసియేషన్లు / యూనియన్ల నుంచి రూ. 14.64 లక్షలు అందగా, సిపిఎం 7 వేర్వేరు అసోసియేషన్ల నుంచి రూ. 1.09 కోట్లు విరాళంగా అందుకొంది.



విరాళాల చిట్టాలో బిజెపిదే అగ్రస్థానం

పార్టీలకు ఆయా రంగాల నుంచి అందిన విరాళాలు

రంగం	మొత్తం విరాళం (రూ.కోట్లలో)
ట్రస్ట్ మరియు గ్రూప్ ఆఫ్ కంపెనీలు	432.65
తయారీ	123.67
రియల్ ఎస్టేట్	121.23
మైనింగ్, నిర్మాణం, ఎగుమతులు/దిగుమతులు	87.2
రసాయనాలు/ఫార్మా	47.2
విద్యుత్/చమురు	36.67
ఆర్థిక	36.1
ఇతరులు	29.6
అసోసియేషన్లు/కార్పొరేషన్లు	14.45
హాస్పిటాలిటీ/ట్రావెల్స్	8.91
నౌకా పరిశ్రమ/రవాణా	5.01
విద్య	1.46
కమ్యూనికేషన్	1.08
ఆస్పత్రులు	1.06
గుర్తించనవి	10.48
మొత్తం	**956.77**



జాతీయ పార్టీలకు కార్పొరేట్ల నుంచి అందిన విరాళాలు (రూ. కోట్లలో)

పార్టీ	2012–13	2013–14	2014–15	2015–16	మొత్తం
బిజెపి	72.99	156.983	408.344	67.49	705.81
కాంగ్రెస్	7.545	53.516	128.11	8.99	198.16
ఎన్‌సిపి	0	14.00	36.47	0.26	50.73
సిపిఐ(ఎం)	1.46	0.08	0.235	0.117	1.89
సిపిఐ	0.042	0.03	0.024	0.083	0.18
మొత్తం	82.04	224.61	573.18	76.94	956.77

22న ఇయు నిరాహార దీక్షలు

మన తెలంగాణ /హైదరాబాద్ : టిఎస్‌ఆర్‌టిసిలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న అన్ని డిపోల ముందు సామూహిక నిరాహార దీక్షలను నిర్వహించనున్నట్లు ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి ప్రకటించారు. ఏప్రిల్ 1 నుంచి రావాల్సిన వేతన స్కేళ్లను వెంటనే అమలు చేయాలని, ఖాళీ ఉద్యోగాలను రెగ్యులర్ ప్రాతిపాదికన భర్తీ చేసి కార్మికులపై పనిభారాన్ని తగ్గించాలని, ఆర్‌టిసి అనుబంధ విభాగాల మూసివేతను ఆపాలని వారు ఆర్‌టిసి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సకల జనుల సమ్మె కాలానికి వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని, డ్యూటీ చార్టులను అమలు చేయాలని, రూట్ సర్వే చేసి రన్నింగ్ టైమ్ ఇవ్వాలని వారు కోరారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, అద్దె బస్సులను రద్దు చేసి సంస్థ కొత్త బస్సులను కొనుగోలు చేయాలని, కాలం చెల్లిన పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులను కొనుగోలు చేయాలని, మోటారు వాహనాల చట్టం ప్రకారం కార్మికులకు పని వేళలను అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా సంస్థ యాజమాన్యం స్పందించి కార్మికుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోనట్లయితే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

కృష్ణా బేసిన్‌లో ప్రాజెక్టుల డిపిఆర్‌లివ్వండి

మన తెలంగాణ/హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లో ఉన్న ప్రాజెక్టుల డిపిఆర్‌లు ఇవ్వాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కృష్ణా బోర్డు ఆదేశించింది. తెలంగాణలో ఆరు ప్రాజెక్టులు, ఆంధ్రప్రదేశ్‌లో 9 ప్రాజెక్టులకు సంబంధించిన డిపిఆర్‌లు ఇవ్వాలని కోరారు. ఇదేవిధంగా 22న విజయవాడలో జరిగే బోర్డు సమావేశంలో రెండో దశ టెలిమెట్రీ పాయింట్లను ఖరారు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ముచ్చుమర్రి, గుండ్రేవుల, గాజులదిన్నె ఆయకట్టు స్థిరీకరణకు ఎత్తిపోతల, గురు రాఘవేంద్ర ఎత్తిపోతల, పులికనుమ ఎత్తిపోతల, సిద్ధాపరం ఎత్తిపోతల, శివభాష్యం ఎత్తిపోతల, మున్నేరు ఎత్తిపోతల, రాజోలిబండ కుడి కాలువలకు సంబంధించిన డిపిఆర్‌లు ఇవ్వాలని సూచించారు. ఇదేవిధంగా తెలంగాణలోని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, డిండి ఎత్తిపోతల, భక్త రామదాసు ఎత్తిపోతల, తుమ్మిళ్ల ఎత్తిపోతల, కల్వకుర్తిలో అదనపు రిజర్వాయర్లు, వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుకు సంబంధించిన డిపిఆర్‌లు ఇవ్వాలని కోరారు. మైనర్ ఇరిగేషన్ వినియోగం లెక్కలు ఇవ్వాలని బోర్డు కోరింది.

పట్టణ ప్రణాళిక అధికారుల బదిలీ

మన తెలంగాణ/హైదరాబాద్: పట్టణ ప్రణాళిక విభాగంలో టౌన్‌ప్లానింగ్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. జిహెచ్‌ఎంసిలోని కొందరు అధికారులను జిల్లాలకు, జిల్లాలకు చెందిన కొందరు అధికారులను జిహెచ్‌ఎంసికి బదిలీ చేస్తూ పురపాలక శాఖ బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు 28 మంది అధికారులను బదిలీ చేశారు. కాగా పట్టణ ప్రణాళిక అధికారుల పదోన్నతులకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా గురువారం ప్రభుత్వానికి అందజేసినట్లు తెలిసింది. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నారు.

ఇఎస్‌ఐ వైద్యుల బదిలీలు

మన తెలంగాణ/హైదరాబాద్ : నలుగురు ఇఎస్‌ఐ వైద్యులను బదిలీ చేస్తూ కార్మిక, ఉపాధి కల్పనా శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సిర్‌పూర్ కాగజ్‌నగర్ ఇఎస్‌ఐ హాస్పిటల్‌కు చెందిన సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ సి.కిరణ్ కుమార్‌ను ఆర్.సి.పురం ఇఎస్‌ఐ హాస్పిటల్‌కు, వరంగల్ జిల్లా కరీమాబాద్ ఇఎస్‌ఐ డిస్పెన్సరీలో డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ ఎస్.వి.జయలక్ష్మి , సిర్‌పూర్ కాగజ్‌నగర్ ఎస్‌పిఎం కాలనీ ఇఎస్‌ఐ డిస్పెన్సరీలో పని చేస్తున్న డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ దీపా రెడ్డిని చిక్కడపల్లి ఇఎస్‌ఐ డిస్పెన్సరీకి, సిర్‌పూర్‌కాగజ్‌నగర్ ఇఎస్‌ఐ డిస్పెన్సరీ సివిల్ సర్జన్ డాక్టర్ బి.అరుణను గోల్కొండ ఇఎస్‌ఐ డిస్పెన్సరీకి బదిలీ చేశారు.

గుండె మార్పిడి శస్త్రచికిత్స సక్సెస్

మన తెలంగాణ/హైదరాబాద్: ఆరోగ్య శ్రీలో గుండె మార్పిడి శస్త్రచికిత్సను హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో విజయవంతంగా నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన త్రిష మండల్ అనే 12 ఏళ్ల బాలికకు శ్వాసతీసుకోవడంలో ఇబ్బందిపడే 'డిస్‌ప్నీయా' వ్యాధి వచ్చింది. గుండె పంపింగ్ సామర్థ్యంతో 60 నుంచి 70 శాతం వరకు రక్తం శరీరంలో సరఫరా కావాలి. కానీ ఈ అమ్మాయిలో కేవలం 10 నుంచి 15 శాతం మాత్రమే రక్తం పంపింగ్ అవుతోంది. దీనికి గుండె మార్పిడే పరిష్కారమని వైద్యులు తేల్చారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి ఆరోగ్య శ్రీ పథకం కలిసి వచ్చింది. శస్త్రచికిత్స అనంతరం త్రిష మండల్ ఆరోగ్యంగా ఉండడం, మేజర్ ఇన్‌ఫెక్షన్లేవీ సోకలేదు. శనివారం జరిగిన మీడియా సమావేశంలో త్రిష మండల్, ఆమె తల్లిదండ్రులు, వైద్యులు సందీప్ అతవర్, సమీర్, సునీల్ స్వాయిన్, ప్రశాంత్ పాటిల్, అంజు దయాల్, రమేష్ బాబు, అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. మరో రెండేళ్ల వరకు కూడా ఆరోగ్య శ్రీ పథకం సహకారంతో త్రిషకు వైద్యం, మందులు అందిస్తామని డాక్టర్లు తెలిపారు. డాక్టర్ సునీల్ మాట్లాడుతూ గుండెమార్పిడి కోసం జీవన్‌దాన్‌లో రిజిస్టర్ చేసి చికిత్స చేయడం వెనువెంటనే జరిగాయన్నారు.

ఔషధాలు, వైద్య ఉపకరణాల ధరలు తగ్గించాలి : ఎడిఇహెచ్

మన తెలంగాణ/హైదరాబాద్ : ఔషధాలు, వైద్య ఉపకరణాలను తగ్గించేందుకు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని అలయెన్స్ ఆఫ్ డాక్టర్స్ ఫర్ ఎథికల్ హెల్త్‌కేర్ (ఎడిఇహెచ్) డిమాండ్ చేసింది. ఎడిఇహెచ్ కోర్ కమిటీ సభ్యులు, పంజాబ్ మెడికల్ కౌన్సిల్ (పిఎంసి) మాజీ అధ్యమాలు డాక్టర్ జి.ఎస్.గ్రెవాల్, పిఎంసి నైతిక కమిటీ మాజీ చైర్మన్, ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్‌మెంట్ (ఐడిపిడి) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణ్ మిత్రా గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. వివిధ రకాల ఆర్థోపెడిక్ ఇంప్లాంట్స్ ధరలను తగ్గించాల్సిన ఆవశ్యకతపై జూన్ 29న నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ) ఛైర్మన్‌కు వివరణాత్మక వినతిపత్రాన్ని సమర్పించినట్టు వారు తెలిపారు. ఎడిఇహెచ్‌తో పాటు ఆల్ ఇండియా డ్రగ్ యాక్షన్ నెట్‌వర్క్ (ఎఐడిఎఎన్), ఐడిపిడి తదితర సంస్థలు ఔషధ ఉత్పత్తులపై దీర్ఘకాలంగా పోరాడుతున్నాయని అన్నారు. న్యాయవాది బీరేందర్ సంగ్వాన్ స్టెంట్స్ ధరలు తగ్గించాలని కోరుతూ న్యాయస్థానంలో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేయడంతో ప్రభుత్వం అనివార్యంగా ఈ సంవత్సరం ఫిబ్రవరిలో వాటి ధరలను తగ్గించిందన్నారు. ఔషధ ధరలను సమీక్షించేందుకు ప్రభుత్వం నియమించిన కమిటీ ఔషధ ధరలను తగ్గించాలని సిఫారసు చేసినప్పటికీ ఆ నివేదిక బహిర్గతం చేయలేదన్నారు. తక్షణమే ఆ కమిటీ నివేదికను బయటపెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఔషధ ఉత్పత్తులపై వాణిజ్య విధానాన్ని రూపొందించాలని వారు సూచించారు. ఔషధ ధరలు తగ్గించేందుకు మూసివేసిన ప్రభుత్వ రంగ ఔషధ తయారీ సంస్థలు ఐడిపిఎల్, హెచ్‌ఎఎల్ తదితర సంస్థలను తెరిపించాలన్నారు. ఈ సంస్థలు తిరిగి తెరిపించి బలోపేతం చేయగలిగితే ఔషధ ధరలు తగ్గుతాయన్నారు. వీటికి చవక ధరకు ఔషధాలను సరఫరా చేయడంతో పాటు విదేశాలకు ఎగుమతి చేసిన చరిత్ర ఉందన్నారు.

దసరా నాటికి పూర్వ జిల్లాల్లో వెల్‌నెస్ సెంటర్లు

ఆరోగ్య శ్రీ ఇజెహెచ్ఎస్ సిఇఒ డాక్టర్ కె.పద్మ



మన తెలంగాణ/హైదరాబాద్ : జర్నలిస్టులు, ఉద్యోగుల కోసం పూర్వ జిల్లా కేంద్రాలన్నింటిలో వెల్‌నెస్ సెంటర్లు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఉద్యోగులు, పాత్రికేయుల ఆరోగ్య పథకం (ఇజెహెచ్ఎస్) సిఇఒ డాక్టర్ కె.పద్మ తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 14 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలనుకున్న మేరకు ప్రస్తుతం ఖైరతాబాద్, వనస్థలిపురంలలో కొనసాగుతున్నాయని, పాతనగరంలో ఒక కేంద్రం ఏర్పాటుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకంపై జర్నలిస్టుల అవగాహనకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (టియుడబ్ల్యుజె) యూనియన్ నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసగించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ అధ్యక్షత వహించారు. హెల్త్ కార్డు అన్ని వ్యాధుల చికిత్సకు వర్తిస్తుందని అన్నారు. తొలుత 20,000 మంది జర్నలిస్టుల వరకు హెల్త్ కార్డులు పొందుతారని, వారి కుటుంబ సభ్యులతో కలిసి దాదాపు ఒక లక్ష మంది వరకు ఉంటారని భావించామన్నారు. అయితే గత సంవత్సరం కన్నా హెల్త్ కార్డుల రెన్యూవల్ తర్వాత ఈ సంఖ్య 6,000కు తగ్గిందన్నారు. ఆరోగ్య పథకంపై అపోహలు, ఇది అంత ఉపయోగమా అనే అనుమానాలతో ఎక్కువ మంది జర్నలిస్టులు హెల్త్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోకపోవడానికి కారణంగా భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ పథకం భాగంగా ప్రాథమిక పరీక్షలు, చికిత్సను వెల్‌నెస్ సెంటర్ల ద్వారా అందిస్తూ ఇన్‌పేషెంట్ సేవలు అవసరమైన వారికి కార్పొరేట్, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులకు సిఫారసు చేస్తున్నారన్నారు. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో కొన్ని ఆసుపత్రుల్లో కొన్ని విభాగాలకు మాత్రమే హెల్త్ కార్డు వర్తిస్తుందని, అన్ని విభాగాలకు వర్తించేలా మార్పు తీసుకువచ్చేందుకు ఆ ఆసుపత్రులతో చర్చిస్తున్నామన్నారు. జీవిత కాలం పాటు ఔషధాలను ఇచ్చే నిబంధనను ఉన్నప్పటికి ఔషధాలను నిల్వ ఉంచుకునే సౌకర్యం ఇంకా సమకూరనందున డిమాండ్ మేరకు రోగులకు వాటిని అందించడంలో కొంత జాప్యం జరుగుతుందన్నారు. పథకం ట్రయల్ రన్ స్టేజ్ (ప్రయోగాత్మక దశ)లో ఉందని, కొన్ని ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమేనని, దేశంలో ఇలాంటి ఉచిత పథకం అమలు మరే రాష్ట్రంలో లేదన్నారు. బహుశ ప్రపంచంలోనే ఇలాంటి పథకం అమలౌతున్న రాష్ట్రం తెలంగాణ కావచ్చని ఆమె అన్నారు. జర్నలిస్టుల్లో కొంత మందికి ఇప్పటికే ఇఎస్‌ఐ సౌకర్యం ఉన్నవారున్నారని, అలాంటి వారు ఇఎస్‌ఐ, ఇజెహెచ్ఎస్ పథకాల్లో ఏదో ఒకటి తమకు అనువైన దానిని ఎంచుకోవచ్చన్నారు. మిగిలినవి దసరా నాటికి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

త్వరలో ఎమర్జెన్సీ ఫోన్ నెంబర్

అత్యవసర పరిస్థితుల్లో ఏదేని ఆసుపత్రిలో చూయించుకోవచ్చని, అత్యవసర పరిస్థితుల్లో కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేరేటప్పుడు ఇబ్బందులు ఎదురౌతున్నాయని వస్తున్న ఫిర్యాదుల మేరకు త్వరలోనే అత్యవసర ఫోన్ నెంబర్‌ను అందుబాటులోకి తేనున్నామని చెప్పారు. అనంతరం జర్నలిస్టులు అడిగిన పలు సందేహాలను ఆమె నివృత్తి చేశారు. యాకుత్‌పురలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను చూశామని, దీనిని కేటాయించాలని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌కు లేఖ రాశామన్నారు. గచ్చిబౌలిలో స్థలం కేటాయింపు కోసం ఎదురు చూస్తున్నామన్నారు. హెల్త్ కార్డు ఉన్న జర్నలిస్టులు రాష్ట్రంలో ఎక్కడైనా దాని నుంచి ప్రయోజనం పొందవొచ్చని, జిల్లాల వారు హైదరాబాద్‌లో కూడా చూపించుకోవచ్చని వివరించారు. పథకం క్రింద ఉపయోగిస్తున్న ఇంప్లాంట్స్, స్టంట్స్ తదితరమైనవి తక్కువ ధరవనే అపోహ పడవద్దన్నారు. మలేరియా, డెంగీ కిట్స్‌ను వెల్‌నెస్ సెంటర్‌లో అందుబాటులో ఉంచామన్నారు. డెంగీ పాజిటివ్ వస్తే చికిత్స కోసం ఆసుపత్రులకు సిఫారసు చేస్తున్నామన్నారు. నిమ్స్‌లో బెడ్స్ దొరకడం లేదని వచ్చిన ఫిర్యాదును నిమ్స్‌కు పంపించినట్లు తెలిపారు. డయాలసిస్ ఎక్కడైనా చేసుకోవచ్చన్నారు. ఎం.ఎన్.జె క్యాన్సర్ ఆసుపత్రి ఎం.ఆర్.ఐను ఉచితంగా చేస్తారని, వెల్‌నెస్ సెంటర్ నుంచి రెఫర్ చేస్తే మిగిలిన ఆసుపత్రుల్లో 35 శాతం రాయితీ ఇస్తారన్నారు. పథకం అమలుపై ప్రతి మూడు నెలలకు ఒక సారి సమీక్షిస్తున్నామని, ఇక మీదట ప్రతి పక్షం రోజులకు ఒకసారి సమీక్షించాలని భావిస్తున్నట్టు పద్మ తెలిపారు. సన్‌షైన్ ఆసుపత్రిపై ఇచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తామన్నారు. ఈ పథకం క్రింద చికిత్స అందించే ఆసుపత్రులు చికిత్స వ్యయం రూ.5 లక్షలు, రూ.10 లక్షలు దాటిన సందర్భాల్లో ఎలాంటి చికిత్స అందిస్తున్నారో తమకు సమాచారం ఇవ్వాలనే నిబంధన ఉందన్నారు.

త్వరలో హెల్త్ డాటా : ఉద్యోగులు, జర్నలిస్టులు ఎలాంటి ఆరోగ్య అవసరాలు కలిగి ఉన్నారో తెలిపే హెల్త్ డాటా (ఆరోగ్య వివరాలు) త్వరలోనే అందుబాటులోకి వస్తాయని ఆరోగ్యశ్రీ ఇజెహెచ్ఎస్ సిఇఒ డాక్టర్ కె.పద్మ తెలిపారు. వెల్‌నెస్ సెంటర్లకు ఎలాంటి వ్యాధులతో ఎక్కువగా వస్తున్నారు. ఏ ఔషధాలు ఎక్కువగా అవసరమౌతున్నాయి. ఎలాంటి రోగ నిర్ధారణ పరీక్షలను ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారనే విషయాలు తెలుస్తాయన్నారు. ఈ వివరాలు తెలిస్తే అందుకు తగినట్టుగా భవిష్యత్తుల్లో పథకాన్ని మరింత మెరుగ్గా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని అన్నారు. జర్నలిస్టులు సహకరించాలని, పథకం మరింత మెరుగ్గా నిర్వహించేందుకు తగిన సూచనలు చేయాలని ఆమె అన్నారు.

సమావేశంలో ఐజెయు నాయకులు, టియుడబ్ల్యుజె సలహాదారు, మన తెలంగాణ దినపత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్‌రెడ్డి, ఐజెయు కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, హెచ్‌యుజె అధ్యక్షులు రియాజుద్దీన్, కార్యదర్శి శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

సిఓటికి తుమ్మిళ్ల టెండర్లు

ఎల్1గా నిలిచిన ఎస్ఇడబ్ల్యు

మన తెలంగాణ/హైదరాబాద్: తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం టెండర్లను కమిషనర్ ఆఫ్ టెండర్స్ (సిఓటి)కి పంపించారు. రాజోలిబండ మళ్లింపు పథకం (ఆర్‌డిఎస్) చివరి ఆయకట్టును స్థిరీకరించడం కోసం రూపొందించిన తుమ్మిళ్ల పథకానికి ఇటీవలే టెండర్లు పిలిచిన సంగతి తెలిసిందే. సుంకేశుల బ్యాక్ వాటర్ నుంచి తుమ్మిళ్ల గ్రామం వద్ద పంప్‌హౌజ్ ద్వారా నీటిని ఎత్తిపోసి ఆర్డీఎస్ కెనాల్‌లో పోస్తారు. ఈ పనికి రూ.162.2 కోట్ల అంచనాతో టెండర్లు పిలిచారు. 1.89 శాతం లెస్‌తో టెండర్లు దాఖలు చేసిన ఎస్ఇడబ్ల్యు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎల్1గా నిలిచింది. తర్వాత 0.6 శాతం లెస్‌తో తో మెగా ఇంజనీరింగ్ ఎల్2గా నిలవగా, 1.5 శాతం ఎక్సెస్‌తో టెండర్లు దాఖలు చేసిన ఎన్‌సిసి లిమిటెడ్ ఎల్3గా నిలిచింది. ఇందులో ఎస్ఇడబ్ల్యు సంస్థ ఎల్1గా నిలవగా, టెండర్లను పరిశీలన నిమిత్తం సిఓటికి పంపించారు. సిఓటిలో ఆమోదం పొందితే, సంబంధింత ఇంజనీర్లతో కంపెనీ ఒప్పందం చేసుకొని, పని మొదలుపెడుతుంది. ఇదిలా ఉండగా తుమ్మిళ్ల పనుల్లో ఇదివరకే రాజీవ్ దుమ్ముగూడెం, ఇందిరా దుమ్ముగూడెం ప్రాజెక్టులకు సంబంధించి కొనుగోలు చేసిన మోటార్లు, పైపులను వినియోగించనున్నారు. ఫలితంగా ఆర్థికంగా కలిసివస్తుంది. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు మేరకు 15 టిఎంసిల మేర ఆర్డీఎస్‌కు నీటి కేటాయింపులు ఉన్నాయి. కానీ గరిష్టంగా 5 టిఎంసిలకు మించి నీరు రావడం లేదు. ఆర్‌డిఎస్ నుంచి ఆంధ్రకు బలవంతంగా నీటి తరలింపునకు తోడుగా, తెలంగాణలోకి కెనాల్ రాకముందు కర్ణాటకలో ప్రవహిస్తోంది. ఇక్కడ కర్ణాటక రైతులు కాలువల్లో మోటార్లు దింపి, అక్రమంగా, ఇష్టారాజ్యంగా నీటిని మళ్లించుకోవడం ఆనవాయితీగా మారింది. ఫలితంగా తెలంగాణ సరిహద్దులోకి వచ్చేసరికే నీటి ప్రవాహం తగ్గుతుంది. ఒకవైపు ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలు కేటాయింపులకు మించి అధికంగా, అక్రమంగా వాడుకుంటుంటే, మరో వైపు తెలంగాణ సరిహద్దుల్లో పరిస్థితి విరుద్ధంగా ఉంది.

108 ఉద్యోగులతో అర్థాంతరంగా ముగిసిన చర్చలు


మన తెలంగాణ/హైదరాబాద్ : 108 ఉద్యోగులు, జివికె ఇఎంఆర్ఐ ప్రతినిధులకు రంగారెడ్డి జోన్ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (జెసిఎల్) ఆర్.చంద్ర శేఖరం సమక్షంలో జరిగిన చర్చలు అర్థాంతరంగా ముగిశాయి. 12 గంటల పని వేళలను 8 గంటలకు తగ్గించాలని, తొలగించిన ఉద్యోగులందరిని తిరిగి విధుల్లో చేర్చుకోవాలని, అక్రమంగా బదిలీ చేసిన ఉద్యోగులందరిని వారి పూర్వ స్థానాల్లోకి తిరిగి తీసుకునేలా ఆదేశించాలని కోరుతూ 108 ఉద్యోగుల సంక్షేమ సంఘం లేబర్ కమిషనర్‌కు జులై 18, 21 తేదీల్లో విన్నవించింది. ఈ నేపథ్యంలో జివికె ఇఎంఆర్ఐ యాజమాన్యం, ఉద్యోగులకు మధ్య చర్చల ద్వారా రాజీ కుదిర్చేందుకు గురువారం కార్మిక శాఖ ప్రధాన కార్యాలయంలో జెసిఎల్ చర్చలు జరిపారు. గురువారం మధ్యాహ్నం మొదలైన చర్చల్లో జివికె ఇఎంఆర్ఐ నుండి సిఒఒ బ్రహ్మానందరావు, ఉద్యోగుల సంక్షేమ సంఘం నుండి రాష్ట్ర అధ్యక్షులు పల్లె అశోక్ తదితరులు పాల్గొన్నారు. గురువారం సాయంత్రం తొలగించిన ఉద్యోగులను తీసుకునే అంశంపై ఇఎంఆర్ఐ ప్రతినిధి ససేమిరా అనడంతో లేబర్ కోర్టుకు వెళ్లాలని జెసిఎల్ సూచించారు. దీనితో ఎల్.బి.నగర్ అంబులెన్స్ పైలెట్‌గా విధులు నిర్వహించి సంవత్సరం క్రితం తొలగింపబడ్డ వీరాస్వామి(40) చర్చల మధ్యలో బయటికి వచ్చి తనతో తెచ్చుకున్న మందు (విషం) తాగాడు. దీనితో అర్థాంతరంగా చర్చలు ముగిశాయి. ఇదిలా ఉండగా ఆత్మహత్యాయత్నం చేసిన వీరాస్వామిని గాంధి ఆసుపత్రికి తరలించారు. జివికె ఇఎంఆర్ఐ ప్రతినిధి సంస్థ సజావుగా నిర్వహించేందుకు కొన్ని నిబంధనలు ఉన్నాయన్నారు. దీనితో జెసిఎల్ ఏ నిబంధనలున్నప్పటికీ అవన్ని భారత చట్టాలకు లోబడి ఉండాలన్నారు. 8 గంటల పని విషయంలో ఉద్యోగుల్లో విబేధాలున్నాయని, కొంత మంది 12 గంటలు కావాలని, మరికొంత మంది 8 గంటల పని దినం కావాలని కోరుతున్నారని ఆ ప్రతినిధి పేర్కొన్నట్టు సమాచారం. అందరూ ఉద్యోగులు 8 గంటల పని దినాలను కోరితే అదే అమలు చేయడానికి సిద్ధమని చెప్పారు. అదనపు నాలుగు గంటలకు డబుల్ ఒటి చెల్లించే విషయంపై తమ పై అధికారులతో మాట్లాడుతామని, ఈ విషయంలో సానుకూలంగా ఉన్నామన్నారు. బదిలీలపై నిబంధనలు సవరించే విషయంలోనూ సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు.

కార్మిక శాఖ ఆదేశాలు బేఖాతరు : పల్లె అశోక్

జివికె ఇఎంఆర్ఐ కార్మిక శాఖ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తోందని పల్లె అశోక్ ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2014 జనవరిలో రంగారెడ్డి జెసిఎల్ అశోక్ ఇచ్చిన ఆదేశం 8 గంటల పని దినాన్ని అమలు చేయడం లేదన్నారు.

ఉద్యోగులందరి నుండి 8 గంటల పని దినం అమలుకై సంతకాలను సేకరిస్తామన్నారు. సానుకూలంగా ఉన్నామని చెబుతున్నప్పటికీ జివికె రాతపూర్వకంగా ఎలాంటి హామి ఇవ్వడం లేదన్నారు. అంబులెన్సుల నిర్వహణపై జివికెతో ఎంఒయు ముగిసిపోయినప్పటికీ ప్రభుత్వం ఎందుకు కొనసాగించడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. 15 రోజుల్లో మరోసారి చర్చలు జరిగే అవకాశమున్నదని ఆయన తెలిపారు.

"మనం భోగభాగ్యాలతో తులతూగుతున్నప్పుడు మనల్ని మన మిత్రులు నలుగురూ గుర్తిస్తారు. మనం కష్టాల్లో ఉన్నప్పుడు మన మిత్రులెవరో మనం గుర్తిస్తాం.
– సర్దార్ వల్లభాయ్ పటేల్"



సంపాదకీయం

ప్రసారభారతి నియంతృత్వం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దూరదర్శన్ ప్రసారం చేసే ముఖ్యమంత్రి ప్రసంగపాఠం ఎలా ఉండాలో ప్రసారభారతి నిర్ణయిస్తుందా? దానికి ప్రీ సెన్సార్‌షిప్ అధికారం ఎక్కడినుంచి సంక్రమించిందో ప్రజా స్వామ్యవాదులు ప్రశ్నించాలి. ప్రసంగపాఠంలో సవరింపులు చేయాలన్న ఆకాశవాణి, దూరదర్శన్‌ల సూచనను త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ తిరస్కరించటంతో ఆయన ప్రసంగం ప్రసారం చేయబడ లేదు. ఒక ముఖ్యమంత్రి వాక్ స్వాతంత్ర్యాన్ని హరించిన ప్రసారభారతి చర్య అప్రజాస్వామికమేకాదు, పూర్తిగా నియంతృత్వం.

ముఖ్యమంత్రి సర్కార్ స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగాన్ని అగర్తలా ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాలు ఆగస్టు 12 న రికార్డు చేశాయి. ప్రసార భారతి నుంచి ఆదేశంతో ఆ ప్రసంగం ప్రసారం చేయలేకపోతున్నామని ఆగస్టు 14వ తేదీ సాయంత్రం 7 గంటలకు ఆ రెండు కేంద్రాలు ముఖ్యమంత్రికి వర్తమానం పంపాయి. ప్రసంగంలో మార్పులు చేయాలని, అలా అయితేనే ప్రసారం జరుగుతుందని సంబంధిత అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. అందుకు ఆయన నిరాకరిస్తూ, 'నా ప్రసంగం ఎలా ఉండాలో, నేను ఏమి మాట్లాడాలో ఆకాశవాణి, దూరదర్శన్ నిర్ణయిస్తాయా' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సర్కార్ తమ ప్రసంగంలో, దళితులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులను, ధనికులు–పేదల మధ్య పెరుగుతున్న ఆర్థిక అంతరాలను, సెక్యులరిజంపై జరుగుతున్న దాడులను, భారతదేశాన్ని ఏకమతరాజ్యంగా మార్చటానికి జరుగుతున్న ప్రయత్నాలను ప్రస్తావించారు. కేంద్రంలోని పాలకపార్టీ వీరవిధేయులైన ప్రసారభారతి అధికారులకు ఈ వాస్తవాలు రుచించలేదు. అందువల్లనే, రికార్డు చేసిన ముఖ్యమంత్రి ప్రసంగం సందర్భ పవిత్రతకు తగినట్లుగా లేదని ప్రసారభారతి అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియచేశారు. దాన్ని తిరగరాయాలని కోరారు. స్వతంత్ర భారతంలోని పరిస్థితులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గుర్తు చేసుకోవటం అసందర్భమా? వాస్తవాలు గుర్తిస్తేనే కదా దిద్దుబాటు చర్యలగూర్చి ఆలోచించటం సాధ్యం! ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాలు పాలకపార్టీ బాకాలుగా ఉండిన పరిస్థితిని మార్చటానికే, నిపుణుల కమిటీ సిఫారసు ప్రకారం ప్రసారభారతి సంస్థను ఏర్పాటు చేసి దానికి కొంతమేరకు స్వతంత్ర ప్రతిపత్తి ఇవ్వటం జరిగింది. అయితే దాని అధికారులు రాజభక్తి పరాయణులుగానే వ్యవహరిస్తున్నారనటానికి ఈ త్రిపుర సంఘటన తిరుగులేని దృష్టాంతం.

గత దసరా రోజున, సాంకేతికంగా ప్రైవేటు వ్యక్తి అయిన ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసిన ప్రసార భారతి అధికారులకు, ఒక రాష్ట్ర ప్రభుత్వ అధినేత అయిన ముఖ్యమంత్రి ప్రసంగం అభ్యంతరకరంగా కనిపించటంలోనే వారి సంకుచిత దృష్టి, నిరంకుశ పెత్తందారీతనం ప్రస్ఫుటమవుతున్నాయి. గోవుపేరుతో గుజరాత్‌లోని ఉనావ్‌లో దళితులను గోరక్షకులనబడే అగ్రవర్ణాలవారు చిత్రహింసలు పెట్టటం వాస్తవం కాదా? నిన్నగాక మొన్న స్వాతంత్ర్యదినం మరునాడు అదే రాష్ట్రంలోని మరో గ్రామంలో, మృత ఆవు చర్మాన్ని నిర్ణీత ప్రదేశంలో గాక శ్మశానం వద్ద ఒలుస్తున్నారంటూ దళితులపై అగ్రవర్ణాలు దాడి చేయటం వాస్తవం కాదా? గోమాంసం, గోరక్షణ పేరుతో ఉత్తరప్రదేశ్‌లో అఖ్లాక్‌ను, పెహ్లూఖాన్‌ను, రైల్లో జునైద్‌ను హత్యచేయటం, అనేక రాష్ట్రాల్లో దాడులు వాస్తవం కాదా? ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలవల్ల దేశంలో ఆర్థిక అంతరాలు అంతకంతకూ పెచ్చుపెరుగుతున్నట్లు ప్రభుత్వ, ప్రైవేటు అధ్యయనాలు తెలియచేయటం లేదా? కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల అండతో హిందూమత ఆధిపత్యం కొరకు హిందూత్వ భావజాల శక్తులు రెచ్చిపోవటం కళ్లకు కనిపిస్తున్న వాస్తవం కాదా? ఈ అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక పోకడల ప్రస్తావనకు ప్రసారార్హత లేదనటం భావ ప్రకటనా స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి. ఫెడరలిజం స్ఫూర్తికి విఘాతం. కాంగ్రెసేతర ముఖ్యమంత్రులతోపాటు ప్రజాస్వామ్య శక్తులు దీన్ని గుర్తించి ప్రసారభారతి చర్యను ఖండించాలి. సామాజిక బహుళత్వంతోపాటు రాజకీయ భిన్నత్వాన్ని గౌరవించటమే ప్రజాస్వామ్యానికి రాణింపు తెస్తుంది.

పెరుగుతున్న గృహ హింస

చూపు

గృహ హింస నుంచి మహిళలను రక్షించే చట్టం (పిడబ్ల్యుడివిఎ) వచ్చిన తరువాత ఈ 10 ఏళ్లలో జాతీయ నేరాల రికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా 10 లక్షల కేసులు దాఖలు అయ్యాయి. 2005–2015 దశాబ్దంలో 88,467 మంది మహిళలు గృహహింస పాలబడి మరణించారు. అంటే రోజుకి సగటున 22 మంది వరకట్న దురాచారానికి బలయ్యారు. ఒక్క 2015లోనే ఆ సమస్య 7,634 మంది మహిళల మరణానికి కారణమైంది. 2005లోనే గృహ హింస చట్టాన్ని చేసినా, 2014 నుంచి మాత్రమే ఎన్‌సిఆర్‌బి అటువంటి సమాచారాన్ని సేకరించడం మొదలు పెట్టింది. ఇప్పుడు పిడబ్ల్యుడివిఎ క్రింద ఎన్‌సిఆర్‌బి సేకరించిన సమాచారం కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కేసులకు సంబంధించినదే.

చట్టం క్రింద అటువంటి ఉల్లంఘనలను ప్రత్యేకంగా నిర్వచించారు. కేసు విచారణలో ఉండగా బాధితుల రక్షణకు కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయకపోవడం వంటి కేసులు అవి. అటువంటి కేసుల నమోదు 2014లో 8 శాతం (426) కాగా ఏడాదిలో 461కి పెరిగింది. ఇందులో గృహ హింసకు సంబంధించిన అసలు అంకెలు లేవు. భారతీయ శిక్షా స్మృతిలోని 3 సెక్షన్ల క్రింద వాటిని నమోదు చేస్తారు. అవి సెక్షన్ 498ఎ (భర్త, తదితరుల క్రూరత్వానికి సంబంధించిన కేసులు), సెక్షన్ 304 బి(వరకట్న మరణాల కేసులు), సెక్షన్ 306 (ఆత్మహత్యకు పురిగొల్పడం కేసులు). భర్త నుంచి, అతని బంధువుల నుంచి రక్షణ కోరే, జరుగుబాటు ఖర్చులు కోరే కేసులు ఆ చట్టం క్రింద నేరుగా కోర్టులో నమోదు అవుతాయి. ఎన్‌సిఆర్‌బి వాటిని రికార్డు చేయదు. మహిళా హక్కుల బృందాలు గట్టిగా ప్రయత్నిస్తే తప్ప ఆ సమాచారం లభించదు. ఆ చట్టం అమలులోకి వచ్చిన దశాబ్దం తర్వాత అది విజయవంతమైందా లేక విఫలమైందా అన్నది తేలకుండా ఉంది. ఎందుకంటే సమగ్ర సమాచారం అందుబాటులో లేదు.



అపరిష్కృతంగా అనేక కేసులు

ఢిల్లీ మహిళా కమిషన్ అధ్యక్షురాలు మాల్వాల్ జై హింద్ ఈ పరిస్థితి ఆందోళనకరమని పేర్కొన్నారు. ఎన్‌సిఆర్‌బి రికార్డు చేసిన కేసులలో కూడా అపరిష్కృతమైనవి అధికంగా ఉన్నాయి. 2015లో వరకట్న హత్య కేసులు 42,410 నమోదవగా వాటిలో 35,260 కేసులు (83 శాతం)2014లో తేలకుండా మరుసటి ఏడాది కేసులలో జమ అయినవి. 2015లో కూడా అన్నే కేసులు తేలకుండా మిగిలాయి. 'భర్త, బంధువుల క్రూరత్వం కేసులు 2015లో 1,13,000 దాఖలు అయ్యాయి. ఈ సంఖ్య 2006 లో కంటె 80 శాతం పెరుగుదలను సూచిస్తోంది. ఆ ఏడాది అటువంటి కేసులు 63,000 మాత్రమే. అటువంటి కేసులను రిపోర్టు చేయడం పెరిగినట్లు దీనివల్ల తెలుస్తోంది. చట్టంపట్ల అవగాహన పెరిగినకొద్దీ అటువంటి నేరాలపై ఫిర్యాదు చేయడం కూడా పెరుగుతోంది.

రాష్ట్రాల మధ్య ఈ నేరాల ధోరణులు వేర్వేరుగా ఉంటున్నాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో భర్త, బంధువులు క్రూరత్వం చూపిన కేసులు 2006–2015 మధ్య 36 శాతం తగ్గాయి. వరకట్న మరణాలు అదే కాలంలో 66 శాతం పెరిగాయి.

గృహ హింసకు సంబంధించిన ఖచ్చితమైన సమాచారం ఎన్‌సిఆర్‌బి వద్దలేదు. ప్రతి స్త్రీ కనీసం ఒక్కసారైనా భర్త నుంచి గృహ హింసకు (15–49 మధ్య వయస్కులైన) గురైనట్లు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో వెల్లడయింది.

ఆంధ్రప్రదేశ్‌లో 'భర్తనుంచి భార్యకు హింస ఎదురైన కేసులు' తగ్గినా ఇంకా 43.2 శాతం మంది గృహిణులు గృహ హింస పాలవుతున్నారని కుటుంబ ఆరోగ్య సర్వేలో తేలింది.

ఈ అంశంపై ఇతర సూచికలు కూడా మహిళలపై గృహ హింస తీవ్రత చట్టం వచ్చిన తర్వాత కూడా దేశంలో మారలేదని స్పష్టం చేస్తున్నాయి. అయితే చట్టం రాకతో అవగాహన పెరిగి గృహ హింసపై ఫిర్యాదులు పెరిగినట్లు వాషింగ్టన్‌లోని 'మహిళలపై అధ్యయనానికి అంతర్జాతీయ కేంద్రం', ఐక్యరాజ్య సమితి జనాభా నిధి వంటి సంస్థలు తెలిపాయి. చాలా మంది భారతీయ మహిళలు అగ్ని ప్రమాద దుర్ఘటనల్లో మరణిస్తున్నట్లు వాషింగ్టన్ యూనివర్శిటీ ప్రత్యేక విభాగం 'ఆరోగ్య గణాంకాలు, అంచనాలు' సంస్థ తెలిపింది.

ఏ ఇతర దేశంలో కంటే ఇటువంటి మరణాలు మనదేశంలో ఎక్కువ అని ఆ సంస్థ తెలిపింది.

దేశంలో ఈ సంఖ్య పాకిస్థాన్‌లో కంటె 18 రెట్లు, చైనాలో కంటె 38 రెట్లు అధికమని తేలింది. 2015లో 17,700 మంది భారతీయులు అగ్ని ప్రమాదాల్లో మరణించారు. వారిలో 62 శాతం (10,925) మంది మహిళలు.

ప్రధాన కారణం 'కట్నం'

దేశంలో మహిళలకంటె పురుషులే అధికంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు రికార్డులు తెలుపుతున్నాయి. ప్రాణాలు తీసుకోవడానికి అందుబాటులో ఉన్న అన్ని పద్ధతులను పురుషులు అనుసరిస్తున్నారు. అయితే ఒళ్లు అంటించుకోవడం ద్వారా ఆత్మహత్య చేసుకునేది అధికంగా మహిళలే అని కూడా తెలిసింది. 2015లో 3,723 మంది మహిళలు నిప్పు అంటించుకుని మరణించారు. వీరి సంఖ్య ఇప్పుడు 5,832కి పెరిగింది. ఆత్మాహుతి భారతదేశంలో సర్వసాధారణమని 2003నాటి అధ్యయనంలో జాతీయ నేరాలసర్వే తెలిపింది. వరకట్నం ఆధునిక కాలంలో మహిళను ఆత్మాహుతికి పురిగొల్పే కారణంగా మారింది. అనుకున్నంత కట్నం రాదని తేలిపోయినప్పుడు ఆ యువ గృహిణిని చంపివేయడమో, ఆత్మహత్యకు పురిగొల్పడమో సర్వసాధారణంగా జరుగుతోంది. మహిళలపట్ల సంప్రదాయవాదులు, ఆధునిక ఆలోచనాపరులు, మతవాదులు అందరూ అలక్ష్యం వహించడం సమస్యగా మారింది. ఇప్పుడు ప్రభుత్వాలు కూడా అదే తరహాలో అలక్ష్యం వహించడమే ఈ సమస్య పరిష్కారం కాకుండా మిగలడానికి అసలు కారణం.

✻ మనీషా చాబ్రా

పోరుబాటలో మున్సిపల్ కార్మికులు

తెలంగాణ రాష్ట్రం వస్తే కాంట్రాక్టు వ్యవస్థ రద్దు అవుతుందని కాంట్రాక్టు పద్ధతుల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు పర్మినెంట్ అవుతారని, ఆ లోపు వేతనాలు పెంచుతారని ఎన్నో ఆశలతో గత మూడు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కార్మికులకు నిరాశే ఎదురవుతున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై ముచ్చటగా మూడవ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నాము. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఆర్‌టిసి కార్మికులకు పిఆర్‌సి ద్వారా వేతనాలు పెంచారు. ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు, మంత్రులు, ముఖ్యమంత్రికి సైతం వేతనాలు పెరిగాయి. ఈ మధ్య కాలంలోనే అంగన్‌వాడీ, ఆశా, విఆర్‌ఏ, 108, హోం గార్డులు, విఏఒలకు కూడా వేతనాలు పెంచారు. మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని రాష్ట్ర వ్యాపితంగా 2015 జులైలో సమ్మె చేసిన సందర్భంగా హైదరాబాద్ జిహెచ్‌ఎంసిలో పనిచేస్తున్న మున్సిపల్‌లు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలలో పారిశుద్ధ్యం, పార్కులు, వాటర్ సప్లై, స్ట్రీట్‌లైటింగ్, మలేరియా, డ్రైవర్లతో పాటు వివిధ కేటగిరిలలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులుగా సంవత్సరాల తరబడి పనిచేస్తున్నారు. మున్సిపల్ కార్మికుల్లో అత్యధికులు దళిత, గిరిజన, బలహీన వర్గాలకు చెందిన నిరుపేదలు. పారిశుద్ధ్య(హీనమైన, మలినమైన) పనులను సమాజంలోని ఇతర కులాలు, వర్గాల వారు అసహ్యించుకొని వాటికి దూరంగా వున్న నేపథ్యంలో దళితులైన మున్సిపల్ కార్మికులు సమాజ హితం కోరి తరతరాలుగా ఈ పనుల్లో కొనసాగుతున్నారు. వారి ఆత్మ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని మున్సిపల్ కార్మిక సంఘాల జెఎసి భావిస్తున్నది.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు 2015 జులై నెలలో వేతనాన్ని రూ.8500/– నుండి రూ.12,500/–లకు పెంచారు. మళ్లీ 2017 మే 23న మరోసారి రూ.1500/–ల రూపాయలు పెంచి, నెలకు రూ.14,000/–లుగా వేతనాన్ని నిర్ణయించారు. జిహెచ్‌ఎంసిలో ప్రభుత్వం రెండు దఫాలుగా వేతనాలు పెంచటం పట్ల జెఎసి హర్షం వ్యక్తం చేస్తున్నది. కానీ కేవలం జిహెచ్‌యంసిలో పని చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు మాత్రమే వేతనాలు పెంచి, జిల్లాల్లో పనిచేస్తున్న మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల కార్మికులకు వేతనాలు పెంచకపోవడం అన్యాయం. సుప్రీంకోర్టు ఈ మధ్య కాలంలోనే ఒకే రకమైన పనులు చేస్తున్న వారి మధ్య వేతన వ్యత్యాసాలుండరాదని, కాంట్రాక్టు కార్మికుడికి సైతం పర్మినెంట్ ఉద్యోగితోపాటు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తీర్పునిచ్చింది.

> ఆగస్టు 4న రాష్ట్ర మున్సిపల్ పంచాయతీరాజ్, ప్రిన్సిపల్ సెక్రటరీకి, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ గారికి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ టోకెన్ సమ్మె నోటీసు ఇచ్చారు. కోర్కెలను పరిష్కరించనట్లయితే ఆగస్టు 29, 30 తేదీలలో టోకెన్ సమ్మె చేస్తున్నట్లు మున్సిపల్ కార్మికసంఘాల జెఏసి పిలుపిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కార్మిక సంఘాలతో చర్చలు జరిపి వారి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలి.

కార్మికులకు 2015 ఆగస్టులో వేతనాలు పెంచారు. రాష్ట్రంలోని మిగతా కార్పొరేషన్లలో, మున్సిపాల్టీలలో పనిచేస్తున్న వారికి పెంచుతామని హామీ ఇచ్చి ప్రభుత్వం కమిటీ వేసింది. కానీ 2 సం॥లు గడుస్తున్నప్పటికీ వేతనాలు పెంచలేదు. తిరిగి రెండవసారి 2017 మే 23న జిహెచ్‌యంసి పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు రూ.1500/–లు చొప్పున పెంచి నెలకు రూ.14,000/–లు గా నిర్ణయించారు. కానీ మూడేళ్లుగా జిల్లాల్లోని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, నగర పంచాయితీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు మాత్రం వేతనాలు పెంచకుండా ముఖ్యమంత్రిగారు మొండిచెయ్యి చూపారు. విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను వారి పి.ఎఫ్. ఖాతాల ఆధారంగా పర్మినెంట్ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. విద్యుత్ శాఖలో కాంట్రాక్టు కార్మికుల వలే మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు కూడా పిఎఫ్ ఖాతాలు ఉన్నాయి. అయినా మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసే ఊసెత్తడం లేదు.

జిహెచ్‌ఎంసిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వలే మాకూ వేతనాలు పెంచాలని, విద్యుత్‌శాఖలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తున్నట్లుగానే పిఎఫ్ ఖాతాల ఆధారంగా మున్సిపల్ కార్మికులను కూడా పర్మినెంట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘాల జెఏసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

జిహెచ్‌యంసితో సహా, రాష్ట్రంలోని మున్సిపాల్టీ అందుకు విరుద్ధంగా ఒకే రకమైన పనులు చేసే కాంట్రాక్ట్ కార్మికులకు జిహెచ్‌యంసిలో ఒక రకంగా, జిల్లాల్లో మరోరకంగా వేతనాలుండటం మరీ దారుణం. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి మున్సిపల్ కార్మికులకు కూడా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

2005 నుండి మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు 8వ పిఆర్‌సిలో నిర్ణయించిన పర్మినెంట్ ఉద్యోగి యొక్క మినిమమ్ బేసిక్‌నే కనీస వేతనంగా చెల్లిస్తున్నారు. ఇది 8వ, 9వ పిఆర్‌సిలలో అమలైంది. ఆ వేతనాలనే రాష్ట్రవ్యాపితంగా అందరికీ అమలు చేశారు. 2014 జూన్ 2 నుండి తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు 10వ పిఆర్‌సిని అమలు చేస్తున్నారు. గత సాంప్రదాయం ప్రకారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు 10వ పిఆర్‌సిలో నిర్ణయించిన మినిమమ్ బేసిక్ పేని కేటగిరీలను బట్టి కనీస వేతనాలుగా అమలు చేయాలి. కాని అలా చేయడం లేదు. అంతే కాకుండా రాష్ట్రంలో వివిధ శాఖలు సంస్థలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ ఓర్సింగ్ వారికి వేతనాలు నిర్ణయిస్తూ జి.వొ.నెం.14ను 19.2.2016 న విడుదల చేశారు. దాని ప్రకారం మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న వివిధ కేటగిరీల వారికి నెలకు రూ.12,000/–లు, 15,000/–లు, 17,500/–లు వారివారి కేటగిరిలను బట్టి నిర్ణయించి, అమలు చేయాలి. జి.వొ.నెం.14 విడుదలై 17 నెలలు గడుస్తున్నా నేటికీ జి.వొ నెం.14 మున్సిపల్ కార్మికులందరికీ అమలు చేయడం లేదు.

వేతనాలలో జాప్యం: ఇచ్చే అతి తక్కువ వేతనాలు నెలనెలా ఇవ్వకుండా అనేక మున్సిపాల్టీలలో పెండింగ్‌లో పెడుతున్నారు. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని మున్సిపల్ కార్మికుల పగలనక, రేయనక ఆరుకాలం చెమటోడ్చి శ్రమను ధారపోసినా చాలీచాలని వేతనాలతో కార్మికులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని జీవనం గడుపుతున్నారు. ఆర్థిక సమస్యలతో సతమతమౌతూ పిల్లల చదువులు సైతం మాన్పించి కూలీ పనులు చేయిస్తున్నారు. మున్సిపల్ కార్మికుల వేతనాలలో పిఎఫ్, ఇయస్ఐ కోసం డబ్బులు కట్ చేస్తున్నారు. కాని వారి ఖాతాల్లో జమ చేయడం లేదు. పిఎఫ్, ఇయస్ఐ డబ్బుల్లో లక్షలాది రూపాయల అవినీతి జరుగుతున్నది. కార్మికులకు ప్రతి నెల క్రమం తప్పకుండా వేతనాలివ్వాలని, పిఎఫ్, ఇయస్ఐ ఖాతాలను ఖచ్చితంగా నిర్వహించాలని, విద్యుత్ శక్తి శాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల్ని పర్మినెంట్ చేస్తున్నట్లుగానే మున్సిపల్ కార్మికుల్ని కూడా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నాము.

ఆందోళన బాటలో మున్సిపల్ కార్మికులు : తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి పోరాటాలే మార్గమని రాష్ట్రంలో మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో పని చేస్తున్న కార్మిక సంఘాలు మున్సిపల్ జెసి(ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, ఐఎఫ్‌టియు, బిఎంఎస్, హెచ్‌యంఎస్, ఎఐయుటియుసి, టిఎన్‌టియుసి)గా ఏర్పడి జిల్లాల వారీగా సదస్సులు, ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 4న రాష్ట్ర మున్సిపల్ పంచాయతీరాజ్, ప్రిన్సిపల్ సెక్రటరీకి, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ గారికి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ టోకెన్ సమ్మె నోటీసు ఇచ్చారు. కోర్కెలను పరిష్కరించనట్లయితే ఆగస్టు 29, 30 తేదీలలో టోకెన్ సమ్మె చేస్తున్నట్లు మున్సిపల్ కార్మికసంఘాల జెఏసి పిలుపిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కార్మిక సంఘాలతో చర్చలు జరిపి వారి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలి.

✻ పి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి,
తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్,
7382159040

తెలంగాణ శౌర్య కీర్తి పతాక సర్దార్ సర్వాయి పాపన్న



తాళ్లపల్లి యాదగిరి గౌడ్,
సీనియర్ జర్నలిస్టు(ఫ్రీలాన్సర్)
9949789939

సర్వాయి పాపన్న క్రీ.శ. 1650 ఆగస్టు 18న జనగామ జిల్లా పులగం (ఖిలాషాపురం) గ్రామానికి చెందిన గుర్తిగౌడ, సర్వమ్మ దంపతులకు జన్మించాడు. స్టేషన్ ఘనపురం మండలంలోని తాటికొండ గ్రామం పక్కన ఉన్న లింగంపల్లిలో పెరిగాడు. పాపన్న తండ్రి నాటి మహ్మదీయ పాలకుల ఆకృత్యాలకు ఎదురు తిరిగాడు. దీంతో నాటి పాలకులు ఆయనను హత్య చేశారు. విషయం తెలిస్తే తిరగబడి తనకు దూరమవుతాడనే బెంగతో తల్లి సర్వమ్మ పాపన్నకు ఏ విషయం తెలియకుండా పెంచింది. ఇరవై ఏళ్ళ వయసులో నాటి పాలకులు చేస్తున్న దోపిడీ ఆరాచకాలను ఆయన చూశాడు. ఈ దోపిడీ, దౌర్జన్యాలు పోవాలని, తెలంగాణపల్లెల్లో అట్టడుగు వర్గాలపై జరుగుతున్న దాడిని ఎదుర్కోవాలని పాపన్న నిర్ణయించుకుంటాడు. గోల్కొండ రాజ్యాన్ని ఆరవ కుతుబ్ షాహీ పాలిస్తున్న కాలంలో ఆయన ఆ సర్కారుపై తిరుగుబాటుకు బీజం వేశాడు. మిత్రులతో కలిసి పాలకులపై యుద్ధం చేశాడు. వీరోచిత పోరాటాలతో పేదలను రక్షించాడు. ఈ క్రమంలోనే ఆయుధాలు, సైన్యాన్ని పెద్ద ఎత్తున పోగు చేసుకున్నాడు. ఖిలాషాపురాన్ని కార్యక్షేత్రంగా చేసుకొని స్వతంత్ర రాజుగా ప్రకటించుకున్నాడు.

దీంతో జమీందారులంతా ఒక్కటై పాపన్న హత్యకు పథకం వేశారు. ఈ కుట్రను పసిగట్టిన పాపన్న ఖిలాషాపురం, తాటికొండ, జనగాం, హుస్నాబాద్ తదితర ప్రాంతాల్లో దాడులు ఆపి, తన సైన్యాన్ని అజ్ఞాతంలోకి పంపాడు. పాపన్న సహితం మారువేషంలో జగిత్యాల జిల్లాలోని చల్‌గల్‌గడీకి వెళ్లాడు. అక్కడ తనకు పరిచయం ఉన్న జమీందారు కొలాసా వెంకట్రావు వద్ద కొద్ది రోజులు వున్నాడు. విషయం తెలిసిన మహ్మదీయులు పాపన్నను బంధించడానికి దాడి చేశారు. శత్రువులకు దొరకకుండా తన అనుచరులతో హుజురాబాద్ తాలూకా మొలంగూరు వద్ద ఉన్న సర్వాయి పేట (సైదాపూర్ మండలం, పెరుకపల్లి)కి పాపన్న చేరుకున్నాడు. తర్వాత సర్వాయిపేట శివార్లలోని కోటగిరిగుట్టల్లో శత్రు దుర్భేద్యమైన కోటను నిర్మించి పాలన సాగించాడు. అప్పుడు మొదలైన తన విజయ పరంపరలో మచిలీపట్నం నుంచి బీజాపూర్, కొల్హాపూర్ వరకు కోటలు నిర్మించాడు.

ఔరంగజేబును సహితం ధైర్యంగా ఎదుర్కొన్నాడు. దీంతో ఖంగుతిన్న ఔరంగజేబు కొలనుపాక సర్దార్ రుస్తుందిల్ ఖాన్‌కు పాపన్నను అంతమొందించే బాధ్యత అప్పగించాడు. రుస్తుందిల్ ఖాన్ పాపన్నపై దాడి చేయగా అతడు ప్రతిఘటించడంతో పారిపోతాడు. ఈ సమయంలోనే ఢిల్లీలో ఔరంగజేబు వ్యాధి చేసి మరణించాడు. ఆయన మరణంతో గోల్కొండ రాజ్యంలో అనేక మార్పులు చోటు చేసుకొని మొగలుల పట్టు తప్పిపోయింది. ఇదే అదనుగా పాపన్న దాడులను ఉధృతం చేసి కోటలను గెలుచుకున్నాడు. ఆ సమయంలో ఔరంగజేబు కుమారుడు బహద్దూర్ షా ఢిల్లీకి బాద్‌షా అయ్యాడు.

తెలంగాణలో తమ పాలనకు పూర్వ వైభవం తేవడానికి పాపన్నను చంపాలని నిర్ణయించాడు. తన సైన్యాన్ని ఖిలాషాపురం కోటపైకి దాడికి పంపించాడు. ఇందులో పాపన్న తన సైన్యాన్ని పెద్ద ఎత్తున కోల్పోతాడు. అలాగే ఆప్తమిత్రుడు, వీరాధివీరుడు సర్వన్న సైతం మృత్యువాతపడ్డాడు. దీంతో అతడి స్మారకచిహ్నంగా సర్వాయి పేటలో సర్వన్న చెరువును తవ్వించాడు.

గోల్కొండ కోటపై పాపన్న జెండా ఎగురుతున్న క్రమంలో బహద్దూర్ షా కుయుక్తులు పన్నాడు. ధనరాశులకు లొంగిపోయిన ద్రోహులు కుట్ర చేసి పాపన్నను తీవ్రంగా గాయపరిచారు. అక్కడి నుంచి తన మిత్రుడు, యుద్ధ వీరుడు మీరా సాహెబ్ తప్పించి జగిత్యాలలోని చల్‌గల్‌గడీ యజమాని వెంకట్రావు వద్దకు తీసుకెళ్లాడు. అతడు ఆశ్రయ మిచ్చినట్టే ఇచ్చి పాపన్నను హతమార్చడానికి నియమించబడిన దిలావర్ ఖాన్ నుంచి రూ.10,000 లంచంగా తీసుకొని అతడికి పాపన్నను పట్టి ఇచ్చాడు. దీంతో సర్దార్ సర్వాయి పాపన్నను బంధించి గోల్కొండ కోటకు తీసుకెళ్లారు.



పాపన్నను, అతడి మిత్రుడు మీరా సాహెబ్‌ను కోట ప్రధాన ద్వారం ముందు నరికి చంపారు. వారి తలల్ని కోట గుమ్మానికి వేలాడ దీశారు. పాపన్న, మీరాసాహెబ్‌ల మొండాలను గుర్రాలతో ఈడ్చి హైద్రాబాద్ వీధుల్లో తిప్పుతూ ప్రజల్లో భయాందోళనలు కలిగించారు. సర్కారుపై తిరగబడిన వారందరికీ ఇలాగే మరణ దండన విధించబడుతుందని హెచ్చరించారు.

ఇంతటితో ఊరుకోకుండా పాపన్న, మీరా సాహెబుల తలలను ఢిల్లీకి మొగులాయి పాదుషా బహద్దూర్ షాకు కానుకగా పంపారు. ఈ విధంగా పాపన్న, మీరాసాహెబుల భారతమాత కంఠాన మణిహారాలై మహోజ్వలంగా ప్రకాశించారు. పేదల రక్షణ కోసం పోరాటమే కాదు, పేదల రాజ్యాన్ని నిర్మించిన సర్దార్ సర్వాయి పాపన్న చరితార్థుడు.

(ఆగస్టు 18 సర్దార్ సర్వాయి పాపన్న జయంతి)



మన రాష్ట్రం మెట్ట ప్రాంతం అయినందువల్ల నీటి కొరత ఉండి ముందు నుంచి కూడా వాణిజ్య పంటలను వేయలేదు. సాధారణంగా వాణిజ్య పంటలను వేసినట్లైతే వాటిని కాపాడుకునేందుకు ఎక్కువ మోతాదులో రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడాల్సి వచ్చేది. కాని అది జరగలేదు, దాంతో రసాయనాల ప్రభావం ఇక్కడి భూముల్లో అంతగా లేదనే చెప్పొచ్చు. భూసారాన్ని కాపాడుకోవాలంటే ప్రభుత్వం సేంద్రియ పద్ధతుల్లో చేసే వ్యవసాయాన్ని, సాగు పద్ధతులను ప్రోత్సహించాలి. ప్రస్తుతం మన రాష్ట్రంలో సేంద్రియ సేద్యాన్ని ప్రోత్సహించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని చాలామంది అభిప్రాయపడుతున్నారు. సేంద్రియ సేద్యాన్ని ప్రోత్సహించకుండా కేవలం ఉత్పత్తులపై రాయితీలు ఇవ్వడం ఆశ్చర్యం కలిగించే అంశం. సేంద్రియ ఉత్పత్తులకు లేని నిబంధనలు వాటిని పండించే రైతులకు వర్తింపజేయడం, సేద్యానికి సర్టిఫికెట్లు పొందాలనడం ఏంటన్నది రైతులడుగుతున్న ప్రశ్న. సేంద్రియ వ్యవసాయం, సాగు చేసే ప్రతి రైతుకు సరిపడ ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టి, ఈ రకమైన పద్ధతులను పాటించే వారికి నిబంధనలతో సంబంధం లేకుండా సేంద్రియ సాగు అనే ధ్రువీకరణ పత్రం అందివ్వాలని వారు కోరుకుంటున్నారు. ప్రభుత్వాలు ఇటువంటి పారదర్శక నిర్ణయాలు తీసుకుంటే తప్ప కార్పొరేట్ రసాయన ఎరువుల, పురుగుమందు కంపెనీల ఏకచ్ఛత్రాధిపత్యం నుంచి సామాన్య రైతు బయటపడడన్న భావన వ్యక్తమవుతోంది.





సహజ సాగుతో వర కూరగాయలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామానుజవరం గ్రామం కృషీవలులకు మారుపేరుగా నిలుస్తుంది. గ్రామ పొలిమేరల నుంచే పచ్చని ప్రకృతి అందాలు కనువిందుచేస్తాయి. "కృషితో నాస్తి దుర్భిక్షం" అన్నది ఆ గ్రామం చెప్పకనే చెబుతుంది. సింగరేణి నిర్వాసిత గ్రామమైన రామానుజవరంలో నివసించే



దాదాపు 200 కుటుంబాలు కేవలం కష్టాన్ని దున్ని పచ్చటి పంటలను ప్రతిఫలంగా పొందుతున్నారు. గ్రామంలో ఉన్న ప్రతి కుటుంబం వారి ఇంటి పరిసరాల్లో ఉన్న ఖాళీ స్థలాన్ని కూరగాయల సాగుతో సద్వినియోగం చేసుకుంటోంది. ఇంట్లో ఆడవారు పొద్దంతా పెరటితోటల పెంపకంలో తలమునకలవుతే, పండిన పంటను సమీప సింగరేణి క్వార్టర్లలో అమ్ముతూ మగవారు చేయూతనిస్తున్నారు. ఇదంతా అక్కడ నివసించే కుటుంబాల సమష్టితత్వాన్ని తెలియజేస్తే, కేవలం సేంద్రియ పద్ధతుల్లోనే కూరగాయల సాగు చేయడం ఈ గ్రామంలోని మరో విశేషం. తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన సేంద్రియ పెరటితోటల పెంపకాన్నే నేటికీ పాటిస్తున్న ఈ కర్షకులు కేవలం శ్రమనే నమ్ముకొని జీవిస్తున్నారు. వారి శ్రమైక జీవన సౌందర్యం... వారు పెంచుతున్న పెరటి తోటల్లో ప్రతిబింబిస్తోంది. ఈ పచ్చటి పల్లె గ్రామపంచాయితీ పరిధిలో ఉంది. అయితే పెరటితోటల సాగులో ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, సబ్సిడీలు ఇంతవరకు అందింది లేదని గ్రామస్థులు బోరుమంటున్నారు. ఈ పచ్చ పచ్చాని పల్లెకు సంబంధించిన మరిన్ని ముచ్చట్లీవిధంగా ఉన్నాయి...

తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా : గ్రామపంచాయితీ పరిధిలో ఉన్న ఈ గ్రామంలో దాదాపు 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరంతా సింగరేణి ఓపెన్‌కాస్ట్‌లో భూములు కోల్పోయి ఇక్కడ నిర్వాసితులుగా ఉన్నారు. వారికి అందుబాటులో ఉన్న భూమిని సాగుచేస్తూ సేంద్రియ పద్ధతుల్లో పెరటి తోటలు పెంచుతున్నారు. సమీపంలో గల దాదాపు 2500 సింగరేణి కుటుంబాలకుఆరోగ్యకరమైన ఆకు కూరలు, కూరగాయలు అందిస్తున్నారు. అయితే వీరు పాటించే సాగుపద్ధతులు ఎక్కడో నేర్చుకున్నవి కావు, వారి తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా పొందిన పద్ధతులనే నేటికీ అనుసరిస్తున్నారు. సేంద్రియ ఎరువులతో సీజనల్‌గా కూరగాయల సాగు చేసే వీరు పంటకు పంటకు మధ్యన భూమిని సారవంతం చేసేందుకు పేడ, గొర్రె ఎరువు వేసి భూమిని దున్నుతారు. ఆ తరువాత ఇంకోరకం కూరగాయలసాగు కొనసాగిస్తారు. పంట పండించే సమయంలో వర్మి కంపోస్ట్ మాత్రమే వాడతారు. అదృష్టవశాత్తు ఇంతవరకు ఇక్కడ పండించిన పంటలకు క్రిమి కీటకాలతో ముప్పు ఏర్పడలేదని గ్రామస్థులు చెప్పారు. పురుగుమందుల వాడకం లేకపోవడంతో కాలుష్యకార కాలు భూమిలో చేరలేదు. సంప్రదాయ సాగు పద్ధతులనే అను సరి స్తున్నందున భూసారం భద్రంగా ఉంది క్కడ.

ఒక్క ఫోన్‌కాల్‌తో ఇంటికే కూరగాయలు: సమీపంలో ఉన్న సింగరేణి క్వార్టర్లలోని కుటుంబాలకు వీరు సాగుచేసిన కూరగాయలను తాజాగా అమ్ముతారు. అశ్వాపురం భారజల కర్మాగారంలో నివాసముండే కుటుంబాలకు వారాంతపు సంతలో వీరు పండించే కూరగాయలను అమ్ముతూంటారు. ఈ కూరగాయలకు అలవాటుపడినవారు సాధారణంగా వేరేవాటి జోలికి వెళ్లరని ఇక్కడ సాగు చేస్తున్నవారు చెబుతున్నారు. ఒక్క ఫోన్ కాల్‌తో గృహస్తులకు కావల్సిన కూరగాయలను అందించడంతో ఇక్కడ నివసించే పలు కుటుంబాలకు ఈ గ్రామస్థులు సుపరిచితం అయ్యారు. ఉద్యోగ విరమణ చేసి సిటీలో స్థిరపడిన సింగరేణి కార్మికులు, అధికారులు కూడా ఇక్కడి ఆకుకూరలు, కూరగాయలను వారానికోసారి సిటీకి తెప్పించుకుంటారు. మరి దీని వెనక ఉన్న సీక్రెట్ ఏంటని అడిగినప్పుడు గ్రామస్థులిచ్చిన సమాధానం "రుచి". ప్రభుత్వ ప్రోత్సాహం అందించాలని వారికి అందుబాటులో ఉన్న వనరులనుపయోగించుకుంటూ, సంప్రదాయ పద్ధతుల్లో మాత్రమే పెరటితోటల పెంపకం చేపట్టి కూరగాయలను సాగు చేస్తున్న వీరికి ప్రభుత్వ నుంచి ఎటువంటి ప్రోత్సాహం అందలేదు. అధికారులకు, స్థానిక సర్పంచ్‌కు గ్రామసభలో అనేకమార్లు విన్నవించుకున్నా తమ గోడు పట్టించుకోవడంలేదని వీరంటున్నారు. ఎండాకాలంలో ఏర్పడే నీటి కొరతకు డ్రిప్ ఇరిగేషన్ సదుపాయం ఏర్పర్చుకుంటే కొంత కలిసివస్తుందని, కాని అంత డబ్బు ఖర్చుచేసే తాహతు లేదని అంటున్నారు. పందిరి గుంజలు, డ్రిప్ సిస్టం వంటి సదుపాయాలను ఒక్కసారి సమకూర్చితే కొన్ని సంవత్సరాలవరకు తిరిగిచూసుకోవాల్సిన అవసరం ఉండదు, ఈ విషయంలో ప్రభుత్వం చొరవచూపాలని కోరుతున్నారు.



సేంద్రియ ఎరువులు, జీవ సంబంధ ఎరువులకు సంబంధించి యూనిట్లు నెలకొల్పితే నాబార్డ్, ఎన్‌సిడిసిలు సంయుక్తంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ ద్వారా క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ స్కీములందిస్తోంది. ఈ స్కీము కొత్తగా నెలకొల్పే, నెలకొల్పిన యూనిట్లకు వర్తిస్తుంది. బయో ఫర్టిలైజర్లు, పెస్టిసైడ్లు తయారుచేయాలనుకునేవారికి అందించే సబ్సిడీలను వ్యక్తిగతంగా, రైతులు గ్రూపులుగా ఏర్పడి పొందవచ్చు వీరే కాకుండా ఎన్‌జివోలు, కోపరేటివ్ సొసైటీలు, ఫర్టిలైజర్ ఇండస్ట్రీలు, కంపెనీలు, కార్పొరేషన్లకు కూడా ఈ వెసులుబాటు ఉంది. పండ్లు, కూరగాయల నుంచి కంపోస్ట్‌ను తయారుచేసే మున్సిపాలిటీలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఎన్‌జివోలు, పారిశ్రామికవేత్తలు కూడా ఈ స్కీమ్ కింద రాయితీలు పొందవచ్చు. వీటికి సంబంధించిన రాయితీలు ఒక యూనిట్ మొత్తం విలువలో 25% రాయితీ లభిస్తుంది, ఇది రూ.40 లక్షల వరకే వర్తిస్తుంది. అదే పండ్లు, కూరగాయల కంపోస్ట్ యూనిట్ మొత్తం విలువలో 33% రాయితీ ఉంటుంది, ఇది కూడా రూ.60 లక్షల వరకే వర్తిస్తుంది.

ఈ రెండు స్కీముల్లో భూమి కొనుగోలు చేసిన విలువ, సివిల్ పనులు, సంబంధించిన మెషినరీ, ప్లాంట్, శాస్త్రీయ పరికరాలు, ఎక్విప్‌మెంట్ మొదలగువాటిని కూడా యూనిట్‌లో భాగంగా చూపించవచ్చు. అయితే భూమి విలువ మొత్తం ప్రాజెక్టు విలువలో 10% మాత్రమే ఉండాలి. అలాగే భూమి, బిల్డింగు విలువ మొత్తం యూనిట్ విలువలో 50% మించకూడదు. ఈ సబ్సిడీని నాబార్డు గుర్తించిన బ్యాంకులు ద్వారా పొందవచ్చు. ప్రాజెక్టుకు సంబంధించిన రిపోర్ట్ అందించాక 50%, ఇన్స్‌పెక్షన్ అనంతరం మిగతా 50% రాయితీని ఇస్తుంది నాబార్డ్. ఈ రుణాలను పది సంవత్సరాల్లో తిరిగి చెల్లించాలి దీనికి గ్రేస్ పీరియడ్ మరో రెండేళ్లు. ముఖ్యంగా సేంద్రియ వ్యవసా యంలో మహిళలు ముం దుండి సహకార సంఘాలుగా ఏర్పడి, సీడ్ బ్యాంకులు, భూసార పరిరక్షకులుగా మారితే సేంద్రియ వ్యవసా యం కొత్తపుంతలు తొక్కుతుంది.



మాడుగుల దీప్తి రెడ్డి,
సిఇవొ(ఇద్వా), ఆర్గానిక్ గంప.

మా దగ్గర మాత్రమే కొంటారు

గత 25 సంవత్సరాలుగా కూరగాయల సాగు చేస్తున్నాం. సేంద్రియ పద్ధతులే అనుసరిస్తున్నాం. సీజన్‌కు తగ్గట్లుగా కూరగాయలను పండిస్తాం. ఇంటి వెనక ఉన్న ఒక గుంట జాగాలో ప్రస్తుతం ఆనిగపుకాయ, పొట్లకాయ, గోంగూర సాగు చేస్తున్నాం. దిగుబడి కూడా బాగానే ఉన్నది. మార్కెట్ కూడా బాగానే ఉంది. సంపాదనే తిరిగి పెట్టుబడిగా పెట్టాల్సివస్తుంది తప్ప డబ్బు దాచుకునేందుకు మిగలడం లేదు. ఇలాకాకుండా ఉండాలంటే ప్రభుత్వం మాకు కొంత సాయం అందిస్తే బాగుంటుందన్నది ఆశ. ఎన్నో సార్లు సర్పంచికి మా గోడు వెళ్లబోసుకున్నా సమస్య పరిష్కారం కావడంలేదు.

శాశ్వతంగా వేసుకునేవీలున్న పందిరి గుంజలను, తోటకు నీరు పెట్టేందుకు డ్రిప్ సెట్లను అందించాలని కోరుతున్నాం. మేం పండించే కూరగాయలను తిన్నాక వీటినే తిరిగి కావాలని కోరుకుంటారందరు. దాంతో మా మార్కెట్ మాకు స్థిరంగా ఉంది.



రమాదేవి, రైతు

కూరగాయలు కావాలంటే ఫోన్ చేస్తారు

మా ఇంటి ముందున్న 18 సెంట్ల(100 సెంట్లు ఒక ఎకరం) భూమిలో అన్నిరకాల ఆకుకూరలు సాగుచేస్తాం. ఇంటి ఎదురుగా, పక్కన ఉన్న ఖాళీ స్థలంలో బెండ, బీర, మిర్చి, కరివేపాకు వంటి కూరగాయలను సాగుచేస్తున్నాం. గత 20 సంవత్సరాలుగా కూరగాయల సాగే మాకు జీవనోపాధి అయ్యింది. సీజనల్‌గా కూరగాయల సాగు చేస్తున్నాం. దగ్గరలో ఉన్న సింగరేణి కార్మికులు, అధికారులు మేం పండించే కూరగాయలను కొనుగోలు చేస్తారు. అశ్వాపురం సంతలో, దగ్గర్లోని సి టైప్ క్వార్టర్లలో కూరగాయలను అమ్ముతాం, గత కొన్నేళ్లుగా ప్రతిరోజు కూరగాయలమ్ముతున్నందున మేం అందరికీ పరిచయమయ్యాం. కూరగాయలు కావాల్సినవారు ఫోన్ చేసి అడిగితే ఇంటికి వెళ్లి అందిస్తాం. మార్కెట్ బాగానే ఉంది, రోజుకు ఖర్చులుపోను రూ.500 వరకు మిగులుతాయి. ఎంతసేపూ రెక్కల కష్టంతోనే బతకడం ఒక్కరోజు కూరగాయలు అమ్మకపోయినా ఆర్థికంగా ఇబ్బంది ఉంటుంది. ప్రభుత్వం మాకు కొంత సాయం అందించాలని కోరుతున్నాం.



సంధ్య, రైతు

పారిశుద్ధ్యానికి పండుగ రూపం

మీటింనియో

మనకు తెలిసినంత వరకు పండుగలన్నీ ఇష్టమృష్టాన్న భోజనాలు చేయడానికి విందులు, వినోదాలలో మునిగితేలడానికే తప్ప పారిశుధ్యం, పరిసరాలు, ఊరిబాగోగులు పట్టించుకునేవిగా కనబడవు. ఊరంతా ఏకమై ఒక చోట చేరి ఆడిపాడితే బాగానే ఉంటుంది. సందడి సందడిగా, కోలాహలంగా కూడా ఉంటుంది. కానీ వందలు, వేల సంఖ్యలో జనం చేరి వెళ్ళిపోయిన తర్వాత ఆ ప్రాంతంలో ఉండి చిత్తడి, లొగ్గిడి, చెత్తాచెదారం అంతా ఇంతా కాదు. మున్సిపాలిటీ వాళ్ళు ఎన్ని రోజులు ఎక్స్‌ట్రా డ్యూటీలు వేసుకుని పనిచేసినా, ఓ పట్టాన ఆ ప్రాంతం బాగుపడదు. ప్రభుత్వాలు పారిశుధ్యం, స్వచ్ఛత పేరుతో నినాదాలు చేసి కార్యక్రమాలు చేపట్టినా అవి రాజకీపార్టీల కార్యకర్తల హడావుడికే పరిమితమవుతాయి తప్ప ప్రజలను మమేకం చేసేవిగా ఉండవు. ఊరి వారినందరినీ ఒకే తాటికి మీదికి తెచ్చి పరిశుభ్రతకు పెద్దపీటవేస్తే..అదీ ఒక పండుగగా జనబాహుళ్యంలోంచే వస్తే ఎంత సందడిగా ఉంటుందో, ఎంత సరదాగా ఉంటుందో, తలా ఒక చేయి వేసి రోజుకొక కార్యక్రమంగా ఊరిని బాగుచేస్తే ఎంత చూడముచ్చటగా ఉంటుందో తెలుసుకోవాలంటే ప్రతీ ఒక్కరూ నాగాలాండ్ వెళ్ళిరావాలి. ఈ ఊరి సమైక్యతను కళ్ళారా చూడాలంటే ఆగస్ట్ రెండోవారం మంచి సీజన్!

నాగాలాండ్‌లో ఇంచుంగర్ అనేది ఒక పెద్ద గిరిజన జాతి. ట్యూన్‌సాంగ్ జిల్లాలో వీరి ప్రాబల్యం ఎక్కువ. ఇక్కడ అంతా బర్మా నుంచి వచ్చి స్థిరపడిన వారే ఉంటారు. వీరి సంస్కృతీ సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు అన్నీ భిన్నంగా ఉంటాయి. ఇంచుంగర్ అంటే కోరుకున్న తావుకు వచ్చి స్థిరపడిన వారు అని అర్థం. ఇక్కడ వీరు మోరు అనే గ్రామంలో నివాసం ఏర్పరుచుకుని ఆ తర్వాత జూర్ గ్రామానికి విస్తరించారు. ఎగువ బర్మా నుంచి వీరితోపాటే ఖియాముంగన్స్ కూడా ఇక్కడికి వలస వచ్చారని చరిత్ర చెబుతోంది. ఆ దేశం నుంచి ఈ దేశానికి ఒక్క గుంపుగా వచ్చినా ఇక్కడ రెండుగా విడిపోయి మోరు గ్రామంలో స్థిరపడ్డారు. వీరికి వ్యవసాయమంటే ప్రాణం. అదే వీరికి జీవనాధారం. వీరి ఆటపాటలలో, చేతివృత్తులలో వ్యవసాయ నేపథ్యం తొంగిచూస్తుంటుంది. చక్కగా ముస్తాబు చేసుకుని ఢంకా భజాయిస్తూ పాటలు పాడుతూ గుండ్రంగా తిరుగుతూ ఆడుతూ ఉత్సవం చేసుకుంటారు. పక్షుల ఈకలు, వెదురు ఫ్రేము, జుట్టుతో తయారుచేసిన కిరీటాలు ధరిస్తారు. మీటిం నియో పండగ అయిదురోజుల పాటు జరిగే పండుగ. మొక్కజొన్న కంకులు మంచి పొట్టమీదికి వచ్చినందుకు సంతోషంగా కేరింతలు కొడుతూ గ్రామీణులు ఈ పండుగ చేసుకుంటారు. ఈ పండగ వేడుకలను గ్రామపెద్ద ప్రారంభిస్తాడు. ఆయనను ఖింగ్‌పూ అని పిలుస్తారు.

మొదటిరోజు వేడుకను సిటో అంటారు. ఆ రోజున గ్రామంలోని వారంతా ఒక్కటై గ్రామాన్ని శుభ్రపరుస్తారు. ఊరి రహదారులకు మరమ్మతు చేసి బాగుచేస్తారు. రెండో రోజున షీటో పండుగ చేస్తారు. ఆ రోజున ఊరి జనమంతా కలిసి పంటపొలాలకు వెళ్ళే దారులను బాగుచేస్తారు. రోడ్డు ఎక్కడైనా కుంగిపోయినా, కూలిపోయినా సరిచేసి పటిష్ట పరుస్తారు. మూడో రోజు ఝింటో పండగ చేస్తారు. ఈ రోజున ఊళ్ళోని చిన్న చితకా దార్లను బాగుచేసి అందంగా ముస్తాబు చేస్తారు. నాలుగోరోజు చిరెస్కో పండుగ చేస్తారు. ఆ రోజున చెరువులు, వాగులు, కుంటల వంటి జలవనరులను శుభ్రం చేస్తారు. అయిదో రోజు సిరెసొక్ పండగ. ఆ రోజున వ్యవసాయపనిముట్లను శుభ్రం చేసి వాటికి పూజ చేస్తారు. అలాగే దివంగతులైన పెద్దలకు పూజ చేసి బంధుమిత్రులను ఆహ్వానించి వారికి విందుచేస్తారు. బహుమానాలు కూడా ఇస్తారు. ఈ పండగ సందర్భంగా స్వయంవరం జరుగుతుంది. అమ్మాయికి, అబ్బాయికి పెళ్ళి చూపులు ఏర్పాటుచేస్తారు. అన్నీ అనుకూలిస్తే వివాహం ఖాయం చేస్తారు. మనకూ గ్రామీణ నేపథ్యం, సాగు నేపథ్యంతో సంక్రాంతి, ఏరువాకపున్నమి వంటి పండగలున్నా అవి కేవలం సంబరాలకే పరిమితమవుతున్నాయే తప్ప ఇలా ఊరిని బాగుచేసుకోడానికి ఉపయోగపడడంలేదు.

ఊరంతా సంక్రాంతి అనడమే కాని ఆ ఊరికి పండుగ శోభ తెచ్చే ప్రయత్నమే జరగదు. ఇంట్లో ఎంత హడావుడి చేసినా ఊరు దాన్ని ప్రతిబింబించాలంటే దానికి తగ్గట్టుగా ఊరిజనం శ్రమదానం కనబడాలి. వెనకుండి ఎవరో తోస్తే ఈ పని జరగకూడదు. ఇది నా ఊరు..ఇది బాగుండాలి. వీళ్ళు మా వాళ్ళు..అంతా బాగుండాలి అనే కోరిక, సెంటిమెంటు అందరిలో ఉంటే ఊరు ఆటోమాటిక్‌గా బాగుంటుంది. ఎక్కడో బర్మా నుంచి వచ్చిన వారు తాముంటున్న ప్రాంతాన్ని శుభ్రం చేసుకుని బతుకుతుంటే ఈ దేశంలోనే పుట్టి ఈ దేశానికి చెందిన వాళ్ళమే అయినా మనం మన దేశం గురించి, మనం ఉండే ఊరి గురించి పట్టించుకోకపోవడం బాధ్యతారాహిత్యం. ఉన్న ఊరు కన్న తల్లి అన్న సామెతను బర్మావాసులు నిజం చేస్తుంటే ఈ తల్లి కడుపునే పుట్టిన మనం మాత్రం బాధ్యతలు దులపరించుకుని తిరుగుతున్నాం. కనీస విశ్వాసం లేక పెరుగుతున్నాం.





ఢిల్లీ హైకోర్టు వద్ద హైఅలర్ట్

మనతెలంగాణ/న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టుకు బాంబు బెదిరింపు రావడంతో .....ఢిల్లీ హైకోర్టు వద్ద పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. గురువారం ఉదయం 10.54 నిమిషాల సమయంలో ఢిల్లీ హైకోర్టును గంటలో పేల్చేస్తామని పోలీసు కంట్రోల్ రూమ్ బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం హుటాహుటిన ఢిల్లీ హైకోర్టు వద్దకు చేరుకుంది. బాంబు స్క్వాడ్, ఫైర్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని తనిఖీలు చేపట్టింది. అయితే ఈ బెదిరింపు ఫోన్ కాల్ ఆకతాయిలు చేసిన పని అని పోలీసులు తేల్చారు. ఢిల్లీలోని భజన్‌పురా నుంచి కాల్ చేసినట్లు గుర్తించిన పోలీసులు.. ఆ ఫోన్ నెంబర్ మాత్రం యూపీకి చెందిన వ్యక్తిగా నిర్ధారించారు. ఫోన్ కాల్ వచ్చిన మరుక్షణం నుంచే ఆ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందని పోలీసులు తెలిపారు. 2011, సెప్టెంబర్‌లో ఢిల్లీ హైకోర్టు గేట్ వెలుపల జరిగిన పేలుడులో 11 మంది మృతి చెందగా, 80 మందికి పైగా గాయపడంతో పోలీసులు ఈ ఫోన్ కాల్ ని అత్యంత సీరియస్ గా తీసుకొని హైకోర్టు పరిసరాలను అణువణువున గాలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రశాంతంగా గడచిపోయాయని ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో పోలీసులకు వచ్చిన ఈ ఫోన్ కాల్ వారిని ఉరుకులు పరుగులు పెట్టించింది.



సంప్రదింపులతోనే కొండపోచమ్మ భూముల సేకరణ

మన తెలంగాణ/హైదరాబాద్ : కాళేశ్వరం ఎడమ ఎత్తిపోతల పథకంలో భాగమైన కొండపోచమ్మ సాగర్ నిర్మాణానికి భూములను అనుమతితోనే సేకరించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవీతో కూడాన ధర్మాసనం ములుగు మండలం మామిడ్యాల గ్రామస్థులు వేసిన పిటిషన్ విచారణ ముగింపు సందర్భంగా రూలింగ్ వెలువరించారు. సంబంధిత చట్టంలోని సముచితమైన సెక్షన్, సరైన నిబంధన, ఒప్పంద నమూనా వంటివి భూముల సేకరణలో వినియోగించుకోవచ్చునని తెలిపారు. సవరించిన భూ సేకరణ చట్టం, 2017లో రూపొందించిన నిబంధనలకు అనుగుణంగా సంప్రదింపుల ద్వారా భూములను సేకరించుకునే అధికారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని ధర్మాసనం తెలిపింది. సిద్దిపేట జిల్లాకు చెందిన శ్రీనివాస్ మరో ఆరుగురు రైతులు పెట్టుకున్న పిటిషన్‌పై వాదోపవాదాలు ముగియడంతో ధర్మాసనం తీర్పు వెలువరించింది. భూముల సేకరణకు తాము అభ్యంతరం తెలియచేశామని మామిడ్యాల గ్రామంతో పాటు తనేదర్పల్లి, బైలాంపూర్ , తనేదర్పల్లి గ్రామాల వారు భూముల సేకరణను వ్యతిరేకించారని పిటిషనర్లు తెలిపారు. చట్టంలోని నిబంధనల మేరకు నిర్వాసితుల అభ్యంతరాలను నివృత్తి చేయకుండా భూముల సేకరణ తగదని వారు స్పష్టం చేశారు. కలెక్టరు కొందరు రైతులతో ఒప్పందాలు కుదుర్చుకుంటూ భూ సేకరణకు పాల్పడుతున్నారని వారు వెల్లడించారు.

సున్నం జిఎస్‌టిపై కేంద్రానికి నోటీసు

మన తెలంగాణ/ హైదరాబాద్ : సున్నపు రాయిపై 28 శాతం జిఎస్‌టి విధింపుపై హైకోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయి. దీనిపై హైకోర్టు గురువారం కేంద్ర ప్రభుత్వానికి, జిఎస్‌టి మండలికి నోటీసులు జారీ చేసింది. వికారాబాద్‌కు చెందిన మహేశ్వరీ స్టోన్ సప్లయింగ్ కంపెనీకి చెందిన రాజ్ గోపాల్ శారద, మరో ఇద్దరు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. సున్నపురాయిపై ఇంత శాతం పన్ను విధింపు చట్టవ్యతిరేకం అని వారు పేర్కొన్నారు. ఎక్సైజ్, సేవా పన్నులు తమకు వర్తించవని, సున్నపు రాయి కంపెనీలపై వాణిజ్య పన్ను పేరిట ఐదు శాతమే పన్ను ఉంటుందని అయితే దీనిని ఏకంగా 28 శాతానికి పెంచడం విడ్డూరంగా ఉందని తెలిపారు. కేంద్రం చర్య అక్రమమని న్యాయస్థానం ప్రకటించాలని పిటిషనర్లు అభ్యర్థించారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ధర్మాసనం ప్రతివాదులు తమ వివరణను మూడు వారాల వ్యవధిలోగా ఇచ్చుకోవాలని సూచించింది.

అడ్డంకులివే

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఉంది. సిఎం కెసిఆర్ ఆదేశం మేరకు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి బుధవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అడ్డంకులు, ఇతర సమస్యలపై చర్చించారు. రాష్ట్రం ఏర్పడిన మూడేళ్ల కాలంలో 49,570 పోస్టులకు (డైరెక్ట్ రిక్రూట్‌మెంట్) ప్రభుత్వం అనుమతితో పాటు ఆర్థిక శాఖ కూడా ఆమోదం లభించింది. పోలీసు శాఖలో 10,442, ఇంధన శాఖలో 1,040, టిఎస్‌పిఎస్‌సి ద్వారా 4309 పోస్టులు భర్తీ అయ్యాయి. మిగతా 33,791 పోస్టులు వివిధ స్థాయిలలో ఉన్నాయి. కొన్ని పోస్టులు కోర్టు కేసులలో ఉండగా, మరికొన్నింటిపై ప్రభుత్వ శాఖల నుంచి స్పష్టత లేకపోవడం, రాష్ట్రపతి ఉత్తర్వులు, కొత్త జిల్లాలలో భర్తీల ప్రక్రియ నిలిచిపోతున్నట్లు అంచనాకు వచ్చారు. 10 నుంచి 31 జిల్లాలుగా విస్తరించిన తరువాత రెవెన్యూ, పోలీసు శాఖలో పోస్టుల పరంగా స్పష్టత వచ్చిందని అన్నారు. మిగతా శాఖలలో మండల, డివిజన్, సబ్ డివిజన్, జిల్లా స్థాయి పోస్టులపై స్పష్టత రాలేదన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ జరుగుతుందని అంటున్నా, ఇంత వరకు ఏ నిర్ణయం తీసుకోకపోవడం ప్రధాన అవరోధంగా మారింది. ఇలాంటి కారణాలను పరిగణనలోకి తీసుకోకుండా టిఎస్‌పిఎస్‌కి ఉద్యోగాలను భర్తీ చేయాలని అనుమతిస్తే ప్రయోజనం ఏముంటుందని అన్నారు. ఏ విధంగా ముందుకు వెళ్తే భర్తీ ప్రక్రియ పూర్తవుతుందనేదానిపై సుదీర్ఘంగా చర్చించారు.

శాఖ పేరు	పోస్టుల సంఖ్య
వ్యవసాయ, సహకార	2,793
పశు సంవర్థక	1,006
బిసి సంక్షేమ	2,257
అడవులు, పర్యావరణ	2,142
ఇంధన	2,681
ఆర్థిక	39
సాధారణ పరిపాలన	90
వైద్య, ఆరోగ్య	2,982
హోం	12,354
నీటి పారుదల	773
పరిశ్రమలు	20
న్యాయ	10
కార్మిక, ఉపాధి కల్పన	53
పురపాలక	1,538
మైనారిటీ	2,268
పంచాయత్‌రాజ్	1,396
రెవెన్యూ	3,419
ఎస్‌సి అభివృద్ధి	2,817
పాఠశాల విద్య	9,205
ఆర్ అండ్ బి	482
గిరిజన సంక్షేమం	1,098
మహిళా, శిశు సంక్షేమం	147
మొత్తం	**49,570**

మహిళ ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

మండలం బర్దీపూర్ గ్రామానికి చెందిన షిండేకర్ అర్చన(27) తన ఇరువురు పిల్లలైన దీక్షిత(6), కీర్తిరాజ్(4 నెలలు) లను గోదావరి నదిలోకి తోసి అనంతరం తాను కూడా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. అర్చనకు గత 6 సంవత్సరాలుగా మతిస్థిమితం సరిగ్గా లేక బాధపడుతుంది. దీనికి తోడు కొడుకు కీర్తిరాజ్‌కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తీవ్రంగా మదనపడుతూ వచ్చింది. ఈ స్థితిలో కీర్తిరాజ్ ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లింది. అక్కడి వైద్యులు బాబుకు నిమోనియా ఉందని తెలిపారు. దీంతో మరింత వేదనకు గురైన అర్చన ఇరువురు పిల్లలతో సహా బాసర సమీపాన గల యాంచ గ్రామం వద్దకు చేరుకుని తన పిల్లలను నదిలో తోసి తాను నదిలో దూకి ఆత్మహత్య పాల్పడింది. ఆసుపత్రికని వెళ్లిన అర్చన తిరిగి రాకపోవడంతో అర్చన సోదరి లత తదితరులు అర్చన కోసం గాలింపు చేపట్టారు. ఈ దశలో యాంచ గ్రామం వద్ద గోదావరిలో మూడు శవాలు తేలియాడుతున్నాయన్న సమాచారాన్ని తెలుసుకొని అక్కడికివెళ్లి చూడగా అర్చన, ఆమె పిల్లలే లత గుర్తించగలిగింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. భైంసా డిఎస్‌పి అందెరాములు ఆధ్వర్యంలో ముథోల్ సిఐలు రఘుపతి, లోకేశ్వరం, ముథోల్ ఎస్‌ఐలు రమేష్, శ్రీనివాస్, బాసర ఎఎస్‌ఐ నర్సయ్యలు సంఘటనా స్థలానికి చేరుకొని శవాలను బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ముథోల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై అర్చన తల్లి మాట్లాడుతూ తన కూతురు మానసిక స్థితి సరిగ్గా లేకనే ఈ దారుణానికి ఒడిగట్టిందని తెలిపింది. 2008లో ఆర్మూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన షిండే రాములుతో వివాహం జరిపించగా రాములుకు కూడా నా అనే వారు లేక తమ గ్రామమైన బర్దీపూర్‌లోనే నివసించేవాడని, కష్టార్జితంతో సొంత ఇల్లు కూడా నిర్మించుకున్నాడని గత 6 సంవత్సరాల క్రితం ఆఫ్ఘనిస్తాన్‌కు వెళ్లాడని తెలిపింది. ఆర్థికంగా ఎటువంటి ఇబ్బందులు లేవని, తనకు, తన కుమారుడికి ఆరోగ్యం సరిగా లేదన్న కారణంతోనే మానసికంగా కృంగి పోయి ఈ అఘాయిత్యానికి ఒడిగట్టి ఉంటుందని ఆమె కన్నీరుమున్నీరవుతూ తెలిపింది.

భూములను బట్టే పరిహారం

ఫార్మాసిటీ భూసేకరణకు ప్రభుత్వం నిర్ణయం!

మన తెలంగాణ / హైదరాబాద్ : నూతన ప్రాజెక్టుల సాధన విషయంలో పట్టుదలగా ఉన్న ప్రభుత్వానికి భూసేకరణ పెద్ద తలనొప్పిగా మారుతోంది. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం చేపట్టిన భూసేకరణ అనుభవాలతో ముచ్చెర్లలో నిర్మించనున్న హైదరాబాద్ ఫార్మాసిటి భూసేకరణ విషయంలో ప్రభుత్వం కాస్త పట్టువిడుపుల ధోరణితో ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ఇటీవల అసెంబ్లీ ఆమోదం పొందిన కొత్త భూసేకరణ చట్టం..2017 (జివో 123) ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు కోసం 69,078 ఎకరాల భూమి అవసరం కాగా ఇప్పటి వరకు 23,968 ఎకరాల భూమిని సేకరించింది. ఇదే సూత్రాన్ని హైదరాబాద్ ఫార్మా సిటీకి వర్తింపజేసేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు
ముందుకు సాగక పోవడంతో డైలమాలో పడింది. జివో 123 ప్రకారం ఫార్మాసిటికి భూములు ఇవ్వబోమంటూ రైతుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తొలి దశ ఫార్మాసిటి కోసం 8,500 ఎకరాల భూసేకరణ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 6300 ఎకరాలను టిఎస్‌ఐఐసి సేకరించింది. సేకరించిన ఈ భూములకు రైతాంగానికి పరిహారం చెల్లింపులో స్థబ్దత నెలకొంది. తొలుత భూముల విలువను బట్టి ఇస్తామని చెప్పిన అధికారులు ఆ తర్వాత కొత్త భూసేకరణ చట్టం పేరు చెప్పడంతో రైతులు అడ్డం తిరిగారు. తమ భూములను ఫార్మాసిటికి ఇచ్చేది లేదని తెగేసి చెప్పిన వారు ఇటీవల వర్షాలు కురువడంతో పంటలు సాగుకు సిద్ధమయ్యారు. ఒక వైపు ప్రభుత్వం తొలి దశ ఫార్మాసిటిని త్వరిత గతిన పూర్తి చేసి రెండో దశకు వెళ్లాలని భావిస్తున్న క్రమంలో భూసేకరణ కారణంగా పనులు నిలిచి పోవడంపై తర్జన బర్జన పడింది. కాళేశ్వరం తరహాలో కాకుండా ఒక మెట్టు దిగి ఆయా భూములను బట్టి పరిహారాన్ని ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. ముచ్చెర్లలో సేకరించిన ఈ 6500 ఎకరాల భూమిలో పట్టా భూమికి రూ. 12.5 లక్షలు, ఆక్రమణ భూమి (గవర్నమెంట్ ఎన్‌క్రోచ్‌మెంట్ ల్యాండ్)కు ఆరున్నర లక్షలు, సాగులో లేని (గైరాన్) భూమికి ఎకరాకు ఎడున్నర లక్షలు ఇస్తున్నట్లు టిఎస్‌ఐఐసి ఎం.డి వెంకట నర్సింహారెడ్డి ''మన తెలంగాణ''కు వెల్లడించారు. ఈ పరిహారం రైతాంగానికి ఆమోదయోగ్యంగానే ఉందని అధికార వర్గాలు పేర్కొంటుండడం విశేషం.



మౌలిక వసతులకు పెరుగనున్న ప్రాజెక్టు వ్యయం : 8,500 ఎకరాల భూసేకరణకు ఇప్పటి వరకు దాదాపు 300 కోట్ల దాకా వ్యయం అయి ఉంటుందని ప్రాథమికంగా అంచనా. మరో 150 కోట్లతో ప్రధాన రోడ్డు నిర్మాణం, ప్రాజెక్టు పూర్తి అయ్యాక మరో 200 కోట్లతో అంతర్గత రోడ్లు , మౌళిక సదుపాయాల కల్పనకు వ్యయం కావచ్చని టిఎస్‌ఐఐసి లెక్కలు వేసుకుంటోంది. మెడ్ డివైజెస్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికా, దక్షిణ కొరియా, దుబాయ్, అబుదాబీ దేశాలకు చెందిన పెద్ద పెద్ద కంపెనీలు ముందుకు వస్తుండడంతో భూ సేకరణ పనులను ఈ దశలో ముందుకు తీసుకెళ్లక పోతే మరిన్ని చిక్కులు వస్తాయని భావిస్తున్న ప్రభుత్వం రైతులను సముదాయించి భూములను ఎలాగోలా సేకరించాలన్న నిర్ణయానికి వచ్చింది.

పెట్టుబడి పథకం వాస్తవ సాగుదారులకే

సమగ్ర సర్వేలో అసైన్డ్, కౌలు రైతుల వివరాలు కూడా చేర్చాలి : కోదండరామ్



మన తెలంగాణ/హైదరాబాద్ : రైతు సమగ్ర సర్వేలో కౌలు, అసైన్డ్ భూములు సాగు చేస్తున్న రైతుల వివరాలను కూడా నమోదు చేయాలని తెలంగాణ జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ కోరారు. వచ్చే ఏడాది వానకాలం నుంచి వ్యవసాయ పెట్టుబడి పథకం కింద ప్రభుత్వం ఇవ్వనున్న ఎకరాకు రూ. 8 వేలు వాస్తవ సాగుదారులకే అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో కౌలు రైతులు, రుణాలు అందని వాస్తవ సాగుదారులపై ప్రజా దర్బారు నిర్వహించారు. ప్రజా జ్యూరీలో మాజీ ఐఎఎస్ గోపాలరావు, భూ సమస్యల నిపుణురాలు ఉషా చింతా లక్ష్మీ , మానవ హక్కుల వేదిక నుంచి ఎస్.జీవన్ కుమార్, ఆలిండియా కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ కౌలు రైతులు పంటకు మద్దతు ధర దగ్గర నుంచి ప్రతి విషయంలోనూ నష్టపోతున్నారన్నారు. భూ యాజమానులుగా ఉన్నవారికే వ్యవసాయం కష్టంగా ఉందని, అలాంటిది కౌలు రైతుల పరిస్థితి మరింత ఘోరంగా తయారైందన్నారు. రాష్ట్రంలో 14 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని, వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తద్వారా వారు కనీసం వడ్డీ లేని రుణాలు, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు పొందుతారన్నారు. ఇప్పటికైనా కౌలు, అసైన్డ్ భూముల రైతులకు న్యాయం చేయాలని లేదంటే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మాజీ ఐఎఎస్ గోపాల్‌రావు మాట్లాడుతూ భూ అధీకృత రైతుల చట్టం – 2011 కోసం ఏర్పాటైన కోనే రంగారావు కమిటీలో తాను కూడా ఉన్నట్లు గుర్తు చేశారు. అయితే ఈ చట్టం ఉమ్మడి ఎపిలో 2 సంవత్సరాలు అప్పటి ప్రభుత్వం అమలులో దృష్టి సారించిందని, తెలంగాణ వచ్చిన తరువాత కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందడం లేదన్నారు. కౌలు రైతుల సమస్యలను ఒక డాక్యుమెంటేషన్ రూపంలో త్వరలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి నివేదిస్తామన్నారు. భూ సంస్కరణలు పూర్తిగా అమలు చేయకపోవడంతోనే కౌలు, అసైన్డ్ భూముల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉషా చింతా లక్ష్మీ అన్నారు. సారంపల్లి మల్లారెడ్డి మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ అధీకృత రైతుల చట్టాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. 14 లక్షల మంది కౌలు రైతులకు గాను 2015లో కేవలం 44 వేల మందికి మాత్రమే గుర్తింపు కార్డులు ఇచ్చారన్నారు. ఈ చట్టంపై యాజమానులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కౌలు రైతుల రుణాల కోసం ప్రతి బ్యాంకులో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రజా దర్బారులో 50 మంది కౌలు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న బ్యాంకు రుణాలు, పంట నష్ట పరిహారం, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు రాకపోవడం వంటి సమస్యలను వివరించారు.

షేక్ చెరలో బాలిక

(మొదటిపేజీ తరువాయి)

కుదుర్చుకుంది. హైదరాబాద్‌లో తమ బంధువుల బాలికతో పెళ్లి చేస్తానని, అందుకు తగిన పారితోషికం ఇవ్వాలని గౌసియా కోరడంతో అహ్మద్ సరేనన్నాడు. వీరిద్దరు కలిసి గత ఏడాది రంజాన్ మాసంలో హైదరాబాద్‌కు వచ్చారు.తరువాత గౌసియా తన భర్త సికిందర్‌ను అరబ్‌షేక్ అహ్మద్‌కు పరిచయం చేసింది. సికిందర్ స్నేహితులు హాజీ, అహ్మద్‌లు మైనర్ బాలిక తల్లిదండ్రులు సయీదున్నీసా, సయ్యద్ అప్సర్‌ను తమ మాయమాటలతో లొంగదీసుకున్నారు. అరబ్‌షేక్‌కు తమ కూతుర్ని ఇచ్చి వివాహం చేస్తే ఇల్లు, డబ్బు, ఖర్చులు ఇస్తాడని ఆశచూపారు. అందుకు వారు అంగీకరించారు. రంజాన్ మాసంలోనే అరబ్‌షేక్ అహ్మద్, మైనర్ బాలికకు బార్కాస్‌లోని ఒక ఇంట్లో రహస్యంగా వివాహం జరిపించారు. ఆ సమయంలో అరబ్‌షేక్.. బాలిక తల్లిదండ్రులకు హోండా వాహనం, సెల్‌ఫోన్, కూలర్‌ను బహుమానంగా ఇచ్చాడు. అనంతరం బాలికతో నగరంలోని ఓ హోటల్లో నాలుగురోజులు గడిపిన తరువాత అరబ్‌షేక్ మైనర్ బాలికను తీసుకొని ఓమన్ దేశం వెళ్ళిపోయాడు. మూడు నెలలు గడచిన తరువాత బాలిక పాతబస్తీలోని తన తల్లిదండ్రులకు ఫోన్‌చేసి అరబ్‌షేక్ తనను చిత్రహింసలకు గురిచేస్తున్నాడని, హైదరాబాద్ తీసుకువెళ్ళాలని మొరపెట్టుకుంది. ఇక్కడే ఉంటే చచ్చిపోతానని నా శవాన్నే చూడాల్సి వస్తుందని ఫోన్‌లో రోధించింది. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు గౌసియా భర్త సికిందర్ వద్దకు వెళ్ళగా అతడు ఇంట్లోంచి పారిపోయాడు. ఓమన్‌లోని గౌసియాకు ఫోన్‌చేయగా తమకేమి తెలియదదంది. విధిలేని పరిస్థితుల్లో వారు అరబ్‌షేక్ అహ్మద్‌కు ఫోన్‌చేసి తమ కూతుర్ని ఎందుకు వేధిస్తున్నారని నిలదీయగా వివాహ సమయంలో గౌసియాయాకు ఐదు లక్షల రూపాయలిచ్చానని, అవి తిరిగి చెల్లిస్తే తప్పా బాలికను పంపించేది లేదని స్పష్టం చేశాడు. దిక్కుతోచని ఆ దంపతులు గురువారం ఫలక్‌నుమా పోలీసులను ఆశ్రయించి జరిగిన విషయాన్ని తెలిపారు. వారి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మధ్యవర్తుల మాయమాటలతో మోసపోయిన తల్లిదండ్రులు ఇప్పుడు మదనపడుతున్నారు. అరబ్‌షేక్ చెరలో ఉన్న తమ కూతుర్ని ఎలాగైనా రక్షించాలంటూ వారు పోలీసులను వేడుకుంటున్నారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇఎస్‌ఐ, పిఎఫ్ అమలైతేనే 'ఏజెన్సీ'లకు బిల్లులు

- ఒప్పంద నిబంధనలను అమలు చేయాల్సిందే
- స్థానిక సంస్థలకు మున్సిపల్ ఆదేశాలు

మన తెలంగాణ/హైదరాబాద్: అవుట్ సోర్సింగ్ కార్మికులకు పిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయని ఏజెన్సీల పట్ల కఠినంగా వ్యవహారించాలని మున్సిపల్ శాఖ నిర్ణయించింది. ఇక నుంచి పిఎఫ్, ఇఎస్‌ఐ బిల్లులను సకాలంలో చెల్లిస్తున్న ఏజెన్సీ సంస్థలకే బిల్లుల నిధులను విడుదల చేయాలని మున్సిపల్ శాఖ స్థానిక సంస్థల కమిషనర్లను ఆదేశించింది. కార్మికులకు ఈ రెండు పథకాలకు సంబంధించిన వాటా ధనాన్ని కలిపి వేతనాలను చెల్లిస్తున్నప్పటికీ వాటిని అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ సంస్థలు అమలు చేయడం లేదని మున్సిపల్ శాఖ గుర్తించించింది. ప్రతి మున్సిపాలిటీలలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు వీటిని అమలు చేయాల్సి ఉన్నప్పటికీ చాలా ఏజెన్సీ సంస్థలు వాటిని సక్రమంగా అమలు చేయడం లేదనే ఫిర్యాదులు అందుతున్నాయి. పైగా ఈ రెండు సదుపాయాలకు చెల్లించాల్సిన డబ్బులతో కలిపి ప్రతి కార్మికునికి మొత్తం వేతనాలను ప్రభుత్వం సదరు ఏజెన్సీ సంస్థలకు విడుదల చేస్తున్నప్పటికీ చా లా సంస్థలు ఇఎస్‌ఐ, పిఎఫ్ డబ్బులను మాత్రం చెల్లించడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో కార్మికులకు అందాల్సిన ఈ సదుపాయాలు అందడం లేదని గుర్తించిన మున్సిపల్ శాఖ ఇక నుంచి దీనిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనుంది. ఇప్పటి వరకు ఇలాంటి సదుపాయాలను కార్మికులకు అందినా, అందకపోయినా వాటితో సంబంధం లేకుం డా సదరు అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి మాత్రం ఒప్పందం ప్రకారం మున్సిపాలిటీలు బిల్లులను అందజేసేవారు. కాని ఇప్పటి నుంచి ఆ పద్ధతికి స్వస్తి పలకాలని ఉన్నతాధికారులు నిర్ణయంచారు. నిబంధలను సక్రమంగా పాటిస్తేనే ఏజెన్సీలకు నిధులను విడుదల చేయాలని స్థానిక సంస్థలకు ఒక సర్క్యులర్‌ను జారీ చేసినట్లు సమాచారం.

బిల్లు సమర్పించాల్సిందే..

అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సంబంధించిందిన ఇఎస్‌ఐ, పిఎఫ్ బిల్లు దస్త్రాలను ఏజెన్సీ సంస్థలు ఎప్పటికప్పుడు మున్సిపాలిటీలకు చెల్లించాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించిన తర్వాతనే ఆ సంస్థకు బిల్లులను చెల్లించాలని మున్సిపల్ శాఖ స్థానిక సంస్థలను ఆదేశించింది. ఇలాంటి నిబంధనలను అమలు చేయడం ద్వారా కార్మికులకు అందాల్సిన సదుపాయాలు సక్రమంగా అమలు అవుతాయని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. మున్సిపాలిటీలు, అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం కార్మికులకు అందాల్సిన సదుపాయాలను సక్రమంగా అందేలా స్థానిక మున్సిపల్ కమిషనర్లు, ప్రాంతీయ సంచాలకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షంచాలని మున్సిపల్ శాఖ ఆదేశించినట్లు తెలిసింది.

ఎంపి గ్రామంలో దళిత మహిళ ముక్కు కోసివేత

సాగర్(ఎంపి): మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో రెన్‌వర్ఝ్వా గ్రామంలో ఓ దళితుడిని కొట్టడమేకాక, అతడి భార్య ముక్కును అగ్ర కులానికి చెందిన ఇద్దరు కోసేశారు. తమ ఇంట్లో పనిచేయడానికి నిరాకరించిన దళితుడిని నరేంద్ర సింగ్(32), అతడి తండ్రి సాహబ్ సింగ్ సోమవారం కొట్టారు. గాయపడిన తన భర్తను ఆసుపత్రికి తీసుకెళుతుండగా వారు ఆ దళిత మహిళపై దాడి చేశారు. పైగా ఆ మహిళ ముక్కును కోసేసారని మధ్యప్రదేశ్ మహిళా సంఘం చైర్‌పర్సన్ లతా వాంఖ్డే తెలిపారు. వైద్య నివేదిక కోసం పోలీ లు వేచి చూస్తున్నారు. ఆ దళిత దంపతులను అగ్రకులానికి చెందిన వారిద్దరూ 'వెట్టి కార్మికులను' చేయాలని వారు ఆశించారని లతా వాంఖ్డే చెప్పారు. ఆ దళిత మహిళను పోలీసుల వద్దకు పంపి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వాంఖ్డే చెప్పారు. ఐపిసి సెక్షన్ 323 కింద అలాగే ఎస్‌సి, ఎస్‌టి (దౌర్జన్య నిరోధక) చట్టం కింద కేసును నమోదు చేసుకుని పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. వారిప్పుడు పలాయనంలో ఉన్నారు. ఆ దళిత మహిళకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

మూడు రోజుల్లో వర్షాలు

మన తెలంగాణ/హైదరాబాద్: వచ్చే మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురుస్తుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడ్డ ఉపరితల ఆవర్తనం వచ్చే 48 గంటల్లో బలపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎగువన ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. తెలంగాణ నుంచి దక్షిణ తమిళనాడు తీరప్రాంతం వరకు ఏర్పడిన ఆవర్తన ద్రోణి క్రమంగా బలహీనపడుతోంది. ఒడిషా నుంచి దక్షిణ తమిళనాడు వరకు కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా ఆవర్తన ద్రోణి పయనిస్తోంది. ఫలితంగా పలు ప్రాంతాల్లో 18, 19, 20వ తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలకు ఆస్కారం ఉందని, మిగతా చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా గత 24 గంటల్లో ఖమ్మం జిల్లా బయ్యారంలో 4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఇదేవిధంగా మహబూబాబాద్, బొనకల్‌లో 3, పాల్వంచ, భీమదేవరపల్లి, మణుగూరు, పాలకుర్తి, టేకులపల్లి, మహేశ్వరంలో 2, ఇల్లందు, కొత్తగూడెం, కొల్లాపూర్, హసన్‌పర్తి, ఆర్మూరు, ఆత్మకూరు, మధిర తదితర ప్రాంతాల్లో 1 సెంటీమీటర్ వర్షపాతం నమోదైంది. ప్రస్తుత వర్షాకాలంలో ఇప్పటి వరకు పాత ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వర్షపాత లోటు భారీగా ఉంది. మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

వరల్డ్ ఫోటోగ్రఫీ డే ఫోటో జర్నలిస్టు విజేతలు వీరే..

మన తెలంగాణ/ హైదరాబాద్ : ప్రపంచ ఫోటోగ్రఫీ డేను పురస్కరించుకుని ఫోటో జర్నలిస్టులకు నిర్వహించిన కాంపిటీషన్ విజేతలను ప్రభుత్వం గురువారం నాడు ప్రకటించింది. మూడు కేటగిరిల్లో తొలి బహుమతి విజేతకు 15వేలు, ద్వితీయ బహుమతి కింద 10 వేలు, తృతీయ బహుమతి కింద ఆరు వేలు ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నారు. హరితహారం పై ఒకటో కేటగిరిలో నల్గొండకు చెందిన సిహెచ్ నరేందర్‌కు మొదటి బహుమతి, కల్చరల్ విభాగంలో కరీంనగర్‌కు చెందిన ఆర్ కుమార స్వామికి రెండో బహుమతి లభించాయి. ఇక ఇతర విభాగాల్లో రెండో కేటగిరిలో వరంగల్‌కు చెందిన వనం శరత్ బాబు (మొదటి బహుమతి), కామారెడ్డికి చెందిన కె. రాజశేఖర్ (ద్వితీయ బహుమతి), జనగామకు చెందిన జి వేణుగోపాల్ (తృతీయ బహుమతి) వచ్చాయి. అలాగే మూడో కేటగిరిలో సిరిసిల్లకు చెందిన వై. శ్రీకాంత్ మొదటి బహుమతి, హైదరాబాద్‌కు చెందిన పి. పద్మావతి (ద్వితీయ), హైదరాబాద్‌కు చెందిన ఏ సురేష్ కుమార్ తృతీయ బహుమతి వచ్చాయి. ఈ మూడింటిలోనూ ఒక్కో కేటగిరిలో మరో ఐదు కన్సోలేషన్ ప్రైజులను కూడా ఇవ్వనున్నారు.

రజినీకాంత్ భార్య లత నిర్వహిస్తున్న బడి మూసివేత

చెన్నై: అద్దె బకాయిలు చెల్లించని కారణంగా ప్రముఖ నటుడు రజనీకాంత్ సతీమణి లతా రజనీకాంత్ నిర్వహిస్తున్న పాఠశాల భవనానికి దాని యజమాని తాళం వేశారు. చెన్నై గిండిలోని రేస్‌కోర్స్ వద్ద 'ది ఆశ్రమ్' పేరిట ఆమె ఓ స్కూల్‌ను నిర్వహిస్తున్నారు. దీనికి 2009 నుంచి రూ.11 కోట్ల వరకు అద్దె బాకీ చెల్లించాల్సి ఉంది. ఆ భవనం యజమాని వెంకటేశ్వర్లు దీనిపై మద్రాస్ హైకోర్టులో గతంలో పిటిషన్ వేశారు. తర్వాత కోర్టు సమక్షంలోనే ఇరువర్గాల మధ్య గత ఏడాది జూన్‌లో రాజీ కుదిరింది. బకాయిల మొత్తాన్ని ఒకేసారి చెల్లించడం కష్టమని, మొదట రూ.2 కోట్లను ఇస్తానని లత చెప్పారు. ఇప్పటివరకు తొలి వాయిదా చెల్లించకపోవడంతోపాటు నెలవారీ అద్దె కూడా ఇవ్వలేదని సమాచారం. ఈ నేపథ్యంలో వెంకటేశ్వర్లు పాఠశాల భవనానికి తాళం వేశారు. వరుసగా నాలుగు రోజులు సెలవులు ముగిసిన తర్వాత బుధవారం పాఠశాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు వచ్చారు. తాళం వేసి ఉండటంతో వారంతా బయటే నిలబడ్డారు.

సిపిఐ(ఎం) నాయకుడు గౌతమ్ దేబ్‌కు సిఐడి సమన్లు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని సిపిఐ(ఎం) నాయకుడు గౌతమ్ దేబ్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై ఏప్రిల్ నెలలో అభ్యంతరకర వ్యాఖ్యానాలు చేసినందుకు పశ్చిమ బెంగాల్ సిఐడి గురువారం సమన్లు జారీ చేసింది. భవానీ భవన్‌లో సిబిఐ ప్రధానకార్యాలయంలో శుక్రవారం హాజరు కావాలని దేబ్‌ను కోరినట్లు సిఐడి సీనియర్ నాయకుడు తెలిపారు. వామపక్ష విద్యార్థులు ఏప్రిల్‌లో నిర్వహించిన బహిరంగ ర్యాలీలో మమతా బెనర్జీ ప్రసంగించడంపై దేబ్ అభ్యంతరకర వ్యాఖ్యానాలు చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై సిఐడి దర్యాప్తు మొదలెట్టింది. ఉత్తర్‌పాడ పోలీస్ స్టేషన్‌లో దాఖలు చేసిన ఓ ఫిర్యాదుపై దర్యాప్తును ఆరంభించిది. తన వ్యాఖ్యానంపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో దేబ్ క్షమాపణలు కూడా చెప్పారు.

వరదల్లో 17 మంది మృతి

బలరామ్‌పూర్/బహ్రెయిచ్: గత మూడు రోజులుగా బలరామ్‌పూర్, బహ్రెయిచ్‌లలో ముంచెత్తుతున్న వరదలకు కనీసం 15 మంది మరణించారని గురువారం అధికారులు తెలిపారు. అక్కడ కురిసిన భారీ వానలకు బారాబంకీ, గోండా, సిద్ధార్థనగర్, మహారాజ్‌గంజ్, బలరామ్‌పూర్, బహ్రెయిచ్‌లు వరద ముంపునకు లోనయ్యాయి. గత రెండు రోజులలో ఏడుగురు వ్యక్తులు వరదల్లో మునిగిపోయారని బలరామ్‌పూర్ జిల్లా మెజిస్ట్రేట్ రాకేశ్ కుమార్ తెలిపారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 4 లక్షలు చొప్పున ఒక్కొక్కరికి ఆర్థిక సాయం అందిస్తామని ఆయన ప్రకటించారు. గత మూడు రోజుల్లో బహ్రెయిచ్‌లో వరదలకు ఎనిమిది మంది చనిపోయారని సమాచారం.

లైన్ క్లియర్

(మొదటిపేజీ తరువాయి)

విషయంపై తెలంగాణ ప్రభుత్వ అభిప్రాయాన్ని సుప్రీకోర్టు కోరింది. తెలంగాణ ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన న్యాయవాది వెంకట్ రెడ్డి, మెరిట్ ప్రాతిపదికన ఈ ఖాళీలను భర్తీ చేయడానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని కోర్టుకు తెలిపడంతో పాటుగా ఒక అఫిడవిట్ కూడా దాఖలు చేశారు. దీంతో ఈ 239 ఖాళీలను 2015 అర్హత పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులతో భర్తీ చేయాలని మదన్ లోకూర్, దీపక్ గుప్తాలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఆదేశించింది.



బాసర అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి సుజనా చౌదరి

మన తెలంగాణ/బాసర: కేంద్ర సైన్స్అండ్ టెక్నాలజీ మంత్రి సుజనా చౌదరి గురువారం బాసర పుణ్యక్షే త్రాన్ని సందర్శించి, అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి రాజన్న నిలయంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించగా నాయకులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. మంత్రి నేరుగా అమ్మ వారి దర్శనానికి వెళ్లగా వేద పండితులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక అక్షరభ్యాస మండపంలో తన మనమడు అర్జున్ ప్రసాద్‌కు అక్షర శ్రీకారాలు దిద్దించారు. అక్కడి నుంచి గర్భ గుడిలో కుంకుమార్చన, ప్రత్యేక పూజలను చేపట్టగా పండితులు మహా మంగళహారతిని ఇచ్చి ఆశీర్వదించా రు. ఆలయ చైర్మన్ శరత్‌పాఠక్ అమ్మవారి మెమొంటోతో పాటు పూలమాల ,శాలువాతో సత్కరించి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. వీరి వెంట ఆలయ ఈవో అన్నాడి సుధాకర్‌రెడ్డి, భైంసా డిఎస్‌పి అందె రాములు, ముథోల్‌సిఐ రఘుపతి, ముథోల్, లోకేశ్వరం ఎస్‌ఐలు శ్రీనివాస్, రమేష్, బాసర ఏఎస్ఐ నర్సయ్య, నాయకులు లోలం శ్యాంసుందర్, ఓంప్రకాశ్ లడ్డా, ప్రేంనాథ్ రెడ్డి, బోయిడి విఠల్, భూషన్‌రెడ్డి, ఎన్‌టిఆర్ లక్ష్మ ణ్, రమేశ్, కమ్మసత్రం మేనేజర్ రవితో పాటు తదితరులున్నారు.

'తట్టు'కునేందుకే టీకా

- రాజ్‌భవన్ పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సిన్‌ను ప్రారంభించిన మంత్రి డా.లక్ష్మారెడ్డి
- నగరంలో తొలిరోజు 43వేల మందికి టీకా



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: మిజిల్స్ (తట్టు), రుబెల్లా వ్యాధుల నుంచి తట్టుకునేందుకు 9నెలల నుంచి 15 ఏళ్ల లోపు చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించామని, ఇది నెల 25 వరకు కొనసాగనుందని వైద్యారోగ్య శాఖ మంత్రి డా.లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ పాఠశాలలో గురువారం ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. చిన్నారులు భవిష్యత్‌లో ఆరోగ్యంగా ఉండేందుకు ఈ టీకా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయారెడ్డి, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, కమిషనర్ కరుణ వాకాటి, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ప్రశాంతి, డిఎంహెచ్‌వో డా. పద్మజ, యూనిసెఫ్ ప్రతినిధులు పి.రాజు, డబ్ల్యూహెచ్‌వో ఆశిష్, సంజీవ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పూల్‌బాగ్‌లోని ఒవైసీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీలో నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ పాల్గొని పిల్లలందరికీ ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.

14 క్లస్టర్లలో 43,533 మంది

తొలిరోజు నగరంలో ఎంఆర్ వ్యాక్సిన్ మొదటిరోజులో భాగంగా నగరంలోని 14 క్లస్టర్లలో తొలిరోజు 43,533 మంది చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసినట్టు వైద్యారోగ్యశాఖ అధికారులు తెలిపారు. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 9నెలల నుంచి15 ఏళ్లలోపు 9లక్షల 18వేల మంది చిన్నారులు ఉన్నట్టు గుర్తించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు 420మంది ఏఎన్ఎంలు, 1,175 మంద ఆశావర్కర్లు, 587మంది అంగన్‌వాడీ కార్యకర్తలు భాగస్వాములయ్యారు.

లయన్స్ క్లబ్ విస్తృత ప్రచారం

చిన్నారులు తట్టు, రుబెల్లా వ్యాధుల భారిన పడకుండా నివారించేందుకు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, యునిసెఫ్ వారి సౌజన్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 25 వరకు నిర్వహిస్తున్నారు. ఈ టీకాపై లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రతినిధులు, సభ్యులు విస్తృత ప్రచారం చేపట్టారు. జిలాల్ల వారీగా కరపత్రాలు, స్టిక్కర్లు, బ్యానర్లు, పోస్టర్లతో ప్రచారం చేస్తున్నారు.

వికటించిన టీకా

- మందమర్రిలో ఐదుగురికి అస్వస్థత

మన తెలంగాణ/మందమర్రి: ఎంఆర్ వ్యాక్సిన్ వికటించి ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన మంచిర్యాల జిల్లా మందమర్రిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఈ ఘటన జరిగింది. విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది విద్యార్థులను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి ఎలాంటి ప్రమాదం లేదని పేర్కొన్నారు. పట్టణంలో ఈ సంఘటన సంచలనం రేపడంతో పిల్లల తల్లి దండ్రులు భయాందోళలకు గురయ్యారు. వైద్యులు ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండా టీకాలు వేయడంతోనే ఇలా జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో మొదటిరోజే ఇలాంటి సంఘటన ఎదురు కావడంతో అధికారులూ అసంతృప్తిగానే ఉన్నట్లు సమాచారం. అయితే వైద్యాధికారులు పిల్లల వయస్సును దృష్టిలో ఉంచుకొని, వేసే టీకాలను పరీక్షించి వేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.





విద్యాశాఖ కార్యాలయం ముట్టడి

- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికనే నోటిఫికేషన్ ఇవ్వాలంటూ డిమాండ్

మన తెలంగాణ/ఎన్‌జిఒస్ కాలనీ: ప్రభుత్వం విడుదల చేయనున్న డిఎస్‌సి నోటిఫికేషన్‌ను ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఇవ్వాలని అభ్యర్థులు గురువారం వరంగల్ అర్బన్ విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి 5లక్షల మంది నిరుద్యోగులు నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 13వేల ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి 60 నుంచి 75 రోజుల సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యాశాఖ సంచాలకులు జి.కిషన్‌కు వినతిపత్రం సమర్పించారు. టిఎస్‌పిఎస్‌సి కార్యాలయానికి డిఎస్సీ అభ్యర్థులు వెళ్లి ఘంట చక్రపాణికి వినతిపత్రాన్ని సమర్పించినట్లు చెప్పారు.

రూ.1.13 కోట్ల పాత నోట్ల పట్టివేత



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: కేంద్రం ఇటీవల రద్దు చేసిన రూ.500, రూ.1000 నోట్లను మార్పిడి చేస్తున్న ఓ ముఠాను హైదరా బాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రద్దయిన రూ.1.13 కోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులను పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డిసిపి లింబారెడ్డి వివరాల ప్రకారం.. కర్ణాటకలోని జెవర్గి మండలం కచపురం గ్రామానికి చెందిన మంజుల జ్యోషి (37) 2013 లో తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు మకాం మార్చుకుంది. ఆ తరువాత ఏడాది విశాఖపట్నంకు వెళ్లి, అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేది. కాగా, పాతనోట్లు ఉన్నవారు తనను సంప్రదిస్తే 50 శాతం కమిషన్ తీసుకుని కొత్త నోట్లు ఇస్తానని పలువురి వద్ద నుంచి రూ.1.13 కోట్లు విలువ గల పాత నోట్లను సేకరించింది. వీటిని 30 శాతం కమీషన్ తో మార్పిడి చేసేందుకు కర్ణాటకకు చెందిన ఆమె స్నేహితుడు రియల్ ఎస్టేట్ వ్యాపారి కె.నాగవెకంట గౌరి శంకర్ గుప్తా (48) అంగీకరిం చాడు. ఈ మేరకు పాత నోట్లను తీసుకుని మంజుల బుధవారం రాత్రి పంజగుట్టలోని షాన్‌బాగ్ హోటల్‌లో బస చేసింది. ఆమె స్నేహితుడు గుప్తా కూడా అక్కడికి చేరుకున్నాడు. గురువారం ఉదయం హోటల్ గదిలో పాత నోట్లు మార్పిడి చేసుకుంటుండగా విశ్వసనీయ సమాచారం మేరకు వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్. రాజవెంకటరెడ్డి, ఎస్‌ఐలు ఎల్,భాస్కర్‌రెడ్డి, పి.మల్లిఖార్జున్, వి.కిషోర్‌లు ఆ హోటల్‌పై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం పంజాగుట్ట పోలీసులకు అప్పగించారు.

టీచర్ తిట్టిందని ఆత్మహత్యాయత్నం

మన తెలంగాణ/శ్రీరంగాపురం: టీచర్ తిట్టిందనే మనస్తాపంతో మూడో తరగతి విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన వనపర్తి జిల్లా శ్రీరాంగాపూర్ మండలం శేరుపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఆనంద్ (10)ని తెలుగు పండిత్ పద్యం కంఠస్తం చేసి అప్పగించకపోతే తిట్టినట్లు సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన ఆనంద్ గురువారం ఇంటికెళ్లిన అనంతరం ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు బాలుడిని చికిత్స నిమిత్తం వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మహబూ బ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి వి షమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ ముత్తయ్య దర్యాప్తు ప్రారంభించారు.

తల్లడిల్లిన తల్లి!




మన తెలంగాణ/ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి ముందున్న బస్ సెల్టర్ పక్క ఓ మూలన చెత్త కుప్పలో రెండు రోజులుగా జీవచ్ఛవంలా పడి ఉన్న ఓ వృద్ధురాలిని స్థానికులు పోలీసుల సాయంతో ఆస్పత్రిలో చేర్పించారు. కాళ్లు చచ్చుపడి లేవలేని స్థితిలో ఉన్న ఆమె చికిత్స అనంతరం మీడియాతో తన బాధను పంచుకొని కన్నీటి పర్యంతమైంది. మహబూబ్‌నగర్ సమీపంలోని భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన తన పేరు చెన్నమ్మ అని, తనకు కొడుకులు, కూతుళ్ల ఉన్నారని తెలిపింది. రెండ్రోజుల క్రితం మనవడు ఇక్కడ వదిలేసి వెళ్లాడని బోరున విలపించింది. ఆమెను కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

నల్లబెల్లం పట్టివేత, ఇద్దరిపై కేసు

మన తెలంగాణ/కురవి: అక్రమంగా నల్లబెల్లం, పటిక తరలిస్తున్న ఇద్దరిని మహబూబాబాద్ జిల్లా కురవి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రమేశ్‌బాబు వివరాల ప్రకారం.. పెద్దగూడూరు మండలం రాములు తండాకు చెందిన బానోతు కృష్ణ, మహబూబాబాద్ బంజార తండాకు చెందిన గుగులోత్ వీరన్న గురువారం జగ్గయ్యపేట నుంచి మహబూబాబాద్‌కు 350 కేజీల పటిక, 50 కేజీల నల్లబెల్లాన్ని ఆటోలో అక్రమంగా తరలిస్తున్నారు. అదే సమయంలో ఖమ్మం ప్రధాన రోడ్డుపై వాహనాలను తనిఖీ చేస్తుండగా వీరిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మాజీ నక్సలైట్‌పై పిడి యాక్ట్



మన తెలంగాణ/కరీంనగర్‌క్రైం: మాజీ నక్సలైట్, అంతర్‌జిల్లా దొంగ, కిడ్నాపర్, హంతకుడు తెలకుంట్ల భిక్షపతి మీద పిడి యాక్ట్ అమలు చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి.బి.కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటనను విడుదల చేశా రు. పిడి.యాక్ట్ అమలు ఉత్తర్వులను రూరల్ సిఐ శశిధర్‌రెడ్డి, పిడి యాక్ట్ సెల్ ఇన్‌చార్జి పండరీలు కలిసి భిక్షపతికి అందజేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ వరంగల్ పట్టణానికి చెందిన తెలకుంట్ల భిక్షపతిపై 42 కేసులు ఉన్నాయన్నారు. పిడి.యాక్ట్ అమలు చేయడంలో కీలకపాత్ర పోషించిన లీగల్‌సెల్ సిఐ బి.రవి, కరీంనగర్ రూరల్ సిఐ శశిధర్‌రెడ్డి, పిడి.సెల్ ఇన్‌చార్జి టి.పండరీలను ఆయన అభినందించారు.

నేరాల అదుపులో తెలంగాణ భేష్

- హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్/గచ్చిబౌలి: రాష్ట్ర ఏర్పాటు తర్వాత పోలీస్ శాఖ రూపురేఖలను మార్చి ఫ్రెండ్లీ పోలీస్‌గా తీర్చిదిద్దిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందని హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి డివిజన్‌లో నూతనంగా నిర్మించిన మాదాపూర్ డిసిపి, ఎసిపి, గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్, మహిళా పోలీస్‌స్టేషన్, షీటీమ్స్ భవనాన్ని ఆయన రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల అదుపులో తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. గత మూడేళ్లలో క్రైం రేట్ గణనీయంగా తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో చేవేళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వరరెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పట్నం నరేందర్‌రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ సందీప్ శాండిల్యా, అడిషనల్ కమిషనర్, జానకి షర్మిల, ట్రాఫిక్ ఎఆర్ శ్రీనివాస్, మాదాపూర్ డిసిపి విశ్వప్రసాద్, మాదాపూర్ ఎసిపి రమణకుమార్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్క్ స్థలంలో కొరియా బృందం



మన తెలంగాణ/సంగెం: వరంగల్ రూరల్ జిల్లాలోని గీసుకొండ, సంగెం మండలాల్లో ఏర్పాటు చేస్తున్న మెగా టెక్స్‌టైల్ పార్క్ స్థలాన్ని కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్ చైర్మన్ కిహక్ సింగ్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం గురువారం సందర్శించింది. పార్క్‌లో పరిశ్రమల స్థాపనకు సాధ్యసాధ్యాలను వారు పరిశీలించారు. రవాణా సౌకర్యం, నీటి లభ్యత, విద్యుత్ సౌకర్యం, చేనేత కార్మికుల సంఖ్య తదితర అంశాలను చైర్మన్ కిహక్‌సింగ్ అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమల స్థాపనకు సమర్థవంతమైన పబ్లిక్ రవాణా వ్యవస్థ, నీటి వసతి, విద్యుత్ సౌకర్యం ప్రధానమని పార్క్‌లో అవసరమైన సదుపాయాలు కల్పిస్తే సంస్థలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తాయన్నారు. అనంతరం ఇండస్ట్రీయల్ పార్క్ ప్లాన్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా విభజించిన బ్లాకులలో కొన్ని మార్పులు చేయాలని సూచనలు, సలహాలు చేశారు. బ్లాక్‌ల మధ్యలో రెండు వరసల రహదారి ఏర్పాటు చేయాలని, అదేవిధంగా పార్క్‌లో రైల్వే ట్రాక్‌తో కొంత ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సూచించారు. సివిల్ నిర్మాణాలకు ఎక్కువ నిధులు వృథా చేయకుండా ఉపాధి, ఉత్పత్తులపై దృష్టి సారించాలన్నారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ అభివృద్ధి సాధించేలా చూడాలన్నారు. అక్కడి నుంచి వరంగల్‌లో వేసిన దర్రిలను బృందం పరిశీలించి వాటి గురించి చేనేత కార్మికులను అడిగి తెలుసుకొని ప్రశంసించారు. ఈ సందర్భంగా చేనేత ఉత్పత్తులపై కార్మికుడు రాజ్‌గోపాల్ వివరించగా, టిఎస్ఐఐసి నుంచి వెంకటనర్సింహారెడ్డి, ఐఎల్ అండ్‌ఎఫ్ఎస్ క్లస్టర్ ఎండి ఆర్‌సిఎం రెడ్డి, ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాట్లపై కొరియన్ బృందానికి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్క్‌లో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉందని, 6 లైన్లతో ఔటర్ రింగ్‌రోడ్డు పనులు జరుగుతున్నాయని చెప్పారు. రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌ఆర్‌ఎస్‌పి కాలువ ద్వారా ప్రతిరోజూ నీటిని అందించేలా ప్రణాళికలు రూపొందించామని, అదేవిధంగా టెక్స్‌టైల్ పార్క్‌కు విద్యుత్ సౌకర్యానికి ప్రత్యేక 250 ఎండబ్ల్యు సామర్థ్యం గల సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సబ్‌స్టేషన్‌లో సమస్య ఏర్పడితే ఎలా అని బృందం ప్రశ్నించగా ప్రత్యామ్నాయ విద్యుత్ సౌకర్యం ఉందని బదులిచ్చారు. వీరి వెంట జిల్లా జెసి హరిత, హైదరాబాద్ నుంచి మెటా టెక్స్‌టైల్ పార్క్ డైరెక్టర్ మిహిర్, పరేఖ్, టిఎస్ఐఐసి జోనల్ మేనేజర్ రతన్ రాథోడ్, పరిశ్రమల శాఖ జిఎం హరిప్రసాద్, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్ ఎడి, వరంగల్ రూరల్ ఆర్‌డివో మహేందర్‌జీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో పాలన

- వ్యవసాయ శాఖ మంత్రి పోచారం



మన తెలంగాణ/కామారెడ్డి: ప్రజలకు మరింత చేరువలో పాలన తీసుకెళ్తున్నామని మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఆయన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జనహిత సమావేశ మందిరంలో సమీకృత ఫిర్యాదుల కేంద్రాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ప్రజా ఫిర్యాదులపై క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరిం చే దిశగా ఈ ప్రక్రియను చేపట్టినట్లు వివరించారు. కలెక్టర్ సత్యనారాయణ మాట్లాతూ జనహిత ప్రతి సోమవారం నుండి శ నివారం వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందని ఆన్‌లైన్ ద్వారా www.janahitha.telangana.gov.in ద్వారా 9494181920 వాట్సప్ నంబరు, ఈమెయిల్ janahitha.@telangana.gov.in ద్వారా సేవలు పొందవచ్చని సూచించారు.



యాదాద్రి జిల్లా పంతంగి గ్రామానికి చెందిన బిజెపి నేత కడగంచి రమేష్, విజయ వివాహం గురువారం చౌటుప్పల్ మండలం లక్కారం పరిధిలోని ఎంఆర్‌ఆర్ పంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకకు అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు, రైల్వే శాఖ సహాయ మంత్రి రాజన్ గొగాయెతో పాటు ఆ రాష్ట్రానికి చెందిన మంత్రులు, 25 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. వరుడు రమేశ్ ప్రస్తుతం బిజెపి అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా పని చేస్తున్నాడు.

– మన తెలంగాణ / చౌటుప్పల్ రూరల్

కార్మిక శాఖ కార్యాలయం వద్ద ఒకరి ఆత్మహత్యాయత్నం

మన తెలంగాణ/హైదరాబాద్/ ముషీరాబాద్: ఏడాది క్రితం ఉద్యోగం నుంచి తొలగించబడిన 108 ఉద్యోగి కార్మిక శాఖ కార్యాలయం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. నల్గొండ జిల్లాకు చెందిన వీరస్వామి (35)ని ఏడాది కింద విధుల నుంచి తొలగించారు. ఇదే విషయమై బాధితుడు ఎల్‌బినగర్‌లో అంబులెన్స్‌ను డివైడర్‌కు ఢీ కొట్టగా వాహనం పాడైపోయిందని అకారణంగా నింద మోపి విధుల నుంచి తొలగించారని జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ దృష్టికి తెచ్చాడు. తప్పకుండా న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తానని కమిషనర్ సమాధానవం ఇవ్వడంతో వీరస్వామి అప్పటికే తనతో తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించి తోటి ఉద్యోగులు వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కాగా సమస్యలు పరిష్కారంలో జివికె యాజమాన్యం, కార్మిక శాఖ అధికారులతో జరిగిన 108 ఉద్యోగుల చర్చలు విఫలమయ్యాయి.

నేరెళ్ల బాధితులకు న్యాయం జరగాలి

- ఎస్‌పిని సస్పెండ్ చేయాలంటూ టిడిపి దీక్ష

మన తెలంగాణ/కరీంనగర్‌టౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల ఘటన బాధితులకు న్యాయం చేయాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తుమల్లేశం డిమాండ్ చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట బాధితులకు న్యాయం చేసి, ఎస్‌పిని సస్పెండ్ చేయాలంటూ గురువారం టిడిపి దీక్ష చేపట్టింది. బాధితులకు న్యాయం జరిగేంత వరకూ వారి తరపున పోరాడుతామని స్పష్టం చేసింది. దీక్షకు పలు పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

ఎవరూ ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

- టిటిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి

మన తెలంగాణ/కందుకూర్/కడ్తాల్: ఎవరూ ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని, టిడిపికి తెలంగాణలో పూర్వవైభవం రావడం ఖాయమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్‌ఎ రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ము చ్చర్ల పరిధిలోని ఉట్లపల్లి గ్రామంలో నిర్వహించిన బోనాల వేడుకలకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు వీరేందర్‌గౌడ్‌తో పాటు హాజరై మాట్లాడారు. టిడిపి పాలనలోనే పేదలకు సంక్షేమ పథకాల ఫలాలు దక్కాయన్నారు. అనంతరం పెద్దమ్మ దేవాలయంలో పూజలు చేశారు.

ఎయిర్‌పోర్టులో విదేశీ కరెన్సీ పట్టివేత

మన తెలంగాణ/శంషాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విదేశీ కరెన్సీ అక్రమంగా తరలిస్తున్న ఓ ప్రయాణికుడిని డిఆర్ఐ అధికారులు అడ్డుకున్నారు. వారి వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి బుధవారం రాత్రి దుబాయి నుంచి వచ్చాడు. అతడి ఇమ్మిగ్రేషన్ తనిఖీ తర్వాత లగేజీ స్కానింగ్ చేయగా, అందులో యూఎఇ దినార్స్, సౌదీ రియాల్స్, ఒమాన్ రియాల్స్ ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.57లక్షలు ఉంటుందన్నారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా, తనకు ఎలాంటి సంబంధం లేదని దుబాయ్‌లో ఓ వ్యక్తి బ్యాగు ఇచ్చినట్లు తెలిపాడని అధికారులు పేర్కొన్నారు. దీంతో ఫేమా 1999 చట్టం ప్రకారం అనుమతి లేకుండా విదేశీ కరెన్సీ తరలించడం చట్టరీత్య నేరమని, కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- ఉద్రిక్తత నడుమ సంగారెడ్డి మాజీ ఎంఎల్‌ఎ జగ్గారెడ్డి అరెస్టు



మన తెలంగాణ/సంగారెడ్డి: సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి మాజీ ఎంఎల్‌ఎ, టిపిసిసి అధికార ప్రతినిధి జగ్గారెడ్డి సంగారెడ్డిలో గురువారం నిర్వహించ తలపెట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసుల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి లేకపోవడంతో పోలీసులు దీక్షను భగ్నం చేయడానికి పెద్దఎత్తున మోహరించారు. ముందుగా జగ్గారెడ్డి పాతబస్టాండ్ సమీపంలోని శ్రీరామ్ మందిర్ నుంచి జగ్గారెడ్డితో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేయడానికి ర్యాలీగా బయల్దేరారు. భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివస్తూ పట్టణ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే సంగారెడ్డి డిఎస్‌పి ఎం.తిరుపతన్న ఆధ్వర్యంలో పోలీసులు అక్కడ కాంగ్రెస్ ర్యాలీని అడ్డుకున్నారు. జగ్గారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేస్తున్న క్రమంలో కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎట్టకేలకు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న అనంతరం జగ్గారెడ్డిని కూడా పోలీసులు అరెస్ట్ చేసి పుల్కల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన జగ్గారెడ్డి అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

నూనె గింజల ఉత్పత్తి శాతం తగ్గింది

- ఐసిఎఆర్ డైరెక్టర్ జనరల్ డా.ఎస్‌కె. చతుర్వేది

మన తెలంగాణ/హైదరాబాద్/రాజేంద్రనగర్: నూనె గింజల పంటలైన కుసుమ, అవిస సాగు విస్తీర్ణం దేశంలో తక్కువగా ఉందని , అధిక దిగుబడులు ఇచ్చే రకాలను రూపొందిస్తే రైతులు వీటిపై మొగ్గు చూపుతారని భారత వ్యవసాయ పరిశోధన మండలి అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ ఆయిల్‌సీడ్స్ అండ్ పల్సెస్ డా. ఎస్‌కె. చతుర్వేది శాస్త్రవేత్తలకు సూచించారు. గురువారం రాజేంద్రనగర్‌లోని ప్రొ. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న కుసుమ, అవిస పంటల పై వార్షిక సమీక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు నూనె గింజల పరిశోధన కేంద్రం సంచాలకులు డా. ఎ. విష్ణువర్ధన్‌రెడ్డి అవిస పంటపై అఖిల భారత సమన్వయ పరిశోధనా పథకం గురించి వివరించారు.

గ్యాంగ్ రేప్ నిందితులు అరెస్ట్

మన తెలంగాణ/హైదరాబాద్/షాపూర్‌నగర్: హైదరాబాద్‌లోని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు రోజుల క్రితం ఓ మహిళా కూలీపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన నలుగురు నిందితులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. బాలానగర్ ఎసిపి గోవర్ధన్, సిఐ శంకర్ రెడ్డి వివరాలను వెల్లడించారు. కుత్బుల్లాపూర్ దుండిగల్‌కు చెందిన ఓ మహిళ(25) ఈ నెల 13న షాపూర్‌నగర్‌లోని హమాలీ అడ్డా వద్దకు తన భర్త కోసం వచ్చింది. భర్త పక్కనే ఉన్న వైన్ షాపులో మద్యం తాగేందుకు వెళ్లాడని తోటి కార్మికులు చెప్పారు. దీంతో ఆమె అక్కడకు వెళ్లగా పరిచయం ఉన్న ముక్తర్ అలియాస్ లడ్డూ ఆ మహిళను అటకాయించాడు. అప్పటికే మద్యం మత్తులో వారు తమ వెంట రావాల్సిందిగా కోరడంతో నిరాకరించింది. ఆ తర్వాత ఆటోలో ఇంటికి బయల్దేరుతుండగా ముక్తర్, తన స్నేహితులు ఇషాక్(32), లక్ష్మ ణ్‌రావ్(27) సాయంతో ఆటోలో మహిళను బలవంతంగా లాక్కొని పక్కనే ఉన్న హెచ్‌ఎంటి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ విషయాన్ని భర్తకు తెలపగా, మరుసటి రోజు జీడిమెట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించి నిందితులను అరెస్టు చేశారు. పట్టుబడ్డ వారిలో ముక్తర్ మూడు కేసుల్లో, ఇషాక్ ఆరు, లక్ష్మ ణ్‌రావు ఏడు కేసుల్లో పాత నేరస్థులుగా ఉన్నారని వివరించారు.

ఒక్క రోజు చాలంటున్నారు

అక్కినేని నాగచైతన్యను పెళ్లి చేసుకోబోతున్న స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం శరవేగంగా సినిమాలను పూర్తిచేసే పనిలో ఉంది. అయితే ఒకేసారి తెలుగు, తమిళ్ సినిమాలను చేసేస్తోంది ఈ భామ. నాగార్జున హీరోగా నటిస్తున్న హార్రర్ కామెడీ మూవీ 'రాజుగారి గది2'లో సమంత నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా విడుదల తేదీని కూడా ఖరారుచేశారు. ఈ చిత్రం అంతా పూర్తయినా ఇంకా సమంతపై కొన్ని సన్నివేశాలు మిగిలే ఉన్నాయట. ఒక్క రోజు షూటింగ్‌కు ఆమె వచ్చినా చాలు సినిమా మొత్తం పూర్తిచేస్తామని చెబుతున్నారు ఫిల్మ్‌మేకర్స్. అయితే ప్రస్తుతం తెలుగు, తమిళ్ సినిమాల్లో ఒకేసారి నటిస్తుండడంతో డేట్స్ కుదరడం లేదట. కానీ ఏదోవిధంగా ఈ సినిమాకు ఒక రోజు కేటాయించే పనిలో ఉందట సమంత. ఇక రాజుగారి గది2 చిత్రాన్ని అక్టోబర్ 13న విడుదలచేయాలని ప్లాన్ చేశారు ఫిల్మ్‌మేకర్స్. ఓంకార్ డైరెక్ట్ చేసిన రాజుగారి గది ఘన విజయం సాధించడంతో ఆ చిత్రానికి సీక్వెల్‌గా రాజుగారి గది2 చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రంలో సమంత, సీరత్ కపూర్ లీడ్ రోల్స్ చేస్తున్నారు. పివిపి నిర్మిస్తున్న ఈ సినిమాకు తమన్ మ్యూజిక్ అందిస్తున్నాడు.


సమంత

బర్త్‌డే తర్వాత యూరప్‌కి..


పవన్‌కళ్యాణ్

ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో తన 25వ సినిమా చేస్తున్నాడు పవన్‌కళ్యాణ్. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాపై అభిమానులు, ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. సెప్టెంబర్ 2న తన పుట్టినరోజు వేడుక పూర్తయిన వెంటనే పవన్ ఈ మూవీ భారీ షెడ్యూల్ కోసం యూరప్ వెళ్లబోతున్నాడు. కథ ప్రకారం సినిమాకు సంబంధించిన కీలకమైన షెడ్యూల్ ఇదే. ఈ షెడ్యూల్‌లోనే ఎక్కువ శాతం షూటింగ్ పూర్తిచేయాలని ప్లాన్ చేస్తున్నాడు త్రివిక్రమ్. నిజానికి ఈ ఫారిన్ షెడ్యూల్‌ను చాలా రోజుల కిందటే ప్లాన్ చేశారు. కానీ పవన్‌కు ఉన్న మిగతా కమిట్‌మెంట్స్ కారణంగా అది వాయి దాపడుతూ వచ్చింది. మరోవైపు సినిమా బడ్జెట్ కూడా భారీగా పెరిగిపోవడంతో ఈసారి వీలైనంత త్వరగా ఫారిన్ షెడ్యూల్‌ను పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ షెడ్యూల్ పూర్తయితే తప్ప సినిమా షూటింగ్‌పై ఓ క్లారిటీ రాదు. సెప్టెంబర్ 2న పవన్ పుట్టిన రోజు సందర్భంగా సినిమా టైటిల్ లేదా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తారు. ఇక అక్కడినుంచి మూవీ అఫిషియల్ ప్రమోషన్ షురూ అవుతుంది. ప్రస్తుతం రామోజీ ఫిలింసిటీలో ఈ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. అనిరుధ్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నాడు.

నచ్చిన సినిమాలు మాత్రమే చేస్తున్నా

ఇంటర్వ్యూ

తాప్సీ, శ్రీనివాస్ రెడ్డి, వెన్నెల కిషోర్, తాగుబోతు రమేష్, షకలక శంకర్ ప్రధాన తారాగణంగా నటించిన చిత్రం 'ఆనందో బ్రహ్మ'. మహి వి.రాఘవ్ దర్శకత్వంలో విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా తాప్సీతో ఇంటర్వ్యూ విశేషాలు...

కాన్సెప్ట్ కొత్తగా...

దర్శకుడు మహి వి.రాఘవన్ కథ చెప్పిన ఐదు నిమిషాలకే ఈ సినిమాను ఒప్పేసుకున్నాను. ఎందుకంటే సినిమా కాన్సెప్ట్ చాలా కొత్తగా అనిపించింది. సాధారణంగా దెయ్యాల్ని చూసి మనుషులు భయపడతారు కానీ ఇందులో మనుషుల్ని చూసి దెయ్యాలు భయపడతాయి. ఇది ఎంతో బాగుంది.

అందుకే ఒప్పుకున్నా...

నాకు హార్రర్ సినిమాలంటే పెద్దగా ఇష్టం ఉండదు. వాటిని ఎక్కువగా చూడను. అయితే ఈ సినిమా ఒప్పుకోవడానికి కారణం ఇది హార్రర్ కామెడీ మూవీ. ప్రేక్షకులను భయపెడుతూ నవ్వించే సినిమా ఇది.

ఆ భావన అతనిలో ఉండేది కాదు...

మహి వి.రాఘవన్ డైరెక్షన్ ఎంతో బాగుంది. ఈ సినిమాలో చాలా సీన్లు ఎలా తీస్తే బాగుంటుందో చెప్పమని అతను నన్ను అడిగేవాడు. నేను చెప్పినవి బాగుంటే చేయడమో... బాగలేకపోతే మార్చడమో చేసేవాడు. దర్శకుడిని కాబట్టి అంతా నేనే అనే భావన అతనిలో ఉండేది కాదు. మహి మంచి క్లారిటీ ఉన్న దర్శకుడు. తనకేం కావాలో తనకు బాగా తెలుసు. ఈ సినిమాకు బెస్ట్ ఔట్‌పుట్ ఇచ్చాడు.

అందుకే మంచి సక్సెస్‌లు...

గతంలో ఏ సినిమా వచ్చినా చేసేదాన్ని. అప్పుడు పెద్దగా సక్సెస్ ఉండేది కాదు. అందుకే రెండు, మూడు సంవత్సరాల నుండి నాకు నచ్చిన సినిమాలు, చేయాలనుకున్న సినిమాలు మాత్రమే చేస్తున్నాను. అందుకే నాకు మంచి సక్సెస్‌లు వస్తున్నాయి.

నాకెలాంటి అభ్యంతరం లేదు...

తెలుగులో కమర్షియల్ సినిమాలు కూడా చేస్తాను. నేను కమర్షియల్ సినిమాలు చేస్తూనే హీరోయిన్‌గా పేరుతెచ్చుకున్నాను. మంచివైతే గ్లామర్ రోల్స్, కమర్షియల్ సినిమాలు చేయడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు.

స్టార్ అనే భావన రాదు...

బాలీవుడ్‌లో నాకు రెండు మంచి హిట్స్ వచ్చాయని నేను ఎప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఫీలవ్వను. ఎందుకంటే చిత్ర పరిశ్రమలో ప్రతిరోజూ కష్టపడాల్సిందే. కొత్తవి, మంచి సినిమాలు వెతుక్కోవాలి. అవి చేయగలనని ఎదుటివాళ్లను నమ్మించాలి. ప్రేక్షకులను థియేటర్లకు వచ్చేలా చేయాలి. వీటన్నింటి మధ్య నాకు స్టార్ అనే భావనే రాదు.

టాలీవుడ్ లాభాల్లో...

ఇప్పుడు పలు హిందీ సినిమాలకన్నా తెలుగు సినిమాలే ఎక్కువగా కలెక్షన్లు తీసుకువస్తున్నాయి. టాలీవుడ్ మంచి లాభాల్లో ఉంది. ఈ సంవత్సరం పలు బాలీవుడ్ సినిమాలు సరిగా ఆడలేదు.

స్పోర్ట్స్ బయోపిక్ చేయాలనుంది...

నాకు డ్రీమ్ రోల్ అంటూ ఏమీ లేదు. అయితే నాకు స్పోర్ట్స్ అంటే చాలా ఇష్టం. అందుకే స్పోర్ట్స్ బయోపిక్ చేయాలని ఉంది.


తాప్సీ

శర్వానంద్ 'మహానుభావుడు'

శర్వానంద్, మెహరిన్ హీరోహీరోయిన్లుగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రానికి 'మహానుభావుడు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. యువి క్రియేషన్స్ బ్యానర్‌లో వంశీ, ప్రమోద్‌లు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఒక్క పాట మినహా షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. సినిమా డబ్బింగ్ కార్యక్రమాలు మొదలయ్యాయి. ఇటలీ, ఆస్ట్రియా, క్రోయేషియా వంటి విదేశాల్లో పొలాచ్చి, రామోజీ ఫిలిం సిటీ, హైదరాబాద్‌లోని అందమైన లొకేషన్స్‌లో సినిమా షూటింగ్ జరుపుకుంది. పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ''రన్ రాజా రన్, ఎక్స్‌ప్రెస్ రాజా వంటి మంచి హిట్‌ల తర్వాత శర్వానంద్ హీరోగా చేస్తున్న చిత్రం 'మహానుభావుడు'. మారుతి చెప్పిన క్యారెక్టరైజేషన్, కామెడీ చాలా బాగా నచ్చి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఒక్క పాట మినహా షూటింగ్ పూర్తయింది. డబ్బింగ్ కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈనెల 24న సినిమా ఫస్ట్‌లుక్, ఫస్ట్‌లుక్ టీజర్‌ను విడుదల చేస్తాం. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి విజయదశమికి సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం''అని అన్నారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ ''భలే భలే మగాడివోయ్ చిత్రం తర్వాత నాకు బాగా నచ్చిన క్యారెక్టరైజేషన్‌తో చేస్తున్న చిత్రం 'మహానుభావుడు'. శర్వానంద్ కెరీర్‌లో ఈ చిత్రం బెస్ట్ మూవీగా నిలుస్తుందన్న నమ్మకం ఉంది. సినిమాలో ఫుల్ కామెడీ ఉంటుంది. తమన్ సూపర్ ఆడియోను అందించాడు. మ్యూజికల్ లవ్ స్టోరీగా ఈ చిత్రం ఉంటుంది''అని తెలిపారు. వెన్నెల కిషోర్, నాజర్, భద్రం, కళ్యాణి నటరాజ్, భాను, హిమజ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: నిజార్ షఫి, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు, ఫైట్స్: వెంకట్.


శర్వానంద్

మనిషి భావోద్వేగాలు, సంబంధాలతో..


కొత్త సినిమా ప్రారంభ కార్యక్రమంలో లక్ష్మీమంచు దంపతులు, వారి కూతురు విద్యా నిర్వాణ, మంచు మనోజ్ దంపతులు, విజయ్ యలంకంటి

మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై లక్ష్మీ మంచు ప్రధాన పాత్రలో ప్రొడక్షన్ నం.4 చిత్రం ప్రారంభమైంది. విజయ్ యలంకంటి ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఈ సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. పూజానంతరం మంచు మనోజ్, మనోజ్ భార్య ప్రణతి, మంచు లక్ష్మి కూతురు విద్యా నిర్వాణ స్క్రిప్ట్‌ను నిర్మాత మంచు లక్ష్మి, దర్శకుడు విజయ్‌లకు అందించారు. అనంతరం మంచు లక్ష్మి మాట్లాడుతూ ''చాలా రోజుల తర్వాత మా బ్యానర్ నుంచి వస్తున్న సినిమా ఇది. నిజం కాని విషయాన్ని నిజమని భావించే ఓ యువతి కథ ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా ఇది. మనిషి భావోద్వేగాలు, సంబంధాలు చుట్టూనే కథంతా తిరుగుతుంది. విజయ్ అందించిన మంచి కథతో రాబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. విజయ్ ఇప్పటికే ఈగ, బాహుబలి1 సినిమాలకు రాజమౌళి దగ్గర అసిస్టెంట్‌గా పనిచేశాడు. ఈ సినిమాతో ఖచ్చితంతగా తన ప్రతిభను నిరూపించుకుంటాడు''అని అన్నారు. అయితే యప్ టివి ఆధ్వర్యంలో ఓ వెబ్ సిరీస్‌ను కూడా మొదలు పెట్టబోతున్నట్లు మంచు లక్ష్మి తెలిపారు. ఈ సిరీస్‌కు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు.

రాహుల్ విజయ్ హీరోగా సినిమా ప్రారంభం

మూడు దశాబ్దాలుగా ఎందరో స్టార్ హీరోల సినిమాలకు ఫైట్ మాస్టర్‌గా పనిచేసిన విజయ్ తనయుడు రాహుల్ విజయ్ హీరోగా విఎస్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై కొత్త చిత్రం హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైంది. రాము కొప్పుల దర్శకత్వంలో దివ్య విజయ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తొలి సన్నివేశానికి వివి వినాయక్ క్లాప్ కొట్టగా... విజయన్ మాస్టర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. పూరి జగన్నాథ్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ఫైట్ మాస్టర్ విజయ్ మాట్లాడుతూ ''30 ఏళ్లుగా ఇండస్ట్రీ నాకెంతో అండగా నిలబడింది. నేను ఇండస్ట్రీకి చాలా రుణపడిపోయాను. ఆ రుణం తీర్చుకోవడానికి మా అబ్బాయి రాహుల్ విజయ్‌ను హీరోగా, దివ్య విజయ్‌ను నిర్మాతగా పరిచయం చేస్తున్నాను. దర్శకుడు రాము చెప్పిన కథ బాగా నచ్చింది. నన్ను ఆదరించిన తరహాలోనే మా అబ్బాయి, అమ్మాయిని ఆదరించాలని కోరుకుంటున్నాను''అని అన్నారు. దర్శకుడు రాము కొప్పుల మాట్లాడుతూ ''నేను సుకుమార్ దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేశాను. నేను చెప్పిన కథ నచ్చడంతో విజయ్ నాకు దర్శకత్వం వహించే అవకాశం కల్పించారు. ఈ చిత్రానికి మణిశర్మ, చోటా కె.నాయుడు, నవీన్ నూలి వంటి టాప్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారు. రాహుల్ విజయ్‌కి సరిపోయే కథ ఇది. స్క్రిప్ట్ ఎక్స్‌ట్రార్డినరీగా వచ్చింది. ఈ నెల 21 నుంచి షూటింగ్ ప్రారంభమవుతుంది. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లలో జరిగే షెడ్యూళ్లతో సినిమా పూర్తవుతుంది''అని అన్నారు. నిర్మాత దివ్య విజయ్ మాట్లాడుతూ ''ఈ సినిమాతో రాహుల్ విజయ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నాం. మేఘానంద్, సత్యానంద్ వద్ద రాహుల్ శిక్షణ తీసుకున్నాడు. హీరోయిన్‌ను ఇంకా ఫైనల్ చేయాల్సి ఉంది''అని చెప్పారు. హీరో రాహుల్ విజయ్ మాట్లాడుతూ ''రాము మంచి కథ చెప్పారు. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. ఈ చిత్రం హీరోగా నాకు మంచి పేరు తెస్తుందన్న నమ్మకముంది'' అని తెలిపారు. రాజేంద్రప్రసాద్, మురళీశర్మ, పవిత్ర లోకేష్, పోసాని కృష్ణమురళి, రఘుబాబు, వెన్నెల కిషోర్, గొల్లపూడి మారుతిరావు తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, సినిమాటోగ్రఫీ: చోటా కె.నాయుడు, ఎడిటింగ్: నవీన్ నూలి, ఫైట్స్: విజయ్, ఆర్ట్: చిన్నా, సాహిత్యం: శ్రీమణి.


విఎస్ క్రియేటివ్ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పూరి జగన్నాథ్, వివి వినాయక్, విజయ్, రాహుల్ విజయ్, దివ్య విజయ్, రాము కొప్పల

బాలీవుడ్‌లో బిజీ అవుతోంది


కృతి కర్బందా

'బోణి' సినిమాతో టాలీవుడ్‌లోకి వచ్చిన బెంగుళూర్ బ్యూటీ కృతి కర్భందా. తర్వాత పవన్ కళ్యాణ్ సినిమాలో చేసినా ఈ అమ్మడు బ్రేక్ తెచ్చుకోలేదు. పూర్తిస్థాయిలో గ్లామర్ పాత్రలు చేసినా కృతికి మంచి హిట్ దక్కలేదు. చివరికి రామ్‌చరణ్ సినిమాలో అతనికి అక్కగా నటించింది ఈ భామ. కొంతకాలం క్రితం ఈ భామ బాలీవుడ్‌కు వెళ్లి అక్కడ 'రాజ్ రీబూట్' సినిమా చేసింది. ఈ సినిమా ఫ్లాపైనా కూడా ఆమెకు వరుసగా మంచి ఆఫర్లు వచ్చాయి. ఇందులో ఎంతో గ్లామరస్‌గా కనిపించడంతో ఆమె ఫిల్మ్‌మేకర్స్ దృష్టిలో పడింది. ఆతర్వాత కృతి కర్భందా చేసిన గెస్ట్ ఇన్ లండన్ చిత్రం యావరేజ్ మూవీగానే నిలిచింది. కానీ ఇప్పుడు సన్నీ డియోల్, బాబీ డియోల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'యమ్లా పగ్లా దివానా ఫిర్ సే' చిత్రంలో నటిస్తోంది ఈ సుందరి. భారీ బడ్జెట్‌తో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమాపై కృతి ఎన్నో ఆశలు పెట్టుకుందట. చూస్తుంటే నిదానంగా బాలీవుడ్‌లో బిజీ అయిపోయేలా ఉంది ఈ భామ.



రిటైల్ సూచీలో చైనాను అధిగమించిన భారత్

న్యూఢిల్లీ: ఈ ఏడాదిలో గ్లోబల్ రిటైల్ డెవలప్‌మెంట్ సూచీలో చైనాను భారత్ అధిగమించింది. అంతర్జాతీయ బ్రాండ్లకు రిటైల్ గమ్యంగా దేశం అధిక ప్రాధాన్యనిస్తోందని రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సంస్థ సిబిఆర్ఇ సౌత్ ఆసియా వెల్లడించింది. 2017 ప్రథమార్థంలో ఏడు కొత్త గ్లోబల్ బ్రాండ్లు దేశంలోకి ప్రవేశించాయని, వీటి పెట్టుబడులు 200 మిలియన్ డాలర్లకు చేరాయని ఇండియన్ రిటైల్ మార్కెట్ వ్యూ నివేదిక వెల్లడించింది. దేశంలోకి ఇప్పటికే అంతర్జాతీయ బ్రాండ్లు ప్రవేశించి విస్తరించే పనులు చేపట్టాయి. బిగ్ బజార్ వంటి అనేక హైపర్‌మార్కెట్లు ముంబయి, బెంగళూర్, చెన్నై నగరాల్లో కొత్త స్టోర్లను ప్రారంభించాయి. మ్యాక్స్, పాంటలూన్ వంటి దుస్తుల రిటైలింగ్ కూడా చురుగ్గా నగరాల్లో విస్తరిస్తున్నాయని నివేదిక వివరించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు 2017 గ్లోబల్ రిటైల్ ఇండెక్స్‌లో మన ర్యాంక్, అలాగే ప్రైవేటు ఈక్విటీ రంగాలచే కొనసాగుతున్న పెట్టుబడులు అంతర్జాతీయ బ్రాండ్లకు ప్రాధాన్యతనిస్తున్నాయని సిబిఆర్ఇ చైర్మన్(ఇండియా ఆగ్నేయ ఆసియా) అన్షుమన్ మాగజిన్ తెలిపారు. అయితే డోక్లామ్ వివాదం నేపథ్యంలో భారత్–చైనా దేశాల మధ్య వాణిజ్యపరమైన సంబంధాలు దెబ్బతింటున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ నివేదిక అందరి దృష్టి ఆకర్షించింది.

మిస్త్రీ కంపెనీలతో కటీఫ్

• టాటా సన్స్ సంచలన నిర్ణయం • ఎస్‌పి గ్రూప్‌లోని 50 కంపెనీలపై ప్రభావం

న్యూఢిల్లీ: కొత్త చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలోని టాటా సన్స్ బోర్డు సంచలన నిర్ణయం తీసుకుంది. సైరస్, షాపూర్ మిస్త్రీలకు చెందిన ఎస్‌పి గ్రూప్‌తో వ్యాపార ఒప్పందాలు అన్నింటికి ముగింపు పలకాలని ఈమేరకు టాటా గ్రూప్ తమ కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కోట్ల విలువచేసే లావాదేవీలు రిస్క్‌లో పడ్డాయని ఎకనమిక్స్ టైమ్స్ నివేదిక వెల్లడించింది. ఈ నిర్ణయంతో టాటా సన్స్‌లో 18.4 శాతం వాటా కల్గి ఉన్న ఎస్‌పి గ్రూప్‌లోని 50 కంపెనీలతో డీలింగ్స్‌పై ప్రభావం పడనుంది. సైరస్ మిస్త్రీని టాటా సన్స్ చైర్మన్ పదవి నుంచి అకస్మాత్తుగా తొలగించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కొంత కాలం సైరస్ మిస్త్రీ, టాటా సన్స్ మధ్య బోర్డ్ వార్ నడిచింది. ఈ వివాదం ప్రస్తుతం కోర్టులో ఉంది. కాగా చంద్రశేఖరన్‌ను టాటా సన్స్ చైర్మన్‌గా నియమించిన తర్వాత తొలిసారిగా బోర్డు ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. సైరస్ మిస్త్రీ, ఆయన సోదరుడు షాపూర్ మిస్త్రీ ఇద్దరికీ ఎస్‌పి గ్రూప్‌లో చెరి సగం వాటాలు ఉన్నాయి. టాటా గ్రూప్‌లోని కంపెనీలు అయిన టాటా స్టీల్, టాటా పవర్, టాటా కెమికల్స్, వోల్టాస్, ట్రెంట్‌లకు బోర్డు ఆదేశాలు జారీ చేసింది. 18.4 వాటాతో సైరస్ మిస్త్రీ కుటుంబం





టాటా గ్రూప్‌ను ప్రమోట్ చేస్తోంది. దీంతో సైరస్ మిస్త్రీ కుటుంబానికి చెందిన అన్ని సంస్థలతో ఉన్న డీలింగ్స్‌కు చెక్ పెట్టాలని నిర్ణయించింది. టాటా సన్స్ బోర్డు, టాటా గ్రూప్‌లోని మేజర్ ఆపరేటింగ్ సంస్థల ప్రమోటర్ గత నెలలో సమావేశమయ్యాయని, ఈ మీటింగ్‌లో షాపూర్జి పల్లోంజి గ్రూప్‌తో ఉన్న అన్ని వ్యాపార సంబంధాలను తెంచుకోవాలని సంస్థలను ఆదేశించినట్టు టాటా సన్స్‌కు చెందిన అధికారి వెల్లడించారు. టాటా సన్స్ చైర్మన్‌గా ఉన్న సైరస్ మిస్త్రీని గతేడాది బోర్డు సభ్యులు అర్థాంతరంగా ఉద్వాసన పలికిన అనంతరం నుంచి టాటా సన్స్–మిస్త్రీకి వాదనలు నడుస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే టాటా గ్రూప్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

ఎలాంటి ప్రభావం చూపదు: ఎస్‌పి గ్రూప్

టాటా సన్స్ తెగదెంపులతో తమపై ఎలాంటి ప్రభావం చూపదని సైరస్ మిస్త్రీకి చెందిన షాపూర్జీ పల్లోంజి(ఎస్‌పి) పేర్కొంది. 2016 ఆర్థిక సంవత్సరంలో ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్ ఒప్పందాలు అంతగాలేవని వెల్లడించింది. టాటా ప్రాజెక్టుల నుంచి ఆర్డర్ బుకింగ్ 2012–13లో రూ.1,125 కోట్లుగా ఉంటే.. 2015–16 నాటికి సున్నాకి పడిపోయాయని పేర్కొంది.

Shapoorji Pallonji TATA

సేవింగ్ ఖాతాల వడ్డీ రేటు 3.5 శాతానికి తగ్గింపు

• హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ నిర్ణయం

న్యూఢిల్లీ: వరుసగా బ్యాంకులు పొదుపు ఖాతాల వడ్డీ రేట్లను తగ్గిస్తూ వస్తున్నాయి. తాజాగా ప్రైవేటురంగ దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ కూడా అర శాతం మేరకు వడ్డీ రేటులో కోత పెట్టింది. 0.5శాతం వడ్డీని తగ్గించడం ద్వారా ఇది 3.5 శాతానికి చేరనుంది. రూ.50లక్షల లోపు డిపాజిట్లపై ఈ తగ్గింపు ఉంటుందని, రూ.50లక్షల పైన ఉన్న డిపాజిట్లపై యథావిధిగా 4శాతం వడ్డీని చెల్లిస్తామని ప్రకటించింది. సవరించిన వడ్డీ రేట్లు ఆగస్టు 19 నుంచి అమల్లోకి వస్తాయని బ్యాంక్ ప్రకటించింది. తొలుత జులై 31న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ) సేవింగ్ ఖాతాలపై వడ్డీ రేటును తగ్గించింది. ఆ తర్వాత వరుసగా బ్యాంకులు ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఇప్పటివరకు ఎస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కర్ణాటక బ్యాంకు, ఇండియన్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. యస్ బ్యాంక్ బుధవారం సేవింగ్ ఖాతాలపై వడ్డీలో 1 శాతం కోత విధించింది. దీంతో రూ.1 లక్షల లోపు డిపాజిట్లకు వడ్డీ 5 శాతానికి తగ్గనుంది. లక్ష రూపాయల నుంచి కోటి లోపు ఉన్న మొత్తాలకు వడ్డీరేటును 6 శాతంగా ఉంచింది. కోటి రూపాయలు, ఆపై ఉన్న మొత్తాలపై వార్షిక వడ్డీరేట్లకు 25 బేసిస్ పాయింట్లు కోత పెట్టి 6.5 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గించింది. ఎస్‌బిఐ పొదుపు ఖాతాల డిపాజిట్లపై 50 బేసిస్ పాయింట్లు వడ్డీరేటును తగ్గించింది. కోటి లోపు ఉన్న నగదు నిల్వలపై వడ్డీరేటును అరశాతం తగ్గించి 3.5 శాతంగా నిర్ణయించింది. యాక్సిస్ బ్యాంకు కూడా 50 లక్షల కన్నా తక్కువున్న సేవింగ్స్ ఖాతా డిపాజిట్లపై 3.5 శాతం వడ్డీరేటును మాత్రమే చెల్లించనున్నట్టు ప్రకటించింది.



రూ.30 వేలు దాటిన బంగారం



ముంబయి: బంగారం ధర మళ్లీ పరుగులు పెడుతోంది. శ్రావణమాసం సందర్భంగా పసిడి కొనుగోళ్లు పెరిగాయి. దేశీయ మార్కెట్లో పది గ్రాముల బంగారం ధర మళ్లీ రూ.30వేల మార్క్‌ను చేరుకుంది. గురువారం రూ.300 పెరిగి 10 గ్రాముల పసిడి ధర రూ. 30,050కు చేరింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమీక్షలో బంగారంపై వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేయకపోవడంతో బులియన్ మార్కెట్ సెంటిమెంట్‌కు కలిసొచ్చింది. అంతర్జాతీయంగా 0.43శాతం పెరిగి సింగపూర్ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 1,288.30 డాలర్లుగా ఉంది. అటు వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. గురువారం ఒక్కరోజే రూ. 900 పెరగడంతో దేశీయ మార్కెట్లో కిలో వెండి ధర రూ. 40,200లకు చేరింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీ దారుల నుంచి డిమాండ్ పెరగడంతో వెండి ధర పెరిగినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి. మరోవైపు దేశీయంగా బంగారం దిగుమతులు రెట్టింపు అయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జులై వ్యవధిలో పసిడి దిగుమతులు 13.35 బిలియన్ డాలర్లకు పెరిగాయని వాణిజ్య మంత్రిత్వశాఖ ఇటీవల వెల్లడించింది. బంగారం దిగుమతులు దేశీయ కరెంట్ ఖాతా లోటుపై ప్రభావం చూపుతున్నాయి. 2016–17 ఏప్రిల్–జులైలో క్యాడ్ 4.97 బిలియన్ డాలర్లుగా ఉంది. గత సంవత్సరం జులై నెలలో 1.07 బిలియన్ డాలర్లుగా ఉన్న పసిడి దిగుమతులు.. ప్రస్తుత సంవత్సరం జులైలో 2.10 బిలియన్ 7.76 డాలర్లకు చేరాయి. జులైలో బంగారం దిగుమతులు పెరగడంతో వాణిజ్య లోటు 7.76 బిలియన్ డాలర్ల నుంచి 11.44 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇతరదేశాలకు బంగారం ఎగుమతిపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే.

బైబ్యాక్ ప్రతిపాదనతో ఇన్ఫోసిస్ 4.5 శాతం జంప్



న్యూఢిల్లీ: బైబ్యాక్ ప్రతిపాదన చేయడంతో ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ షేర్లు భారీగా లాభపడ్డాయి. షేరు 4.70 శాతం మేర పెరిగి రూ.1,021.05తో గరిష్ఠ స్థాయి వద్ద ముగిసింది. రూ.13 వేల కోట్ల షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనపై ఆగస్టు 19న కంపెనీ బోర్డు సమావేశం కానుంది. ఈ ప్రకటనతో ఇన్ఫీ షేర్లు ఊపందుకున్నాయి. ఇన్ఫోసిస్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు కంపెనీ ఈక్విటీ షేర్లు బైబ్యాకు ప్రతిపాదనను పరిగణలోకి తీసుకోనున్నారని, ఆగస్టు 19న సమావేశం ఏర్పాటుచేస్తున్నామని ఇన్ఫోసిస్ బిఎస్ఇకి తెలియజేసింది. ఆటోమేషన్, కొన్ని దేశాల్లో వీసా నిబంధనల కఠినతరంతో ఐటీ కంపెనీల వ్యాపార వృద్ధి నెమ్మదించింది. దీంతో ఐటీ కంపెనీలు ఒత్తిడిలో కొనసాగుతున్నాయి. 2017 జూన్ 30 నాటికి ఇన్ఫోసిస్ వద్ద లిక్విడ్ అసెట్స్(నగదు, స్వల్పకాలిక పెట్టుబడులు) రూ.39వేల కోట్లకు పైగా ఉన్నాయి. ఐటీ కంపెనీల వద్ద నగదు నిల్వలు మంచిగా ఉండటంతో, వాటిని షేర్ హోల్డర్స్‌కు పంచాలని బాగా ఒత్తిడి పెరుగుతోంది. మరో ఐటి దిగ్గజం టిసిఎస్ ఇప్పటికే రూ.16 వేల కోట్ల బైబ్యాక్‌ను ప్రకటించి, ఈ ఏడాది మే నెలలో దీనిని పూర్తిచేసింది. ఇదేవిధంగా విప్రో కూడా గత నెలలో రూ.11,000 కోట్ల బైబ్యాకును చేపట్టనున్నట్టు తెలిపింది. హెచ్‌సిఎల్, కాగ్నిజంట్, మైండ్‌ట్రీ వంటి కంపెనీలు ఇదే బైబ్యాక్‌లను ప్రకటించాయి.

ఒడిదుడుకుల మధ్య స్వల్ప లాభాల్లో ఈక్విటీ మార్కెట్లు

న్యూఢిల్లీ: ఈక్విటీ మార్కెట్లు గురువారం ఒడిదుడుకుల మధ్య ఫ్లాట్‌గా ముగిశాయి. మొత్తానికి గత వారం నష్టాల నుంచి కోలుకున్న సూచీలు ఈవారం వరుస లాభాలను నమోదు చేస్తున్నాయి. తాజాగా బ్యాంకింగ్, హెల్త్‌కేర్, ఎఫ్ఎంసిజి షేర్ల పతనం వల జోరు తగ్గి సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు ముందుకు కదల్లేకపోయాయి. అయితే బైబ్యాక్ ప్రతిపాదన చేయడంతో ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ షేరు మార్కెట్‌లో రాకెట్‌లా దూసుకెళ్లి 4 శాతానికి పైగా లాభపడింది. అంతర్జాతీయ సంకేతాలు బలహీనంగా ఉండడం, చివర్లో అమ్మకాల ఒత్తిడి వంటివి సూచీలను ముందుకు కదలకుండా చేశాయి. అయితే నిఫ్టీ కీలకమైన 9,900 పాయింట్లపైన ముగియగలిగింది. ఆఖరికి సెన్సెక్స్ 25 పాయింట్ల లాభంతో 31,795 పాయింట్ల వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ ఒక దశలో 167 పాయింట్లు లాభపడగా, మరో దశలో 57 పాయింట్లు నష్టపోయింది. ఇక నిఫ్టీ 7 పాయింట్ల లాభంతో 9,904 పాయింట్ల వద్ద ముగిసింది. అమెరికా, ఉత్తర కొరియాల మధ్య ఉద్రిక్తత తగ్గుముఖం పట్టటంతో ఆసియా మార్కెట్లు లాభాల్లో ఉండడం సానుకూల ప్రభావం చూపించాయి. దీంతో ఉదయం సమయంలో మార్కెట్ లాభాల్లో ట్రేడ్‌అయింది. అయితే యూరప్ మార్కెట్లు బలహీనంగా ప్రారంభం కావడం, ద్రవ్యోల్బణం పెరుగుతోందన్న ఆర్‌బిఐ మోనెటరీ పాలసీ కమిటీ ఆందోళన వ్యక్తం చేయడం ప్రతికూల ప్రభావం చూపించాయి. ఇన్ఫోసిస్, కోల్ ఇండియా, ఎన్‌టిపిసి, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డిఎఫ్‌సి షేర్లు 1 శాతం నుంచి 4.5 శాతం స్థాయి మేరకు లాభపడ్డాయి. ప్రధానంగా లాభపడిన షేర్లలలో ఇన్ఫోసిస్ (+4.54 శాతం), కోల్ ఇండియా (+4.22 శాతం), ఎన్‌టిపిసి (+3.97 శాతం), భారతీ ఎయిర్‌టెల్ (+2.29 శాతం), హెచ్‌డిఎఫ్‌సి (+0.95 శాతం) ఉన్నాయి. మరోవైపు సిప్లా (2.85 శాతం), అదానీ పోర్ట్స్ (1.81 శాతం), మారుతీ (1.23 శాతం), కోటక్ బ్యాంక్ (1.17 శాతం), హెచ్‌యుఎల్ (1.04 శాతం) నష్టపోయాయి.



కాస్పర్ స్కై నుంచి యాంటివైరస్ నెట్

మన తెలంగాణ / హైదరాబాద్ : కంప్యూటర్లకు వైరస్ కారణంగా నిక్షిప్తం చేసిన సమాచారం అంతా పోకుండా ఉండేందుకు ఇంటర్‌నెట్ సెక్యూరిటి ఆధారిత యాంటి వైరస్ సాఫ్ట్‌వేర్‌ను కాస్పర్ స్కై సంస్థ అందుబాటులోకి తెచ్చింది. అత్యాధునిక సెక్యూరిటీ గల ఈ సాఫ్ట్‌వేర్‌తో యాంటి వైరస్, ఇంటర్‌నెట్ సెక్యూరిటీ, కాస్టర్ టోటల్ సెక్యూరిటీని అందించనున్నట్లు కాస్పర్ స్కై ఎండి సౌత్ ఏసియా అల్తాఫ్ హాల్డే ఒక ప్రకటనలో తెలిపారు. విఆర్ ఇన్ఫోటెక్ సహకారం కూడా ఇందుకోసం తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

బిఎస్ఎన్ఎల్ కొత్త డాటా ప్లాన్

మన తెలంగాణ/ హైదరాబాద్ : బిఎస్ఎన్ఎల్ వార్షిక, అర్ధ వార్షిక డాటా ప్లాన్‌లను ప్రకటించింది. రూ.1197తో 356 రోజులు, రూ. 597తో ఆరు మాసాల డాటా ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఏడాది డాటా ప్లాన్ వినియోగదారులకు అదనంగా 14 జిబి, ఆరు మాసాల డాటా ప్లాన్ వినియోగదారులకు 6 జిబి డాటాను ఉచితంగా అందించనున్నట్లు బిఎస్ఎన్ఎల్ ఒక ప్రకటనలో వెల్లడించింది.

BSNL Connecting India

సెప్టెంబర్ 11న భవిష్యనిధి అదాలత్


మన తెలంగాణ / హైదరాబాద్ : సెప్టెంబర్ 11న భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. నిధి ఆప్‌కే నికత్ పేరిట నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భవిష్యనిధికి సంబంధించి ఖాతాదారుల ఫిర్యాదులకు పరిష్కారం చూపనున్నారు. ఖాతాదారులు తమ ఫిర్యాదులను నేరుగా గాని,లేదా పోస్ట్‌గాని పంపించుకునే అవకాశం కల్పించినట్లు హైదరాబాద్ పిఎఫ్ రిజియన్ అధికారులు వెల్లడించారు.

ఐఆర్‌డిఎఐతో సిగ్నా టిటికె జాయింట్ వెంచర్

మన తెలంగాణ / హైదరాబాద్ : సిగ్నా టిటికె ఆరోగ్య బీమా సంస్థ ఐఆర్‌డిఏఐకి జాయింట్ వెంచర్‌లో తన వాటాను 26 శాతం నుండి 49 శాతానికి పెంచుకునేందుకు యత్నిస్తోంది. ఈ మేరకు పెరుగుదలను రెగ్యులేటరీ ఆమోదాలకు లోబడి ఉండనుంది. సిగ్నా టిటికె ఎండి సిఈవో సందీప్ పటేల్ మాట్లాడుతూ ఆరోగ్య బీమా మార్కెట్‌ను మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా తాము ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. రానున్న రోజుల్లోనూ తమ డిజిటల్ , సాంకేతిక సామర్ధ్యాలను అలాగే సేవలకు సంబంధించిన ఆవిష్కరణలను మెరుగు పరుచుకుంటామని హామీ ఇస్తున్నట్లు తెలిపారు.

గణేష్ చతుర్థికి డెల్ ఆకర్షణీయ ఆఫర్లు

ముంబయి : గణేష్ చతుర్థి పండుగ సందర్భంగా డెల్ ఇండియా అద్భుతమైన ఆఫర్లను ప్రకటించింది. వేడుక సమయంలో కస్టమర్ల ఆనందాన్ని మరింత పెంచాలనే లక్ష్యంతో డెల్ పిసిలు, డెస్క్‌టాప్‌లపై ఎక్స్‌క్లజివ్ ఆఫర్లను అందిస్తోంది. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పండుగ సందర్భంగా బహుమతులను అందిస్తోంది. ఇన్స్‌పిరాన్ లాప్‌టాప్స్, డెస్క్‌టాప్‌లు, ఆల్ ఇన్ వన్స్‌పై ఆకర్షణీయమైన ఆఫర్లను ఆగస్టు 18 నుంచి 29 వరకు ఇవ్వనున్నట్టు కంపెనీ ప్రకటించింది.



గృహ కొనుగోలుదారులకు దివాలా చట్టం

న్యూఢిల్లీ: ఇకపై దివాలా చట్టం గృహ కొనుగోలుదారులకు కూడా ఉపయోగపడనుంది. ఈ చట్టం కేవలం బ్యాంకులు, ఆర్థిక సంస్థలు మాత్రమే ఇప్పటివరకు ఉంది. అయితే గృహ వినియోగదారులు కూడా ఐబిసి(దివాలా చట్టం) కింద తమ క్లెయిమ్స్‌ను పొందవచ్చని ప్రభుత్వం తెలిపింది. దీనికి అనుగుణంగా దివాలా చట్టంలోని నిబంధనలను సవరించింది. ఇక ఈ దివాలా చట్టంతో ఇప్పటివరకు కంపెనీ నుంచి పేమెంట్ల కోసం ఎదురుచూస్తున్న గృహవినియోగదారులకు ఊరట లభించనుంది. దివాలా చట్టం కింద బాధితులు క్లెయిమ్‌ను కోరవచ్చు. ఇప్పటి వరకు కేవలం ఫైనాన్సియల్, ఆపరేషనల్ క్రెడిటర్లు మాత్రమే ఈ చట్టం కింద క్లెయిమ్స్ కోరే అవకాశం ఉండగా, ఈ మార్పులు ముఖ్యంగా దేశ రాజధాని పరిధిలోని గృహదారులకు శుభవార్తగా మారాయి. నిధులు లేవని చెబుతూ చాలా మంది డెవలపర్లు గృహ కొనుగోలుదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో కొనుగోలుదారులు గడువు మించి మరింత కాలం వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇటు రీఫండ్ కోసం కూడా కొనుగోలుదారులు వేచిచూడాల్సి వస్తోంది. ఈ చట్టంతో వారి సమస్య పరిష్కారం అవనుంది.

నోకియా 8ను ఆవిష్కరించిన హెచ్‌ఎండి గ్లోబల్



న్యూఢిల్లీ: వినియోగదారులు ఆతృతగా ఎదురుచూస్తున్న నోకియా 8 స్మార్ట్‌ఫోన్‌ను హెచ్‌ఎండి గ్లోబల్ సంస్థ ఆవిష్కరించింది. లండన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ ఫోన్‌ను విడుదల చేసింది. ఇప్పటికే నోకియా 5, 6 ఫోన్ల అమ్మకాలను ఈ నెలాఖరులో ప్రారంభించనున్నట్లు సంస్థ ప్రకటించింది. త్వరలో మార్కెట్లోకి రానున్న సామ్‌సంగ్ గెలాక్సీ నోట్ 8, ఐఫోన్ 8 మోడల్స్‌కు పోటీగా నోకియా 8 ఫోన్‌ను తీసుకొచ్చింది. డ్యుయల్ కెమెరా ఇందులో ప్రత్యేకం, రెండు బ్యాక్ కెమెరాలు ఉంటాయి. ఫ్రంట్ సెల్ఫీ కెమెరా కూడా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్‌లో ఈ ఫోన్‌ను అందుబాటులోకి రానుంది. భారత్‌లో మాత్రం అక్టోబర్‌లో విడుదల కానుంది. ధర రూ. 45వేల వరకు ఉండనుందని సమాచారం. నోకియా 8 ఫీచర్లు చూస్తే..5.3 అంగుళాల డిస్‌ప్లే, ఆండ్రాయిడ్ నోగట్ ఆపరేటింగ్ సిస్టమ్, 4జిబి ర్యామ్, 64జిబి ఇంటర్నల్ మెమొరీ, 13 మెగాపిక్సెల్‌తో రెండు బ్యాక్ కెమెరాలు, 13 మెగా పిక్సెల్‌తో ఫ్రంట్ కెమెరాలు, 3090 ఎంఎహెచ్ బ్యాటరీ ఉన్నాయి.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	31795.46	24.57	0.08%
నిఫ్టీ	9904.15	6.85	0.07%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27760	29689.84	1.02%
ముంబై	28180	30139.04	1.05%
ఢిల్లీ	27900	29839.57	0.53%
కోల్‌కతా	28220	30181.82	0.67%
కేరళ	27100	28983.96	0.37%
బెంగళూరు	27200	29090.91	0%
హైదరాబాద్	27740	29668.45	0.95%
గల్ఫ్	1365.57	1460.50	1.37%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	గురువారం	బుధవారం	మార్పు (%)
చెన్నై	42200.00	42400.00	-0.47
ముంబై	42200.00	42400.00	-0.47
ఢిల్లీ	42200.00	42400.00	-0.47
కోల్‌కత్తా	42200.00	42400.00	-0.47
హైదరాబాద్	42200.00	42400.00	-0.47



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	351	విశాఖపట్నం	360
వరంగల్	350	చిత్తూరు	380
విజయవాడ	355	చెన్నై	387
గోదావరి	355	బెంగళూరు	375

అవినీతి వ్యవస్థతో అవస్థలే : ప్రధాని



న్యూఢిల్లీ: అవినీతి ఇప్పుడు ఓ వ్యవస్థ అయి తిష్టవేసుకుని పోవడం బాధాకరం అని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. దేశం బాగుకోసం పెద్దలు, యువకులు అంతా కలిసి పాటుపడాల్సిన అవసరం ఉందని, అవినీతి నిర్మూలన ఇందులో కీలకం అని స్పష్టం చేశారు. నీతి ఆయోగ్ గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన ఛాంపియన్స్ ఆఫ్ ఛేంజ్ కార్యక్రమంలో యువ ఔత్సాహికులను ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు. దేశం వేగంగా సమగ్రంగా ప్రగతి చెందాలంటే అవినీతి లేకుండా చేయడం ముఖ్యమని తెలిపారు. అయితే అవినీతి, ముడుపుల వ్యవహారం విస్తరించడం, తానే వ్యవస్థ అయిపోవడం దురదృష్టకరం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళారీలు లేకుండా పోతేనే అవినీతి రహిత సమాజం ఏర్పడటానికి దారితీస్తుందని ప్రధాని తెలిపారు. దళారుల బెడద తీరిపోవల్సిన అవసరం ఆసన్నమైందని పిలుపు నిచ్చారు. యువ ఔత్సాహికవేత్తలను ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ విధానం అని , తమ పాలనలో మధ్య దళారీలకు స్థానం లేదని స్పష్టం చేశారు. వారు తోకముడవాల్సిందేనని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సంస్థల ఏర్పాటు సంబంధిత అంశాల గురించి ఈ కార్యక్రమంలో భాగంగా అంతకు ముందు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన అంశాన్ని ప్రధాని ప్రస్తావించారు.

జయ మృతిపై న్యాయ విచారణ




చెన్నై: తమిళనాడు దివంగత సిఎం జయలలిత మృతిపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పళని స్వామి న్యాయ విచారణకు ఆదేశించారు. అదే విధంగా పోయెస్‌గార్డెన్‌లోని జయ నివాసాన్ని స్మారకంగా మార్చనున్నట్టు వెల్లడించారు. తిరిగి అన్నాడిఎంకెలో విలీనం కావడానికి మాజీ సిఎం పన్నీర్ సెల్వం విధించిన ప్రధాన షరతులు ఇవే కావడం, త్వరలో వైరివర్గాలు ఏకం కానున్నాయని కొద్ది రోజులుగా వస్తున్న వార్తల నేపథ్యంలో పళని స్వామి తీసుకున్న నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. మంత్రులు జయకుమార్, శ్రీనివాసన్, తంగమణిలతో కలిసి గురువారంనాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో జయ మరణంపై విచారణకు ఆదేశిస్తున్నామన్నారు. త్వరలో జడ్జి పేరును ప్రకటిస్తామనని పళని చెప్పారు. అన్ని వర్గాల నుంచి వస్తున్న డిమాండ్లు, అభిప్రాయాల మేరకు ఆమె నివాసాన్ని స్మారకంగా మారుస్తున్నామని, ఇకపై ప్రజల సందర్శన కేంద్రంగా ఆమె ఇల్లు మారబోతోందని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా చికిత్స పొందుతూ గత సంవత్సరం డిసెంబర్‌లో జయలలిత గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. ఆమె మరణంతో అమ్మకు అత్యంత విశ్వాసపాత్రుడైన పన్నీర్ సెల్వం ముఖ్యమంత్రి అయ్యారు. తదనంతరం అమ్మ నెచ్చెలి శశికళ అన్నాడిఎంకె అధినేత్రిగా పార్టీ పగ్గాలు అందుకున్నారు. ఆ తర్వాత కొద్ది రోజులకు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించాలని భావించి అందుకు శశికళ రంగం సిద్ధం చేసుకుంటుండగా ఆమె నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పన్నీర్ అసమ్మతి గళాన్ని వినిపించారు. ఇంతలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శశికళ జైలుపాలు కావడం, ఆ తర్వాత నాటకీయ పరిణామాల నడుమ పళని స్వామి సీఎం పీఠాన్నెక్కడం జరిగిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటూ వచ్చిన పన్నీర్, పళని వర్గాలు కొంత కాలంగా విలీన చర్చలు జరుపుతూ ఒక్కతాటిపైకి రావడానికి ఏకాభిప్రాయానికి వచ్చాయి.

ఆడపిల్లను కన్నందుకు కాల్చేశాడు

బులంద్‌షెహర్: ఉత్తర్‌ప్రదేశ్‌లో దారుణం చోటు చేసుకుంది. ఆడపిల్లకు జన్మనిచ్చిందని భార్యను అక్కడికక్కడే తుపాకీతో కాల్చి చంపేశాడు ఓ భర్త. బులంద్‌షెహర్‌లోని కొత్వాలీ ప్రాంతానికి చెందిన ఓ వివాహితకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. బుధవారం ఆమెకు మూడో కాన్పులో మళ్లీ ఆడపిల్ల పుట్టింది. దాంతో బాలింత అని కూడా చూడకుండా తుపాకీతో కాల్చేశాడు భర్త ఆరిఫ్. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన తర్వాత ఆరిఫ్‌తో పాటు అతని కుటుంబీకులు పరారయ్యారు. మొదటి రెండు కాన్పుల్లోనూ ఆడపిల్లలే పుట్టారని ఆరిఫ్ రోజూ తన సోదరిని చిత్రహింసలు పెట్టేవాడని మృతురాలి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గని కార్మికుల భద్రతే ప్రధానం



న్యూఢిల్లీ: గనులలో పనిచేసే కార్మికుల భద్రత చాలా ప్రధానమని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గురువారం అన్నారు. ప్రమాదాలపై 'ప్రతిస్పందించే సంస్కృతి' నుంచి 'నివారించే సంస్కృతి' వైపుకు మళ్లాల్సి ఉందని ఆయన సూచించారు. మానవుల భద్రత అన్నింటికన్నా ప్రధానం అని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. జాతీయ భద్రతా అవార్డులు(గనులు) ప్రదానం చేస్తున్న సందర్భంగా ఆయన ఈ విషయం చెప్పారు. భారత్‌లో అపార ఖనిజ సంపద ఉందని, అది జాతి స్థూల జాతియోత్పత్తి(జిడిపి)కి 2.6 శాతం ఆదాయాన్ని అందిస్తోందన్నారు. ఎవరికీ ఎట్టి ప్రమాదాలు కలగని వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలన్నారు. భారత గనుల పరిశ్రమ చరిత్రలో మునుపెన్నడూ సాధించనంత విప్లవాత్మక మార్పును తెచ్చిందన్నారు. శూన్య ప్రమాదాల స్థాయికి తామింకా చేరుకోనేలేదని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. భారత గనుల పరిశ్రమ మార్పు దిశలో పయనిస్తోందని రామ్‌నాథ్ అన్నారు. భారత గనుల ఇంజినీరింగ్ సంస్థలలో ప్రపంచ స్థాయి ఆచరణలు తీసుకురావాలన్నారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులలో టిబి, సిలికోసిస్ వంటి నయం చేయలేని శ్వాసకోశ వ్యాధులు సవాలుగా తయారయ్యాయన్నారు. ఈ వేడుకలో కార్మిక మంత్రి బండారు దత్తాత్రేయ, సమాజ్‌వాది పార్టీ నాయకుడు ములాయం సింగ్ యాదవ్ పాల్గొన్నారు.

కొడైకెనాల్‌లో ఇరోం షర్మిల పెళ్లి



కొడైకెనాల్: మణిపూర్‌కు చెందిన పౌర హక్కుల కార్యకర్త ఇరోం షర్మిల తన చిరకాల భాగస్వామి, బ్రిటిష్ జాతీయుడు డెస్మాండ్ కౌంటిన్హోను ఇక్కడ గురువారం ఉదయం ప్రత్యేక వివాహ చట్టం కింద పెళ్లి చేసుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ రాధాకృష్ణన్ సమక్షంలో కౌంటిన్హో ఆమెకు పెళ్లి ఉంగరాన్ని తొడిగారు. ఇది చాలా సామాన్య వేడుకలా జరిగింది. ఈ పెళ్లికి వరుడు, వధువు తరఫు కుటుంబ సభ్యులు హాజరుకాలేదు. దీనికి ముందు కూడా ఈ ఇద్దరు హిందూ వివాహ చట్టం ప్రకారం పెళ్లి చేసుకున్నారు. కానీ ఇప్పుడు తాజాగా ప్రత్యేక వివాహ చట్టం కింద మళ్లీ పెళ్లిచేసుకున్నారు. వారిది మతాంతర వివాహం. ఈ సందర్భంగా షర్మిల విలేకరులతో మాట్లాడుతూ కొడైకెనాల్ చాలా ప్రశాంత ప్రదేశమని, కొడైకెనాల్‌లోని గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందాలని అన్నారు. ఈ పెళ్లిని స్థానిక కార్యకర్త వి. మహేంద్రన్ వ్యతిరేకించారు. వారిద్దరూ కొడైకెనాల్‌లో స్థిరపడితే అక్కడి గిరిజనులు శాంతిభద్రత సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. అయితే అతడి ఈ అభ్యంతరాన్ని సబ్‌రిజిస్ట్రార్ తిరస్కరించారు. ఈ ప్రాంతంలోని పళని మలై పులియాన్, పలియార్ అనే గిరిజన గ్రూపులు వారి పెళ్లికి మద్దతుగా సబ్‌రిజిస్ట్రార్‌కు మెమోరాండం సమర్పించారు. మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూశాక షర్మిల, కౌంటిన్హోతో కొడైకెనాల్‌కు మకాం మార్చారు. 16 ఏళ్ల పాటు నిరాహార దీక్ష చేసిన ఆమె మణిపూర్‌లో 'ఐరన్ లేడీ'గా ప్రసిద్ధి చెందారు. అఫ్సా చట్టాన్ని ఉపసంహరించేందుకు ఆమె మణిపూర్ ముఖ్యమంత్రి కావాలని కలలు కన్నారు. కానీ అది సాధ్యం కాలేదు.

భారత్‌లో విదేశీ పర్యాటకుల పెరుగుదల 15 శాతం



న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు వచ్చిన విదేశీ పర్యాటకులలో 15 శాతం పెరుగుదల కనిపించినట్లు పర్యాటక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. అత్యధిక విదేశీ పర్యాటకులు బంగ్లాదేశ్(20.12 శాతం) నుంచి రాగా, తర్వాత స్థానంలో అమెరికా పర్యాటకులు(16.26 శాతం), ఇంగ్లాండ్ పర్యాటకులు(10.88 శాతం), ఫ్రాన్స్(3.01 శాతం) పర్యాటకులు నిలిచారు. 2017 జనవరి నుంచి జులై నాటికి విదేశీ పర్యాటకుల రాక(ఎఫ్‌టిఎ) 56.74 లక్షలుగా ఉ ంది. ఇది గత ఏడాది 49.03 లక్షల పర్యాటకులతో పోల్చుకున్నప్పుడు 15.7 శాతం అధికం అని తేలింది. ఇ–వీసాపై భారత్‌కు వస్తున్న విదేశీ పర్యాకుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఇ–వీసాలు అత్యధికంగా పొందిన వారిలో బ్రిటన్ పర్యాటకులు ఎక్కువగా ఉన్నారు. బ్రిటన్ పర్యాటకులు ఇ–వీసా సదుపాయాన్ని పొందడంలో 12.9 శాతం ఉన్నారు.



శరద్ యాదవ్ నాయకత్వంలో ఏర్పాటు చేసిన సదస్సుకు హాజరైన సిపిఐ, నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ నేతలు

ఐక్యతకు సంకేతం

శరద్ సభతో ఒకే వేదికపైకి 16 మంది ప్రతిపక్ష నేతలు

న్యూఢిల్లీ: దేశ సమిష్టి సంస్కృతి పరిరక్షణకు కట్టుబడి ఉండాలని 16 ప్రతిపక్ష పార్టీల నాయకులు నిర్ణయించారు. జనతాదళ్ (యూ) నేత శరద్ యాదవ్ నాయకత్వంలో దేశ రాజధానిలో గురువారం ఏర్పాటు అయిన సమిష్టి సంస్కృతి పరిరక్షణ సభకు 16 ప్రతిపక్షాల ప్రముఖ నేతలు హాజరు కావడం కీలకంగా మారింది. గురువారం నాటి ఈ భేటీకి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాహుల్, సిపిఐ నేతలు సురవరం సుధాకర రెడ్డి, డి రాజా, సిపిఎం నేత సీతారాం ఏచూరి, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షులు ఫరూఖ్ అబ్దుల్లా వంటి కీలక నేతలు హాజరు అయ్యారు. ఇటీవలే సోనియా గాంధీ చొరవతో దేశ రాజధానిలో ప్రతిపక్ష పార్టీల నేతల సమావేశం తరువాత ఇంతటి విస్తృత స్థాయిలో అంతా ఒకే చోట చేరడం ఇది రెండోసారి. జెడియూ అధ్యక్షులు నితీశ్ కుమార్ బీహార్‌లో బిజెపితో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై నిరసనకు దిగుతున్న శరద్ యాదవ్ వివిధ కార్యక్రమాల పేరిట పెడుతున్న సభలు జెడియూలో కలవరం కల్గిస్తున్నాయి. పార్టీ వేదికను వాడుకోకుండా ఆయన వీటి నుంచే బిజెపిని తీవ్రంగా దుయ్యబట్టడం జెడియూకు, బిజెపికి కలవరం కల్గిస్తోంది. గురువారం నాటి కార్యక్రమానికి టిఎంసి అధినేత్రి మమత బెనర్జీ, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ హాజరు కాలేదు. అయితే ఒకేసారి రోజంతా జరిగిన సమావేశానికి ఇంతర మంది నేతలు హాజరయి , బిజెపి విధానాలను ఎండగట్టడం ప్రతిపక్షాల బలప్రదర్శనగా భావిస్తున్నారు. ప్రతిపక్షాలు బలహీనం అయి ఉండొచ్చు, కానీ తెరమరుగు కాలేదు. ఇప్పుడు పడుతున్నవి కేవలం తొలి అడుగులే. పలు విధాలుగా ప్రతిపక్షాల ఐక్యత దిశలో పురోగతి ఉంటుందని విశ్లేషించుకోవచ్చునని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు సుబ్రతా ముఖర్జీ తెలిపారు. పలు అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయని, అప్పటికీ ప్రతిపక్షాల బలోపేతం ఉంటుందని, ఇప్పటి సంకేతాలు రాబోయే రోజులలో ప్రతిపక్షాల ఐక్యత బలాన్ని చాటుతున్నాయని తెలిపారు.

స్వచ్ఛ్ సరే.. సచ్ ఏదీ?



న్యూఢిల్లీ: స్వచ్ఛ్ భారత్ నినాదం సరే, సచ్ భారత్ ఏదని కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాహుల్ గాంధీ ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం స్వచ్ఛ్ భారత్‌ను కోరుకొంటోందని, అయితే చేసిన వాగ్దానాలను తీర్చే ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకొంటున్నారని రాహుల్ స్పష్టం చేశారు. జెడియూ నేత శరద్ యాదవ్ ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రతిపక్షాల సమావేశంలో రాహుల్ గురువారం మాట్లాడారు. ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో కేంద్రం విఫలం అయిందని, ఇది ప్రజల పట్ల ద్రోహం కాదా? ఇది సత్యభారత ధర్మమా? అని రాహుల్ నిలదీశారు. మేకిన్ ఇండియా ప్రతిష్టాత్మక పథకం అని ప్రభుత్వం చెపుతోందని, అయితే దేశంలో లభ్యం అయ్యే పలు వస్తువులు చైనావే అని తెలిపారు. మోడీ చెపుతున్న దానికి వాస్తవానికి పొంతననే లేదని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపి పలు వాగ్దానాలను చేసిందని, నల్ల ధనం వెలికితీస్తామని తెలిపిందని, యువతకు ఉద్యోగాలు ఇస్తామని వరాలిచ్చిందని అయితే ఏ ఒక్కటీ నిలబెట్టుకోలేదని విమర్శించారు. దేశ సమిష్టి సంస్కృతిని పరిరక్షించండనే ఇతివృత్తంతో ప్రతిపక్ష నేతలతో శరద్ యాదవ్ ఈ సభ ఏర్పాటు చేశారు. దీనికి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, సీనియర్ కాంగ్రెస్ నేతలు, సిపిఐ జాతీయ కార్యదర్శి డి రాజా, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఇతరులు హాజరు అయ్యారు. మోడీ ఎక్కడికి వెళ్లినా అసత్యాలే వల్లిస్తున్నాడని, దేశానికి ఇది చేదు అవుతోందని రాహుల్ గాంధీ తెలిపారు. బిజెపి దన్ను చూసుకుని ఆర్‌ఎస్‌ఎస్ అరాచకాలకు పాల్పడుతోందని, దేశ రాజ్యాంగాన్ని మార్చే యత్నాలకు దిగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఇప్పుడు రెండు భిన్న వాదనలు నెలకొని ఉన్నాయని, ఒకరు ఈ దేశం తమదే అంటున్నారని, మరొకరు తాను ఈ దేశానికి చెందిన వాడినని పేర్కొంటున్నారు.

సరుకులు, సరిహద్దుల టెన్షన్ తగదు : సురవరం

హైదరాబాద్: చవకగా ఉన్నంత వరకూ ప్రజలు చైనా సరుకులను కొంటూనే ఉంటారని ప్రజలు నచ్చిన వాటిని కొంటారు. లేదంటే తిరస్కరిస్తారని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి చెప్పారు. కొందరు వ్యక్తులు చైనా ఉత్పత్తులను బహిష్కరించాలని చెపుతున్నారని, ఈ వ్యాఖ్యలపై తామేమీ స్పందించడం లేదని ఆయన స్పష్టం చేశారు. చైనా ఉత్పత్తుల బహిష్కరణ, చైనాతో సరిహద్దుల ప్రతిష్టంభన నేపథ్యంలో సురవరం ఈ అంశంపై స్పందించారు. ప్రజలు ఏది చవకగా దొరికితే వాటిని కొంటారని, తామైతే ఆ సరుకులకు వ్యతిరేకం కాదు, అనుకూలమూ కాదని సిపిఐ నేత స్పష్టం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు కొందరు, యోగా గురు బాబా రాందేవ్ వంటివారు చైనా వస్తువులను దేశం నుంచి బహిష్కరించాలని పిలుపు ఇస్తున్నారు. ఏ రెండు దేశాల మధ్య ఏ మేరకు అయినా ఉద్రిక్తత ఉంటే ఆ సందర్భంలోనే ఈ విధంగా వస్తువుల బహిష్కరణ వంటి డిమాండ్లు వస్తుంటాయని, అయితే కొందరు వ్యక్తులు అనధికారికంగా చెప్పే మాటలకు పెద్దగా విలువ ఉంటుందని కానీ, వాటి వల్ల ప్రభావం పడుతుందని కానీ తాను అనుకోవడం లేదని సురవరం అభిప్రాయపడ్డారు. భారత్, చైనా మధ్య ప్రస్తుత ప్రతిష్టంభన సాయుధ ఘర్షణకు దారి తీయరాదని తాము ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అయితే ఉద్రిక్తతలు కొనసాగడం కూడా క్షేమదాయకం కాదని స్పష్టంచేశారు. ఇరుగుపొరుగుగా ఉన్నప్పుడు, అంతా కలివిడిగా ఉంటే మంచిదని సూచించారు. ఇరుగుపొరుగుతో బాగుండాలని వారు కూడా గ్రహించాలని , సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు వారు ముందుకు రావాలని ఆయన చైనాను పరోక్షంగా ప్రస్తావించారు.

22న బ్యాంకుల ఒక్కరోజు సమ్మె

కోల్‌కతా: సంస్కరణల పేరిట ఉద్యోగ వ్యతిరేక చర్యలకు నిరసనగా ఈ నెల 22 వ తేదీన బ్యాంకులు సమ్మెకు దిగనున్నాయి. బ్యాంకింగ్ రంగంలోని ట్రేడ్ యూనియన్ల ఉమ్మడి వేదిక యుఎఫ్‌బియు పిలుపు మేరకు ఈ ఒక్కరోజు హర్తాళ్ జరుగనుంది. దేశ బ్యాంకింగ్ రంగాన్ని సంస్కరణల పేరిట ప్రైవేటుమయం చేసి, ఆధిపత్యం చాటేలా చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని ఉమ్మడి సంఘం పశ్చిమ బెంగాల్ కన్వీనర్ సిద్ధార్థ ఖాన్ విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్యాంక్ బోర్డు బ్యూరోతో అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులను బ్యాంకింగ్ పెట్టుబడుల కంపెనీగా మార్చే యత్నాలు సాగుతున్నాయని, మొండి బకాయిలను రాబట్టుకోవడంలో సరిగ్గా వ్యవహరించకుండా చేస్తున్నారని సమావేశంలో తెలిపారు.

పాపకు జన్మనిచ్చిన పదేళ్ల బాలిక

కడుపులో రాయి ఉందని చెప్పి... అత్యాచార బాధితురాలికి సిజేరియన్

చండీగఢ్: అన్నెం పున్నెం తెలియని ఓ చిన్నారి తల్లి అయింది. సొంత మేనమామ లైంగిక వాంఛకు ఎర అయి, అత్యాచారానికి గురై పదవ ఏటనే గర్భం దాల్చి, ఓ కూతురిని ప్రసవించింది. ఆమె గర్భవిచ్ఛిత్తి సుప్రీంకోర్టు నిరాకరించడంతో పదవ ఏటనే శిశువును పొత్తిళ్లలో పంచుకోవల్సి వచ్చింది. స్థానిక ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ పదేళ్ల బాలిక అనుచిత గర్భం నెలలు నిండటంతో సిజరేయన్ ఆపరేషన్‌తో పురుడు పోయాల్సి వచ్చింది. బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. గురువారం ఉదయం బాలిక ప్రసవించింది. శిశువు తక్కువ బరువుతో పుట్టిందని, ముందు జాగ్రత్త చర్యగా నవజాత శిశువుల ఐసియూలో చేర్పించారని డాక్టర్ దాసరి హరీష్ తెలిపారు. ఈ బాలిక గర్భం దాల్చడంతో, ప్రాణానికి సంకటం కారణంగా గర్భం మోయాల్సి వచ్చింది. అత్యాచార బాధితురాలి చికిత్స, ప్రసవం సంబంధిత క్షేమం గురించి ఓ వైద్యుల బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతానికి తల్లి ఆరోగ్యంగా ఉందని, శిశువు కూడా కుదుటపడుతుందని డాక్టర్ హరీష్ తెలిపారు. అనివార్య పరిస్థితుల్లోనే కాన్పుకోసం ఈ ఆపరేషన్ చేశారు. చిన్నతనంలోనే వచ్చిన ఈ గర్భం అత్యంత ప్రమాదకరని తెలిసినా, తప్పనిసరిగా సిజేరియన్ చేయాల్సి వచ్చిందని వెల్లడించారు. ముగ్గురు గైనకాలజిస్టులు, ఒక అనస్థియెటిస్ట్, శిశు నిపుణులు, బాలల వైద్యుడు ఈ వైద్య బృందంలో ఉన్నారు.

ఈ చిన్నారికి తల్లి అయినట్లు తెలియదు

పది సంవత్సరాల బాలిక గర్భవతి కావడం ఆమె తల్లిదండ్రులకు పుట్టెడు శోకం మిగిల్చింది. కడుపులో ఉన్నది గర్భం కాదని, రాయి అని చెపుతూ నమ్మిస్తూ వచ్చారు. ఆపరేషన్ చేసి రాయిని తీస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న బాలికకు తాను తల్లి అయినట్లు తనకో బిడ్డ పుట్టినట్లు తెలియదు. పుట్టిన బిడ్డను తమ కూతురి నుంచి దూరం చేయాలని, ఆమెను ఎవరైనా పెద్ద మనస్సున్న వారికి దత్తతకు ఇవ్వాలని తల్లిదండ్రులు డాక్టర్లను, ఇతరులను వేడుకుంటున్నారు. ఈ బాలికది ఓ బాధాకరమైన అనుభవం. తెలిసితెలియని వయస్సులో ఉన్న ఆమెను నెలల తరబడి ఆమె మేనమామ అనుభవిస్తూ వచ్చాడు. ఆమెకు ఏం జరుగుతుందో తెలియని స్థితిలో బతుకు భారం చేశాడు. కడుపు నొప్పి వస్తోందని విలవిలలాడుతూ ఉంటే ఆమెను ఆసుపత్రికి తీసుకుపోగా అక్కడ గత నెలలో గర్భవతి అని వెల్లడైంది. అప్పటికే ఆమె 32 వారాల గర్భవతి.

ఆక్సిజన్ సంస్థదే ఆ పాపం

గోరఖ్‌పూర్ ఆసుపత్రిపై దర్యాప్తు నివేదిక

లక్నో/గోరఖ్‌పూర్: బిఆర్‌డి వైద్య కళాశాలకు ఆక్సిజన్ సరఫరా చేసే లక్నో సంస్థదే బాధ్యత అంతా అని గోరఖ్‌పూర్ జిల్లా పాలక యంత్రాంగం తన దర్యాప్తులో పేర్కొంది. ఆగస్టు 10న ఆసుపత్రికి ఆక్సిజన్ సరఫరాకాక 23 మంది పిల్లలు చనిపోయిన ఘటనపై దర్యాప్తు చేశారు. ఈ దర్యాప్తులో ఆర్థిక అవకతవకలు, లాగ్‌బుక్‌లో తిరిగి రాయడం వంటివి చోటుచేసుకున్నాయని గుర్తించింది. అనస్థీసియా శాఖ అధిపతి డాక్టర్ సతీశ్ కుమార్ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల దర్యాప్తు సంఘం చీఫ్ ఫార్మాసిస్టు గజానన్ జైస్వాల్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజీవ్ మిశ్రా తమ విధులు సరిగా నిర్వహించలేదని పేర్కొంది. మరణాలకు ఎవరు బాధ్యులు అన్న దానిపై దర్యాప్తు సంఘం నివేదిక ఏమి చెప్పలేదు. అయితే మరణాలు ఆక్సిజన్ కొరత వల్ల జరగలేదని చీఫ్ వైద్యాధికారి డాక్టర్ రవీంద్ర కుమార్ విలేకరులకు తెలిపారు. లక్నోకు చెందిన ఆక్సిజన్ పంపిణీ సంస్థ మెస్సర్స్ పుష్పా సేల్ ప్రై.లి. ఆక్సిజన్ సరఫరాకు అంతరాయం కలిగించిందని, జీవ రక్షక విధులు నిర్వహిస్తున్న ఆ సంస్థ అలా చేయకుండా ఉండాల్సింది అని దర్యాప్తు సంఘం అభిప్రాయపడింది. చీఫ్ ఫార్మాసిస్టు గజానన్ జైస్వాల్ ఆక్సిజన్ సిలిండర్ల స్టాక్ బుక్‌ను, లాగ్ బుక్‌ను సరిగి నిర్వహించలేదని, పైగా వాటిలో తిరిగి రాయడం జరిగిందని డాక్టర్ సతీశ్ కుమార్ అన్నారు. ఓ రిపోర్టు ప్రకారం ప్రిన్సిపల్ డాక్టర్ మిశ్రా ఆగస్టు 10 నుంచి ప్రధాన కార్యాలయం నుంచి వెళ్లిపోయారని, ఆగస్టు 11 నుంచి అనుమతి లేకుండానే డాక్టర్ సతీశ్ ముంబయికి వెళ్ళిపోయారని సమాచారం.

'బ్లూవేల్' ఆటపై ఆందోళన

పిటిషన్‌పై ఉత్తర్వులు జారీ చేయని ఢిల్లీ హైకోర్టు



న్యూఢిల్లీ: బ్లూవేల్ ఛాలెంజ్ అనే ఇంటర్నెట్ ఆటను ఆడతూ పిల్లలు ఆత్మహత్యలు చేసుకోవడంపై ఢిల్లీ హైకోర్టు గురువారం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఈ ఆట వల్ల అనేక మంది చనిపోయినట్లు కథనాలున్నాయి. ఈ ప్రమాదకర ఆటలోకి పెద్దలు కూడా ఎందుకు చేరుతున్నారన్న విషయంపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్, న్యాయమూర్తి సి.హరిశంకర్‌తో కూడిన ధర్మాసనం విస్మయాన్ని వ్యక్తం చేశారు. పిల్లలు ఈ ఆటకు ప్రభావితులవుతున్నారంటే అర్థం చేసుకోవచ్చు... కానీ పెద్దలు ఎందుకు పాలుపంచుకుంటున్నారని ధర్మాసనం అభిప్రాయపడింది. 'ఒకవేళ వయోజనుడికి ఓ పని పూర్తి చేయాలని చెబితే.. అతడెందుకని భవనంపై నుంచి దూకుతున్నాడు? పిల్లలు, పెద్దలు ఈ ప్రమాదకర ఆటలో పాలుపంచుకోవడం తమని విస్మయపరుస్తోంది' అని ధర్మాసనం తెలిపింది. బ్లూవేల్ ఆటకు సంబంధించిన లింకులు తెంచేయాలని గూగుల్, ఫేస్‌బుక్, యాహు వంటి ఇంటర్నెట్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేయాలన్న పిటిషన్‌పై ఉత్తర్వులు జారీ చేయకుండా ఢిల్లీ హైకోర్టు ఆగిపోయింది. బ్లూవేల్ గేమ్ డౌన్‌లోడ్‌పై ప్రభుత్వం ఏమైనా నిషేధం విధించిందా? అన్నది తెలుసుకోగోరింది. ఢిల్లీలో బ్లూవేల్ ఆటకు సంబంధించిన ఆత్మహత్యలు ఏమైనా జరిగాయా? అని పిటిషనర్, న్యాయవాది గుర్మీత్ సింగ్‌ను ధర్మాసనం ఈ సందర్భంగా ప్రశ్నించింది. ఏవైనా నిషేధాజ్ఞలు జారీ చేయాలా అని పిటిషనర్‌ను అడగడమే కాకుండా తదుపరి విచారణను ఆగస్టు 22న జరుగుతుందని పేర్కొంది. ఇదిలా రెండు రోజుల క్రితం ఐటి మంత్రిత్వ శాఖ బ్లూవేల్ ఛాలెం జ్ ఆట లింకులను వెంటనే తొలగించాలంటూ గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, మైక్రోసాఫ్ట్, యాహు వంటి కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. గమనించాల్సిన విషయమేమిటంటే ఈ ఆటలో చివరి అంశం ఆత్మహత్యకు పాల్పడేదిగా ఉంటుంది. ఈ ప్రమాదకర ఆన్‌లైన్ ఆటకు ఇటీవల హఠాత్తుగా జనాదరణ ఏర్పడింది.

అమెరికా నుంచి ఆరు అపాచీ హెలికాప్టర్లు

డిఎసి కీలక నిర్ణయం... దాడి సామర్థ్యంలో దిట్ట



న్యూఢిల్లీ: అమెరికా నుంచి ఆరు అత్యంత అధునాతనమైన అపాచి హెలికాప్టర్లను కొనుగోలు చేయాలని భారతదేశం నిర్ణయించింది. దేశ రక్షణ సేకరణ మండలి (డిఎసి) గురువారం దీనికి సంబంధించిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. రూ 4,168 కోట్ల విలువైన దాడి సామర్థ్య అపాచి ఎహెచ్ 64 ఇలను సంతరించుకోవాలనే నిర్ణయం దేశ భద్రతా కోణంలో కీలకమైనదని రక్షణ మంత్రిత్వశాఖ వర్గాలు తెలిపాయి. బోయింగ్ నిర్మితమైన ఈ హెలికాప్టర్లు, సంబంధిత ముడిపరికరాల కొనుగోళ్ల ప్రతిపాదన ఆమోదం పొందిందని అధికార వర్గాలు వెల్లడించాయి. శత్రు స్థావరాలపై దాడుల లక్ష్యంలో సమర్థవంతమైన ఈ హెలికాప్టర్లను సంతరించుకోవాలని చాలా కాలంగా సైన్యం ఆశిస్తోంది. అయితే వైమానిక దళం దీనికి ఇంతకాలం అభ్యంతరం చెపుతూ వచ్చింది. ఇప్పటికే భారతదేశం 300 కోట్ల డాలర్లకు పైగా విలువైన 22 బోయింగ్ అపాచి హెలికాప్టర్లకు , 15 ఛినూక్ భారీ వాహక సామర్థ్యపు చోపర్ల కోసం ఆర్డర్లను పంపించింది. వీటికి సంబంధించి ఇప్పుడు ఆరింటికి డిఎసి నుంచి అనుమతి దక్కింది. ఈ మండలికి రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ నాయకత్వం వహిస్తున్నారు.

ఎఐఎస్ఎ అధ్యక్షురాలికి ఎబివిపి వేధింపులు

న్యూఢిల్లీ: సత్యవతి కాలేజీకి చెందిన ఎబివిపి విద్యార్థులు తనను వేధించడంతోపాటు దుర్భాషలాడారని ఢిల్లీ యూనివర్సిటికి చెందిన ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్(ఎఐఎస్ఎ) అధ్యక్షురాలు కవల్ ప్రీత్ కౌర్ ఆరోపించారు. ఈ మేరకు ఆమె భరత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం తాను అకడమిక్ సంబంధిత పని కోసం సత్యవతి కాలేజ్‌కు వెళ్లగా 20 మంది ఎబివిపి విద్యార్థులు తనను చుట్టుముట్టారని కౌర్ తెలిపారు. ఏ ఉద్దేశంతో కాలేజీకి వచ్చావంటూ ప్రశ్నించడంతో పాటు తన ఫొటోలను తీశారని, తనను వీడియో తీసి రికార్డు చేశారని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. తనను పరుష పదాలతో దూషించారని, తన ప్రవర్తన, జాతీయతపై ప్రశ్నించారని పేర్కొన్నారు.

వెళ్లగొట్టిన వైద్యులు.. రిక్షాలో ప్రసవం

సహరాన్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది అమానుషంగా ప్రవర్తించారు. అర్ధరాత్రి ఓ గర్భిణిని ఆస్పత్రి సిబ్బంది బయటకు పంపించడంతో ఆమె ఇరిక్షాలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆగస్టు 14న కార్మికురాలైన మునవర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిందని, ఆమెకు ఎటువంటి వైద్య పరీక్షలు నిర్వహించకుండానే ఆస్పత్రి నుంచి పంపించారని జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ మిశ్రా తెలిపారు. మునవర్‌ను ఆమె భర్త మరో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో రిక్షాలోనే మగబిడ్డకు జన్మనిచ్చినట్లు ఎస్‌పి తెలిపారు. అనంతరం ఆమె ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మునవర్ భర్త పోలీసులు ఫిర్యాదు చేశారని మిశ్రా పేర్కొన్నారు.



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు అభినందనలు

మన తెలంగాణ/న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వెంకయ్య నాయుడును పలువురు మంత్రులు మరియు ప్రముఖులు గురువారం ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలియజేశారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రి శ్రీ బండారు దత్తాత్రేయ, మాజీ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ కె.జి. బాలకృష్ణన్, సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్, శ్రీ కె.వి. చౌధరి, సిబిఐ డైరెక్టర్, శ్రీ ఆలోక్ కుమార్ వర్మ శ్రీ వెంకయ్య నాయుడును కలిసినవారిలో ఉన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల కార్యదర్శి, శ్రీ రాజీవ్ యాదవ్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మాజీ చైర్మన్, ప్రొ. వేద్ ప్రకాశ్, మాజీ ఐపిఎస్ అధికారిణి, శ్రీమతి అరుణా బహుగుణ తదితరులు కూడా శ్రీ వెంకయ్య నాయుడును కలిసి అభినందనలు తెలియజేశారు. ఉన్నతమైన పదవికే వన్నె తెచ్చే వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి శ్రీ వెంకయ్య నాయుడు అని, రాజ్యాంగ స్ఫూర్తితో ప్రపంచంలోనే అత్యున్నతమైన మన పార్యమెంటరీ వ్యవస్థను మరింత బలపరిచేలా పనిచెయ్యాలని పలువురు ఆకాంక్షించారు. తనను కలిసి అభినందనలు తెలియజేసిన వారికి శ్రీ వెంకయ్య నాయుడు ధన్యవాదాలు తెలియజేశారు.

ర్యాలీపై ట్రంప్ ప్రకటన అనుచితం

భారతీయ అమెరికన్ల ఖండన

వాషింగ్టన్: వర్జీనియా రాష్ట్రంలో శ్వేత జాత్యహంకార ర్యాలీలో హింసాకాండ చెలరేగడాన్ని హిందూ, సిక్కు అమెరికన్లు తీవ్రంగా ఖండించారు. ఆ హింసాకాండలో ఒక మహిళ మరణించగా 19 మంది గాయపడ్డారు. ఆ ఉదంతంపై అధ్యక్షుడు ఇరుపక్షాలను తప్పుపడుతూ చేసిన ప్రకటనను కూడా వారు ఖండించారు. జాత్యహంకారుల ర్యాలీకి నిరసనగా జనం గుమిగూడి ప్రదర్శన జరిపినపుడు ఒక కారు వారిపైకి దూసుకువెళ్లడంతో మహిళ మరణించింది. చార్లట్ విల్లీలో గత వారాంతంలో జరిగిన ఈ ఘటనలు విద్వేష, అసహనం వ్యాప్తికి నిదర్శనంగా నిలిచాయని సిక్కు, హిందూ అమెరికన్లు విమర్శించారు. పిడివాదంతో కూడిన తిరోగమన భావజాలాన్ని హింసాకాండతో కలిపి చెలాయించడంగా హిందూ అమెరికన్ ఫౌండేషన్ ఒక ప్రకటనలో ఆ ఉదంతాన్ని ఖండించింది. ట్రంప్ ఈ ఘటనలపై తాజా ప్రకటనలో కప్పదాటు ధోరణి ప్రదర్శించారని కూడా వారు విమర్శించారు. జాతీయ సిక్కు ఉద్యమ సంస్థ సహ వ్యవస్థాపకులు రజ్వంత్ సింగ్ కూడా ట్రంప్ ప్రకటనను తప్పుపట్టారు. నియో నాజీలు, కెకెకె (క్లూ క్లక్స్ కాన్)ల అహంకార ప్రచారాలను భిన్నత్వంపట్ల అసహనంగా ఆయన పేర్కొన్నారు.

నేడు నవాజ్ షరీఫ్ ఇంటరాగేషన్

లాహోర్: పాకిస్థాన్‌లో అగ్రశ్రేణి అవినీతి వ్యతిరేక సంస్థ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ అతని ఇద్దరు కుమారులను మనీలాండరింగ్ కేసులలో శుక్రవారం రావాలని సమన్లు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుపై ఈ చర్య తీసుకొంది. 'నేషనల్ అకౌంటబులిటీ బ్యూరో (ఎన్‌ఎబి)' ఈ సమన్లు నవాజ్‌కు, అతని ఇద్దరు కుమారులు హుస్సేన్ హసన్‌కు జారీ చేసింది. తమ సంస్థ లాహోర్ కార్యాలయానికి రావాలని వారిని ఆదేశించింది. పనామా పేపర్స్ వెల్లడించిన విదేశాల్లోని వారి ఆస్తులకు సంబంధించిన విచారణ నిమిత్తం ఈ సమన్లు జారీ చేశారు. గత నెల 28న సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్ నవాజ్‌ను అనర్హునిగా ప్రకటించింది. యుఎఇలో తన కుమారునికి వర్క్ పర్మిట్ ప్రాసెస్ చేసినందుకు అతడిని దోషిగా ప్రకటించడంతో వెంటనే ఆయన రాజీనామా చేశారు. ఆ ఉత్తర్వులో భాగంగా నవాజ్, కుమారుల అవినీతిపై ఎన్‌ఎబి దర్యాప్తునకు కూడా ఆ బెంచ్ ఆదేశించింది.

యుద్ధం రానేరాదు : దక్షిణ కొరియా

సియోల్: కొరియా ద్వీపకల్పంలో యుద్ధం ఏర్పడదని దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జె ఇన్ గురువారం నాడు ప్రకటించారు. ఉత్తర కొరియా క్షిపణి కార్యక్రమాలపై ప్రతిస్పందనగా అమెరికా సైనిక చర్యకు దిగితే తమ దేశం వీటో చేస్తుందని ఆయన చెప్పారు. కొరియా యుద్ధం తర్వాత ఉభయ కొరియాల విలీనానికి తమ దేశం ఎంతో కృషి చేసిందని ఆయన చెప్పారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి అయిన సందర్భంగా విలేకరుల గోష్ఠిలో ఆయన మాట్లాడారు. ఎట్టి పరిస్థితిలోనూ యుద్ధం జరగకుండా తాను చూస్తానని ప్రతిజ్ఞ చేశారు. యుద్ధం రాదని దక్షిణ కొరియా ప్రజలు గట్టిగా నమ్ముతున్నారని కూడా చెప్పారు. చర్చల ద్వారా సమస్య పరిష్కారానికి మూన్ ప్రయత్నిస్తున్నారు.

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

మన తెలంగాణ/ హైదరాబాద్ : కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికలను నిలిపివేస్తూ స్టే మంజూరుకు న్యాయమూర్తి పి. నవీన్‌రావు అంగీకరించలేదు. ఎన్నికల ఫలితాలు తాము వెలువరించే తుది తూర్పుకు లోబడి ఉంటాయని హైకోర్టు ప్రకటించింది. వార్డుల పునర్విభజన, రిజరేష్వన్ల ఖరారు, మేయర్ అభ్యర్థి రిజర్వేషన్‌పై దాఖలైన రిట్లను హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాదనల తెలియజేయాలని గురువారం హైకోర్టు ఆదేశించింది. తొమ్మిది గ్రామాల విలీనంతో అక్కడి జనభా, ఓటర్లను లెక్కలోకి తీసుకొని 50 వార్డులకు రిజర్వేషన్లు ఖరారు చేశారని, మూడు గ్రామాల విలీనాన్ని హైకోర్టు నిలిపివేయడంతో 48 డివిజన్లకే ఎన్నికలు జరిపితే రిజర్వేషన్లు తారుమారు అవుతాయని, మరో తొమ్మిది గ్రామాల విలీనంపై కేసులు ఇంకా హైకోర్టులో పెండింగ్‌లోనే ఉన్నాయని, కాబట్టి ఎన్నికలపై స్టే విధించాలనే పిటిషనర్ అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. అయితే ప్రధాన కేసులను విచారణకు స్వీకరిస్తున్నామని, వాటిపై కోర్టు ఇచ్చే తీర్పుకు లోబడి ఎన్నికలు ఉండాలని హైకోర్టు షరతు విధించింది. నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత న్యాయస్థానాలు జోక్యం చేసుకోరాదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని ఎన్నికల సంఘం వాదనల సమయంలో గుర్తు చేసింది. మేయర్ రిజర్వేషన్ కేసును ఈ నెల 30న, వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు రిట్లపై సెప్టెంబరులో విచారణ జరుపుతామని హైకోర్టు వెల్లడించింది.

మెడికల్ ఆడిట్ ఆవశ్యకత ఎంతోవుంది



మన తెలంగాణ/హైదరాబాద్ : హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హైమా) సహకారంతో 'మెడికల్ ఆడిట్'పై గురువారంనాడు అపోలో హాస్పిటల్స్ ఒక్కరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించింది. హైమా ఇండియా అధ్యక్షులు మెడికల్ రికార్డ్స్‌కు పితామహుడిగా ప్రఖ్యాతిగాంచిన ప్రొఫెసర్ జి.డి. మొగ్లీ ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ సిఇఒ వై.సుబ్రమణ్యం, ఎన్‌ఆర్‌ఐ అకాడమి సెక్రటరీ డా॥ రాజు ఎన్.మంతెన, అపోలో హెల్త్ సిటీ మెడికల్ సూపరింటెంట్ ఎ రవీంద్ర బాబు, ప్రముఖ అధ్యాపకులు ప్రొఫెసర్ సత్యనారాయణ, లెఫ్టినెంట్ కల్నల్ డా॥ కె.కమలాకర్‌లు పాల్గొన్నారు.మెడికల్ ఆడిట్ అనేది రోగి సంరక్షణతోపాటు వైద్య ఫలితాలను మెరుగుపరచాలని కోరుకునే నాణ్యతకు సంబంధించిన ఒక ప్రక్రియ అని,దీని ద్వారా నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా ప్రస్తుత పద్ధతులను లెక్కించడానికి, పని నాణ్యతలో తేడాను గుర్తించడానికి వీలు కల్పిస్తుందని మొగ్లీ అన్నారు.

25న డాక్టర్ దేవులపల్లి రామానుజరావు శతజయంతి

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమ మార్గదర్శకుడు డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు శతజయంతి ఉత్సవాలను ఆగస్టు 25న నిర్వహించనున్నారు. నిజాం పాలనలో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన రామానుజరావు సారస్వత పరిషత్‌కు అనేక సంవత్సరాలు ఛైర్మన్‌గా వ్యవహరించారు. రామానుజ రావు శత జయంతిని నిర్వహించేందుకు ఖర్చులను మంజూరు చేస్తూ సాంస్కృతిక శాఖ కార్యదర్శి (పూర్తి అదనపు బాధ్యతలు) అనిత రాజేంద్ర గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్పెయిన్‌లో ఉగ్రదాడి, 13మంది దుర్మరణం

వ్యానుతో ఢీకొట్టి ఉగ్రవాదుల ఘాతుకం



బార్సిలోనా: స్పెయిన్‌లోని ప్రఖ్యాత నగరం బార్సిలోనాలో ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. వ్యానుతో పాదచారులను ఢీ కొట్టించి 13మందిని పొట్టనబెట్టుకున్నారు. గురువారంనాడు జరిగిన ఈ ఘటనలో మరో 20మంది తీవ్ర గాయాలపాల య్యారు. ఇక్కడ వేసవి కాలం కావడంతో టూరిస్టులు బార్సిలోనాకు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఉగ్రవాదులు ప్రధానంగా పర్యాటకులనే లక్ష్యంగా చేసుకున్నట్టు కనిపిస్తోందని స్పెయిన్ అధికారిక రేడియో వెల్లడించింది. వ్యానుతో ఘాతుకానికి ఒడిగట్టిన ఉగ్రవాదులు అనంతరం సమీపంలోని రెస్టారెంట్‌లోకి చొరబడినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. దగ్గరలోని షాపులు, రెస్టారెంట్లను మూసి వేసి సహాయక చర్యలకు పూనుకున్నాయి. మరోవైపు ప్రత్యేక బలగాలు ఉగ్రవాదుల ఏరివేతకు నడుంకట్టాయి.

'సింగరేణి వేతనం'పై కుదరని సయోధ్య

- కార్మికుల పదవ వేతన చర్చల్లో కానరాని పురోగతి
- మొదటి రోజు జరిగిన జెబిసిసిఐ సమావేశంలో అంగీకరించని యాజమాన్యం



మన తెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి: బొగ్గు గని కార్మికుల పదవ వేతన సవరణ చర్చల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదు. గురువారం రాంచీలో జాతీయ కార్మిక సంఘాల నాయకులకు, బొగ్గు పరిశ్రమల ప్రతినిధులకు మధ్య జరిగిన చర్చలు అర్థాంతరంగానే ముగియగా జాతీయ కార్మిక సంఘాల నాయకులు సమావేశాన్ని బహిష్కరించారు. కాగా యాజమాన్య ప్రతినిధులు వేతన పెంపుదల విషయంలో నోరు మెదపకపోవడంతో రెండో రోజు జరిగే చర్చలపై కార్మికులు ఆశలు పెట్టుకున్నారు. యాజమాన్య ప్రతినిధులు 7శాతాని కంటే ఎక్కువగా పెంచేదిలేదని స్పష్టం చేయగా జాతీయ కార్మిక సంఘాల నాయకులు మాత్రం 50 శాతం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా మొదటి రోజు జరిగిన సమావేశంలో వేతన సవరణ పై తీవ్ర ప్రతిష్టంబన నెలకొంది. యాజమాన్యం వైఖరిలో ఇప్పటి వరకు ఎలాంటి మార్పు కనిపించకపోవడంతో జాతీయ కార్మిక సంఘాల నాయకులు ఆందోళనలు చేపట్టేందుకు కార్యచరణ ప్రారంభించడానికి సిద్ధం చేసుకుంటున్నారు. యాజమాన్యం వేతన పెరుగుదలపై కొత్త ప్రతిపాదనలను చేసి, కార్మిక సంఘాలను ఇరకాటంలో పెట్టింది. 7 శాతం ప్యాకేజీని మాత్రమే కార్మిక సంఘాల నాయకుల ముందు పెట్టి అక్కడి నుంచి ముందుకు కదిలేది లేదని స్పష్టం చేసింది. కోలిండియా వద్ద వేతన పెరుగుదలకు సంబంధించి సొమ్ము లేదని , కేంద్రం బైబ్యాక్ విదానం ప్రకారం రూ. 55 వేల కోట్ల నిల్వలను తీసుకుందని కార్మిక సంఘాలకు వివరించింది. కార్మిక సంఘాలు ఒక వేతనాలనే పరిగణలోకి తీసుకుంటే సరిపోదని కార్మికుల కోసం యాజమాన్యం ఎన్నో పథకాల కింద వెచ్చిస్తున్న సొమ్మును కూడా గుర్తించాలని చెబుతోంది. యాజమాన్యం వేతన పెరుగుదలలో కేవలం మూల వేతనాన్ని, కరువు భత్యాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకొని మిగిత అంశాలను వేరు వేరుగా చూడడంపై జాతీయ సంఘాల నాయకులు తప్పుడు పట్టారు. యాజమాన్యం విధించిన నూతన ప్రతిపాదనల వలన 7 శాతం మాత్రమే పెంచడం వలన కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని యాజమాన్య ప్రతిపాదనలను ఎట్టి పరిస్థితులోను అంగీకరించే ప్రసక్తే లేదని జాతీయ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు జరిగిన వేతన ఒప్పందాల్లో మూల వేతనం ఒప్పందం అమలయ్యేనాటికి ఉన్న కరువు భత్యం హాజరుల బోనస్‌ను కలిపి వేతన పెరుగుదల ప్రాతిపదికన గుర్తిస్తారు. అయితే ప్రస్తుతం అధికారుల తీరు పరిశీలిస్తే భవిష్యత్‌లో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని జాతీయ సంఘాలు మండిపడుతున్నాయి. కాగా మొదటి రోజు జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం జరిగే రెండో రోజు జరిగే చర్చల్లో నైనా యాజమాన్య ప్రతినిధులు సానుకూలంగా స్పందిస్తారని కార్మికులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

మొండి వైఖరిని వీడని యాజమాన్యం

సింగరేణి కార్మికులకు సంబంధించిన 10వ వేతన సవరణ ఒప్పందం విషయంలో యాజమాన్యం మొండి వైఖరిని వీడడం లేదని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. రాంచీ నుంచి ఆయన గురువారం మన తెలంగాణ ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడుతూ యాజమాన్య వైఖరిని తప్పుపట్టారు. యాజమాన్యం ప్రతిపాధించిన 7 శాతం కంటే ఎక్కువగా ముందుకు పోవడం లేదని , రేపటి చర్చల్లో యాజమాన్యం స్పందిచకపోయినట్లయితే జాతీయ సంఘాలతో చర్చించి భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

జైలులో అల్లర్లు 37 మంది మృతి

కరాకస్: అమెజాన్‌కు చెందిన దక్షిణ రాష్ట్రం వెనిజులాలోని జైలులో గంటపాటు జరిగిన అల్లర్లలో కనీసం 37 మంది చనిపోయారు. ఈ విషయాన్ని అక్కడి అధికారులు తెలిపారు. ప్యూర్టో అయకుచో నగరంలోని జైలు లో ఈ ఘటన చోటు చేసుకుంది. జైలులో ఊచకోతపై గవర్నర్ లిబోరియో గ్వారుల్లా ట్వీట్ చేశారు. 14 మంది అధికారులు గాయపడినట్లు ప్రాసిక్యూటర్లు చెప్పారు. జైలులో జరిగిన అత్యంత దారుణ ఉదంత ఇదని విం డో టు ఫ్రీడం అనే గ్రూపుకు చెందిన కార్లోస్ నీటో విలేకరులకు తెలిపారు. అల్లర్లు జరిగినప్పుడు ఆ జైలులో 105 మంది ఖైదీలు ఉన్నారని గవర్నర్ గ్వారుల్లా తెలిపారు. అక్కడి జైళ్లలో సామర్థానికి మించి ఖైదీలను ఉంచారని సమాచారం.

కాంగోలో కొండచరియలకు 40 మంది మృతి

బునియా(డెమోక్రటిక్ రిపబ్లిక ఆఫ్ కాంగో): కాంగో ఈశాన్య తీరంలో ఉన్న ఓ మత్స్యకారుల గ్రామంపై కొండచరియలు విరిగిపడ్డంతో 40 మంది మృతి చెందారని గురువారం ఓ ప్రాంతీ య అధికారి తెలిపారు. కుండపోత వానల కారణంగా ఈ కొండచరియ విరిగిపడినట్లు ఇటురి ప్రాంత డిప్యూటీ గవర్నర్ పసిఫిక్ కెటా విలేకరులకు తెలిపారు. అల్బర్ట్ సరస్సు తీరాన ఉన్న తోరా గ్రామంలో బుధవారం ఈ విపత్తు చోటు చేసుకుందని ఆయన వివరించారు. సియర్రా లియోన్‌లోని ఫ్రీటౌన్‌లో సోమవారం 300 మంది మరణించాక ఇంత మంది చనిపోవడం ఇదే తాజా ఘటన. బుధవారం 28 మృతదేహాలను ఖన నం చేసినట్లు, 12కు పైగా మృతదేహాలను ఖననం చేయనున్నట్లు కెటా తెలిపారు. ఇలాంటి విపత్తులను గతంలో కూడా ఈ పెద్ద దేశం ఎదర్కొంది. ఉగం డా సరిహద్దులో ఉన్న అల్బర్ట్ సరస్సులో చేపలు పట్టడం అక్కడి వారి ప్రధాన వృత్తి. ఈ ప్రాంతం లో బంగారు నిక్షేపాలు కూడా అపారంగా ఉన్నా యి. కాంగోలో రెండో ప్రపంచ యుద్ధ కాలంలో, ఆ తర్వాత 1998–2003 మధ్య కాలంలో అనేక హింసాత్మక ఘటనలు జరిగాయి. అయితే వాటిని అంతర్జాతీయ మిలిటరీ సాయంతో అణచివేశారు.

నేర రహిత నగరంగా హైదరాబాద్

- సేఫ్ సిటీ ఇన్ కంట్రీగా హైదరాబాద్‌ను చేద్దాం
- హైదరాబాద్ నగర సిపి ఎం.మహేందర్‌రెడ్డి



మన తెలంగాణ /హైదరాబాద్/ ముషీరాబాద్ : దేశంలోనే హైదరాబాద్‌ను సేఫ్ సిటీగా, క్రైమ్ ఫ్రీ సీటీగా తీర్చిదిద్దుతామని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ ఎం.మహేందర్‌రెడ్డి అన్నారు. మహిళా సాధికారతను ప్రోత్సహించేందుకు తెలంగాణ పోలీసుతో భాగస్వామ్యంలో భాగంగా ప్రముఖ ద్విచక్ర వాహన తయారీదారు హీరో మోటోకార్ప్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో షీ టీమ్‌కు చెందిన మహిళా పోలీసు అధికారులకు 150 నూతన హీరో ద్విచక్ర వాహనాలను అంద చేసింది. గురువారం హైదరాబాద్ హోటల్ మారియట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ ఎం.మహేందర్‌రెడ్డి, సైబరాబాద్ పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య, రాచకొండ కమిషనర్ మహేష్‌భగవత్, క్రైమ్ అదనపు కమిషనర్ స్వాతి లక్రాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో మోటాకార్ప్స్ సిఇఓ, హెడ్ విజయ్‌సేథితో కలిసి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. అనంతరం మహిళా పోలీసు అధికారులు ద్విచక్ర వాహనాలపై వెళ్లిన ర్యాలీని వారు ప్రారంభించారు. అంతకుముందు జరిగిన సభలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక, వనరులు, సంస్కృతి అన్నింట్లోనూ మహిళలు సాధికారత సాధిస్తున్నారన్నారు. అన్ని రంగాల్లో మహిళలు 50 శాతం ఉన్నారన్నారు. గడిచిన ఏడు మాసాలలో హెల్మెట్ లేకుండా 73 మంది చనిపోయారన్నారు. రాత్రి వేళల్లో సమయం 2, 3 గంటలైనా రెడ్ సిగ్నల్ పడి ఉంటే వాహనాన్ని నిలిపివేయాలని, గ్రీన్ సిగ్నల్ పడ్డాకే వెళ్లేలా ప్రతి ఒక్కరిలో ఆలోచన రావాలన్నారు. ఆగస్టు 1 నుంచి ప్రారంభమైన 12 పాయింట్ల నిబంధనలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా చేయడంలో భాగంగానే క్రైమ్ ఫ్రీ సిటీగా చేసేందుకు పోలీసు వ్యవస్థ కూడా కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే రూ.10 కోట్ల నిధులతో 75 వేల సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో కమ్యూనిటీ సిసి కెమెరాలు, నేను సైతం, ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. క్రైమ్ అదనపు కమిషనర్ స్వాతి లక్రా మాట్లాడుతూ మహిళలకు ప్రతి ఒక్కరూ మర్యాద ఇవ్వాలన్నారు. హీరో మోటాకార్ప్స్ ఇచ్చిన వాహనాల వల్ల చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. మహిళా పోలీసులు షీ టీమ్‌లో భాగంగా ఎక్కడైనా, ఎవరైనా ఫిర్యాదు చేయగానే సకాలంలో వెళ్లేలా ఈ వాహనాలు ఉపయోగపడుతాయన్నారు. హీరో మోటో కార్ప్స్ సీఇఓ విజయ్ సేథి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో వరుసగా పలు కార్యక్రమాలను అత్యంత కీలకమైన ఈ అంశాలపై నిర్వహిస్తూ అవగాహన పెంపొందించేందుకు మా కంపెనీ కృషి చేస్తుందన్నారు. సమాజంలో ప్రభావవంతమైన మార్పులను తీసుకువచ్చేందుకు రాష్ట్ర పోలీసు శాఖతో అనుబంధం ఏర్పరచుకునే క్రమంలో తెలంగాణ రాష్ట్రంతో కూడా భాగస్వామ్యం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. హీరో మోటా కార్ప్స్ 250కు పైగా ద్విచక్ర వాహనాలను ప్రాజెక్టు సఖి తదితర కార్యక్రమాల ద్వారా హర్యానా పోలీసు, ఉత్తరాఖండ్ పోలీసుకు గత సంవత్సరం అందచేశామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో చేత హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలను పాటిండచం, పాటించకపోవడం వల్ల వచ్చే ప్రమాదాలను నాటక రూపంలో ప్రదర్శించారు.

డ్రగ్స్ కేసులో 16 పబ్‌లకు నోటీసులు జారీ చేసిన సిట్

శనివారం విచారణకు రావాలని ఆదేశం

మన తెలంగాణ/హైదరాబాద్ : డ్రగ్స్ కేసు దర్యాప్తులో భాగంగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి చెందిన సిట్ తాజాగా 16 పబ్‌లకు నోటీసులను జారీ చేసింది. ఈ నెల 19 వ తేదీ శనివారం కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని యాజమాన్యాలు, మేనేజర్లను ఆదేశించింది. ఈ కేసులో మొదటి ముద్దాయిగా ఉన్న కెల్విన్‌తో పాటు పట్టుబడ్డ పలువురు నగరంలోని పలు పబ్‌లలో విచ్చలవిడిగా డ్రగ్స్‌ను విక్రయించినట్లు వెల్లడించారు. అప్పట్లో కొన్ని క్లబ్‌లకు చెందిన యాజమాన్యాలను పిలిచి డ్రగ్స్ విక్రయాలపై ఆరా తీసి కొన్ని సూచనలను చేసి వదిలేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తాజాగా మరోసారి విచారించాలని నిర్ణయించింది. పబ్‌లలో డ్రగ్స్ చెలామణి సర్వసాధారణమేనని, కొన్ని పబ్‌లైతే డ్రగ్స్ తీసుకునే వారి కోసం ప్రత్యేక గదులను కూడా ఏర్పాటు చేసాయని టాలీవుడ్‌కు చెందిన పలువురిని విచారించిన సందర్భంగా సిట్ అధికారులకు వెల్లడించారు. వీరిచ్చిన సమాచారం ఆధారంగానే గతంలోనే ఒక పబ్ లైసెన్సును అధికారులు రద్దు చేసిన విషయం కూడా తెలిసిందే. తాజాగా నోటీసులు జారీ చేయడం వెనుక బలమైన కారణాలున్నాయని అధికారులు అంటున్నారు. పబ్‌లలో నిర్వహించే కార్యక్రమాలు, ప్రవేశాలకు అనుసరిస్తున్న విధానాలు, పబ్‌తో పాటు పరిసర ప్రాంతాలలో సిసి కెమెరాల ఏర్పాటు, మద్యం తదితర పానీయాలు సరఫరా చేసే ప్రాంతాలలో ఏర్పాటు చేయాల్సిన కెమెరాలు తదితర వాటిని పరిశీలించాలని నిర్ణయించారు. అంతే కాకుండా ఎలాంటి వారు పబ్‌లకు వస్తారు, తరచూ వచ్చే వారెవరూ, వారి ఆర్థిక స్థితిగతులేమిటి అనే అంశాలపై కూడా ఆరా తీయబోతున్నారు. డ్రగ్స్ విక్రయం చేసిన, చేస్తున్న పబ్‌లకు సంబంధించిన అంశంపై ప్రత్యేకంగా విచారిస్తామని అధికారులు అంటున్నారు. యాజమాన్యాలు, మేనేజర్లను విచారణకు రావాలని ఆదేశించామని, వారిచ్చిన సమాచారం ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని అధికారులు చెప్పారు. వాస్తవానికి డ్రగ్స్ కల్చర్ విచ్చలవిడిగా విస్తరించేందుకు పబ్‌లే కారణమని అధికారులు అంటున్నారు. పబ్‌లను కట్టడి చేయకపోతే డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడం సాధ్యం కాదన్న అభిప్రాయానికి వచ్చిన అధికారులు పలు నిబంధనలను విధించాలని నిర్ణయించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే తీసుకోబోయే చర్యలేమిటన్న అంశాలను విచారణ సందర్భంగా వెల్లడి చేయనున్నామని అధికారులు చెప్పారు.

ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ విస్తరణ

మన తెలంగాణ/హైదరాబాద్ : ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన ఆరోగ్య బీమా విభాగం ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎబిహెచ్ ఐసిఎల్) విస్తరణ దిశగా పయనిస్తోంది. తాజాగా సికింద్రాబాద్, పిజి రోడ్ వద్ద తమ ఫుల్ సర్వీస్ బ్రాంచ్‌ను తెరిచింది. ఇంటిగ్రేటెడ్ ఆరోగ్య బీమా పరిష్కారాల ద్వారా ఆరోగ్యకర జీవనాన్ని ప్రోత్సహించడంపై కంపెనీ దృష్టి సారించడంతోపాటు వ్యక్తుల ఆర్థిక భద్రతను మెరుగుపరిచేందుకు ఎబిహెచ్ ఐసిఎల్ నూతన శాఖ తోడ్పడనుంది. ఈ ప్రాంతంలో తమ విస్తరణ పథకాలను గురించి ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సిఇఒ మయాంక్ భత్వాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్య బీమాపట్ల పెరుగుతున్న అవగాహన మమ్మల్ని ఈ రాష్ట్రంలో సేవలు అందించేందుకు ప్రోత్సహించడంతో పాటుగా మా ప్రాధాన్యతా మార్కెట్‌లలో ఒకటిగా చేసిందని పేర్కొన్నారు.

రూపన్‌వాలా కమిటీ నివేదిక ఉద్రిక్తతలకు దారితీసేదిగా ఉంది



మన తెలంగాణ/గజ్వేల్ : ఒక వైపు దేశానికి రాష్ట్రపతిని దళితుణ్ని చేశామంటున్న కేంద్ర ప్రభుత్వం మరోవైపు కులవివక్ష, వేధింపుల కారణంగా తన కన్న కొడుకును పోగొట్టుకుని కడుపుకోతతో కుములుతున్న రోహిత్ వేముల తల్లి కూడా దళితురాలేన్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకుని న్యాయం చేయలేక పోతున్నదని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, హెచ్‌సియు విద్యార్థి నాయకుడు దాసరి హరిబాబు అన్నారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో ఎంతో సంచలనం కలిగించిన రోహిత్ వేముల మృతిపై వేసిన రూపన్‌వాలా విచారణ కమిటీ నివేదిక యూనివర్సిటీలో మరింత ఉద్రిక్తత కలిగించేదిగా ఉందని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. అసలు కేసును పూర్తిగా తప్పుదోవ పట్టించే విధంగా ఈ నివేదికను ఇచ్చిందన్నారు. త్రిసభ్యకమిటీ నిర్ణయం కాకముందే కోర్టులను తప్పుదోవ పట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం వేసిన రూపన్ వాలా కమిటీ కుట్ర చేస్తున్నదని వారు ఆరోపించారు. ఈ కమిటీ నివేదికలో కేంద్ర మంత్రులు, విసి అప్పారావులను కేసు నుంచి తప్పించే యత్నం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా కేంద్రం చిత్తశుద్ధితో వ్యవహరించి రోహిత్ వేముల మృతికి కారకులైన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిబిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో మోడీ ప్రభుత్వం చేస్తున్న దళిత, గిరిజన వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ దేశవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలకు పూనుకుంటామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో హెచ్‌సియు జెఎసి, డిబిఎఫ్ నాయకలు రజనీకాంత్, కిరణ్, ఎండి సిరాజుద్దీన్, గాలేరు వెంకటేష్, నరేష్ పాల్గొన్నారు.

బెంగాల్‌లో టిఎంసి 'స్థానిక' విజయం

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ స్థానిక సంస్థల ఎన్నికలలో అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఘన విజయం సాధించింది. మున్సిపల్ ఎన్నికలలో మొత్తం ఏడు పాలక మండళ్లను టిఎంసియే కైవసం చేసుకుంది. ఇక ఈ ఎన్నికలలో టిఎంసికి బిజెపి సవాలు విసిరింది. టిఎంసి తరువాత ఎక్కువ వార్డులు దక్కించుకున్న పార్టీగా బిజెపి నిలిచింది. ఇక వామపక్షాలు మూడవ స్థానానికి పరిమితం అయ్యాయి. మూడు మున్సిపాల్టీలలో బిజెపికి ఆరు వార్డులు పట్టం కట్టాయి. అయితే సగటున చూస్తే ఈ ఎన్నికలలో టిఎంసి గాలి బలీయంగా ఉన్నట్లు ఫలితాలతో స్పష్టం అయింది. పలు జిల్లాల్లో స్పష్టమైన ఆధికత్యను దక్కించుకుంది. ఇక దుర్గాపూర్ మున్సిపాల్టీలో టిఎంసి మొత్తం 43 వార్డులను దక్కించుకుని ఎన్నికలలో క్లీన్‌స్వీప్ సాధించింది. హాల్దియాలోనూ అన్నిసీట్లూ టిఎంసికే వచ్చాయి. ఈ ఎన్నికల ఫలితాలతో టిఎంసి తరువాత రెండవ స్థానంలో వార్డులను బిజెపి కైవసం చేసుకోవడం గమనార్హం.

దిక్కులేని అత్యాచార బాధితురాలికి పరిహారం

న్యూఢిల్లీ : అత్యాచారానికి గురైన అనాథ మహిళ పట్ల సుప్రీంకోర్టు కారుణ్య భావంతో స్పందించింది. ఈ మహిళకు రూ 10 లక్షల పరిహారం చెల్లించాలని బీహార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తనకంటూ ఎవరూ లేని ఈ మహిళపై అత్యాచారం జరిగి, 26 వారాల గర్భం దశలో అబార్షన్‌కు వైద్య కారణాలతో అనుమతి నిరాకరించారు. పాట్నా వీధులలో అనాథగా ఉండే హెచ్‌ఐవి సోకిన మహిళపై ఎవరో లైంగిక చర్యకు పాల్పడ్డారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఈ మహిళ గర్భస్రావానికి పాట్నా హైకోర్టు చట్ట పరిధిలో అనుమతి నిరాకరించింది. దీనిని ఆమె తరపున న్యాయవాది సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ దశలో విచారణ జరిపిన న్యాయమూర్తి దీపక్ మిశ్రా పూర్వాపరాలను పరిశీలించి హైకోర్టు తీర్పును కొట్టివేశారు. బాధితురాలు 17వ నెల గర్భంతో ఉన్నప్పుడే హైకోర్టును ఆశ్రయించారని, అయితే విచారణ ప్రక్రియ జాప్యం అంశాలతో తరువాత వెలువరించిన తీర్పులో చట్టం మేరకు 20 వారాల గర్భవిచ్ఛిత్తి కుదరదని తెలియచేయడం అనుచితం అని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. అయితే ఆమె సకాలంలోనే గర్భవిచ్ఛిత్తికి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

బల్గేరియా ఓపెన్ విజేత లక్ష్య సేన్



న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్‌కు మరో కొత్త ఆణిముత్యం దొరికాడు. ఇప్పటికే జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచి ప్రకంపనలు సృష్టించిన యువ ఆటగాడు లక్ష్య సేన్ ప్రతిష్ఠాత్మకమైన బల్గేరియా ఓపెన్ ఇంటర్నేషనల్ సిరీస్‌లో టైటిల్ గెలుచుకున్నాడు. అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన లక్ష్య సేన్ అసాధారణ ఆటతో ప్రత్యర్థులను హడలెత్తిస్తూ విజేతగా నిలిచాడు. హోరాహోరీగా సాగిన ఫైనల్లో లక్ష్యసేన్ 18–21, 21–12, 21–17 తేడాతో క్రొయేషియాకు చెందిన రెండో సీడ్ జీవోనియర్‌ను ఓడించాడు. 57 నిమిషాల పాటు హోరాహోరీగా పోరులో లక్ష్య సేన్ అద్భుత ఆటతో అగ్రశ్రేణి ఆటగాడు జీవోనియర్‌ను మట్టి కరిపించాడు. ప్రారంభ గేమ్‌లో భారత ఆటగాడు ప్రత్యర్థికి గట్టి పోటీ ఇచ్చాడు. అయితే కీలక సమయంలో ఒత్తిడికి గురి కావడంతో ఓటమి తప్పలేదు. కానీ, చివరి రెండు గేమ్‌లలో లక్ష్య సేన్ చెలరేగి ఆడాడు. తన మార్క్ షాట్లతో ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెడుతూ వరుసగా రెండు సెట్లను గెలిచి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ గెలుపు తన ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసిందని లక్ష్య సేన్ అన్నాడు.

తండ్రికి అరుదైన కానుక ఇచ్చిన హార్దిక్



న్యూఢిల్లీ : భారత యువ సంచలనం హార్దిక్ పాండ్యా తన తండ్రి హిమాన్షు పాండ్యాకు అరుదైన కానుక అందజేశాడు. ప్రస్తుతం వన్డే సిరీస్ కోసం శ్రీలంకలో ఉన్న హార్దిక్ తన సోదరుడు కృనాల్ పాండ్యా, కజిన్ వైభవ్ సహకారంతో తన తండ్రి హిమాన్షుకు కారును బహుమతిగా అందజేశాడు. అయితే తాను తండ్రికి కారు బహుమతిగా ఇస్తున్న విషయాన్ని హార్దిక్ చివరి వరకు గోప్యంగా ఉంచాడు. తన తండ్రి ఓ కారును ఎంపిక చేయగా సదరు షోరూం ప్రతినిధులు దానిని హిమాన్షుకు అంద జేశారు. ఈ సందర్భంగా హార్దిక్ వీడియో కాల్ ద్వారా తండ్రితో మాట్లాడాడు. తాను కారును కొనుగోలు చేస్తున్న విషయాన్ని అతనే స్వయంగా తండ్రికి చెప్పాడు. కాగా, కారును సొంతం చేసుకున్న సందర్భంలో తన తండ్రి ముఖంలో వ్యక్తం అయిన ఆనందం చూసి తాను ఎంతో ఉద్వేగానికి లోనయ్యానని హార్దిక్ చెప్పాడు. ఈ విషయాలను హార్దిక్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. తన తండ్రికి కారు అంటే చాలా ఇష్టమన్నాడు. అయితే ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆయన దీన్ని కొనుగోలు చేయలేక పోయారని చెప్పాడు. కాగా, తాను కృనాల్ కలిసి చాలా రోజులుగా తండ్రికి కారును బహుమతిగా ఇచ్చేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురు చూశామని, ఇది ఇప్పుడూ కార్యరూపం దాల్చిందని పేర్కొన్నాడు.

పరాజయంపై నివేదిక ఇవ్వండి

శ్రీలంక బోర్డుకు ప్రభుత్వ ఆదేశం



కొలంబో: భారత్ చేతిలో ఎదురైన ఘోర పరాజయంపై నివేదిక అంద జేయాలని శ్రీలంక ప్రభుత్వం ఆ దేశ క్రికెట్ బోర్డును ఆదేశించింది. భారత్ బలమైన జట్టు అయినప్పటికీ శ్రీలంక ఆడిన తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో నివేదిక సమర్పించాలని శ్రీలంక క్రీడా మంత్రిత్వ శాఖ ఆ దేశ బోర్డును కోరింది. ఈ మేరకు ఆ దేశ క్రీడా మంత్రి దయాసిరి జయశేఖర శ్రీలంక బోర్డుకు ఆదేశాలు జారీ చేశారు. సాధ్యమైనంత త్వరలో దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని సూచించారు. కాగా, ప్రస్తుత జట్టుపై తనకు ఎటువంటి సందేహాలు లేవని, అయితే ఓటమికి గల కారణాలను కచ్చితంగా తెలుసుకోవాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. కాగా, శ్రీలంక ఘోర పరాజయంపై ఇప్పటికే రెండు సార్లు సుదీర్ఘంగా చర్చించడం జరిగిందని మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో శ్రీలంక మళ్లీ పూర్వ వైభవం సాధిస్తుందనే నమ్మకం తమకుందన్నారు. అయితే జట్టు నివేదిక అందిన తర్వాత జట్టు బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారిస్తామని మంత్రి జయశేఖర అన్నారు. కాగా, భారత్ చేతిలో క్లీన్‌స్వీప్‌కు గురైన శ్రీలంక జట్టుపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ శ్రీలంక క్రికెట్ బోర్డును రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న విషయం విదితమే. అతని బాటలో మరి కొంతమంది మాజీ క్రికెటర్లు కూడా ఇటువంటి డిమాండే చేస్తున్నారు. దీంతో దీనిపై శ్రీలంక ప్రభుత్వం జోక్యం చేసుకుంది.

కబడ్డీ క్రీడాకారుల బ్రేక్‌ది బియర్డ్



మన తెలంగాణ/హైదరాబాద్: ఇప్పటి వరకు క్రికెట్‌కే పరిమితమైన బ్రేక్ ది బియర్డ్ కబడ్డీలోనూ అడుగు పెట్టింది. భారత క్రికెటర్లు రవీంద్ర జడేజా, హార్దిక్ పాండ్యా, సురేశ్ రైనాలు క్రికెట్‌లో దీన్ని ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. వీరిని ఆదర్శంగా తీసుకొని ప్రొ కబడ్డీ క్రీడాకారులు కూడా దీన్ని అనుసరిస్తున్నారు. ప్రస్తుతం ప్రొ కబడ్డీ ఐదో సీజన్ జరుగుతున్న నేపథ్యంలో కబడ్డీ క్రీడాకారులు దీనికి తెర లేపారు. గుజరాత్ ఫార్చున్ జెయింట్స్ కెప్టెన్ సుఖేష్ హెగ్డే షార్ప్ లుక్‌తో క్రికెటర్ల బాటలో పయనించాడు. అంతేగాక ఉమేశ్ మాత్రే, రోహిత్ కుమార్, ధర్మరాజ్, రవికుమార్‌లు కూడా బ్రేక్ ది బియర్స్ ఛాలెంజ్‌ను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు చూడ చక్కని ముఖకవలికలతో ప్రత్యేక ఆకర్షణగా మారారు. ఈ మేరకు కబడ్డీ క్రీడాకారులు పెట్టిన ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

పుజారా బ్యాటింగ్‌కు ఫిదా: శాస్త్రి



కొలంబో: చటేశ్వర్ పుజారా ఓ అసాధారణ ఆటగాడని టీమిండియా ప్రధాన కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. ప్రపంచ క్రికెట్‌కు లభించిన అరుదైన క్రికెటర్లలో పుజారా ఒకడని శాస్త్రి అన్నాడు. అతని బ్యాటింగ్‌కు తాను అభిమానిగా మారిపోయానని చెప్పాడు. అతనిలా బ్యాటింగ్ చేయడం ఎవరికి సాధ్యం కాదన్నాడు. అతని బ్యాటింగ్ శైలీ చూడ ముచ్చటగా ఉంటుందన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అతనిలా నిలకడగా ఆడే క్రికెటర్ మరొకడూ లేడన్నాడు. ఇటీవల కాలంలో అతని బ్యాటింగ్ మరింత మెరుగైందన్నాడు. కలలో ఊహించినట్టుగా అతని బ్యాటింగ్ సాగుతుందన్నాడు. ఇతరులకు ఇలా ఆడడం కేవలం కలల్లో మాత్రమే సాధ్యమవుతుందన్నారు. తాను చూసిన అత్యంత ప్రతిభావంతులైన క్రికెటర్లలో పుజారా ఒకడన్నాడు. భవిష్యత్తులో మరింత మెరుగైన ఆటగాడిగా ఎదిగే సత్తా అతనిలో ఉందన్నాడు. ఎటువంటి బౌలర్‌నైనా దీటుగా ఎదుర్కొనే సత్తా అతని సొంతమన్నాడు. శ్రీలంక సిరీస్‌లో పుజారా బ్యాటింగ్ తనను ఎంతో ఆకట్టుకుందన్నాడు. కొంత కాలంగా భారత్ సాధిస్తున్న విజయాల్లో పుజారాదే కీలక పాత్ర అన్నాడు. రాహుల్ ద్రవిడ్ తర్వాత అంత నిలకడగా ఆడిన క్రికెటర్ పుజారా అని చెప్పడంలో తనకు ఎటువంటి సందేహం లేదన్నాడు. సొంత గడ్డపై, విదేశాల్లో పుజారా చెలరేగి పోతున్నాడని, దీనికి ఇటీవల అతను సాధించిన పరుగులే నిదర్శనమని రవిశాస్త్రి పేర్కొన్నాడు.



టీమిండియాదే పైచేయి

మన తెలంగాణ / క్రీడావిభాగం : శ్రీలంకతో ఇప్పటి వరకు జరిగిన వన్డే సిరీస్‌లలో భారత్‌దే పైచేయిగా ఉంది. శ్రీలంక గడ్డపై జరిగిన పలు సిరీస్‌లను టీమిండియా సొంతం చేసుకుంది. తాజాగా శ్రీలంకతో జరుగనున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో కూడా భారత్‌కే విజయవకాశాలు అధికంగా ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన విరాట్ కోహ్లి సేన వన్డేల్లోనూ అదే సంప్రదాయాన్ని కొనసాగించాలనే పట్టుదలతో రెండు జట్ల మధ్య వన్డే సిరీస్‌కు ఆదివారం తెరలేవనుంది. సీనియర్లు రిటైర్మెంట్ ప్రకటించడంతో లంక బలహీనంగా మారిన విషయం తెలిసిందే. దీని ప్రభావం టెస్టు సిరీస్‌పై స్పష్టంగా కనిపించింది. కానీ, వన్డేల్లో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంటుందని శ్రీలంక కెప్టెన్ ఉపుల్ తరంగ అంటున్నాడు. అయితే తరంగ చెబుతున్నట్టు భారత్‌ను ఓడించడం అనుకున్నంత తేలిక కాదనే చెప్పాలి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో టీమిండియా చాలా బలంగా ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే ఆటగాళ్లకు జట్టులో కొదవలేదు. ఓపెనర్ల నుంచి మొదలుకొని చివరి వరుస బ్యాట్స్‌మన్ వరకు బ్యాట్‌ను ఝులిపించగల సత్తా కలిగిన వారే. ఇక, హార్దిక్ పాండ్యా రూపంలో మ్యాచ్ విన్నర్ ఆల్‌రౌండర్ కూడా భారత్‌కు అందుబాటులో ఉన్నాడు. దీంతో సిరీస్‌ను గెలిచే అవకాశాలు భారత్‌కే అధికంగా ఉన్నాయని చెప్పవచ్చు. భారత్, శ్రీలంక జట్ల మధ్య ఇప్పటివరకు 150 వన్డేలు జరిగాయి. ఇందులో భారత్ 83 వన్డేల్లో విజయం సాధించింది. శ్రీలంక కేవలం 55 మ్యాచుల్లోనే గెలుపొందింది. దీన్ని బట్టి భారత్ ఆధిపత్యం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. శ్రీలంక సొంతగడ్డపై కూడా భారత్‌కు మెరుగైన రికార్డు ఉంది. లంక గడ్డపై ఆడిన పలు సిరీస్‌లలో భారత్ జయకేతనం ఎగుర వేసింది. ఇదిలావుండగా భారత గడ్డపై జరిగిన తొమ్మిది వన్డే సిరీస్‌లలో ఒక సారి కూడా శ్రీలంక విజయం సాధించలేక పోయింది. అన్ని సిరీస్‌లలో కూడా భారతే విజేతగా నిలువడం విశేషం. రెండు జట్ల మధ్య చివరి సారిగా 2014–15లలో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 5–0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది.

ప్రారంభంలో లంక పైచేయి..

శ్రీలంక గడ్డపై జరిగిన వన్డే సిరీస్‌లలో భారత్ ఆధిపత్యం చాటింది. రెండు జట్ల మధ్య లంక గడ్డపై తొలిసారిగా 1985లో వన్డే సిరీస్ జరిగింది. ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్ 1–1తో సమమైంది. 1993లో రెండో సారి శ్రీలంక గడ్డపై భారత్ వన్డే సిరీస్ ఆడింది. ఈ సిరీస్‌లో శ్రీలంక 2–1తో విజయం సాధించింది. 1997లో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్‌లో కూడా శ్రీలంక విజయం సాధించింది. 1996లో ప్రపంచ కప్ గెలిచిన సమరోత్సాహంతో ఉన్న శ్రీలంక ఈ సిరీస్‌లో భారత్‌ను 3–0 తేడాతో చిత్తుగా ఓడించంది. డాషింగ్ ఆల్‌రౌండర్ సనత్ జయసూర్య, సీనియర్లు అరవింద డిసిల్వా, రోశన్ మహానామాలు శ్రీలంక విజయంలో కీలకపాత్ర పోషించారు. 2006లో ఇరు జట్ల మధ్య జరిగిన సిరీస్ ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే వర్షార్పణం అయ్యింది. మూడు మ్యాచ్‌లు కూడా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయ్యాయి.

భారత్ జోరు..

తర్వాత జరిగిన సిరీస్‌లలో భారత్ ఆధిపత్యం చెలాయించింది. 2008లో శ్రీలంక గడ్డపై జరిగిన సిరీస్‌లో భారత్ పైచేయి సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3–2 తేడాతో కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఈ సిరీస్‌లో భారత్ అసాధారణ ఆటతో విజేతగా నిలిచింది. తర్వాతి ఏడాది కూడా శ్రీలంక గడ్డపై వన్డే సిరీస్‌లో భారత్ తలపడింది. ఈసారి కూడా భారత్ జోరు కొనసాగింది. గతానికి భిన్నంగా ఈసారి టీమిండియా ఆధిపత్యం చెలాయించింది. మహేంద్ర సింగ్ ధోనీ నేతృత్వంలోని భారత్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4–1తో కైవసం చేసుకుంది. 2012లో జరిగిన వన్డే సిరీస్‌లో కూడా భారత్‌దే పైచేయిగా నిలిచింది. ఈసారి కూడా భారత్ జయకేతనం ఎగుర వేసింది. ధోనీ కెప్టెన్సీలో భారత్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4–1తో సొంతం చేసుకుంది. ఇలా శ్రీలంక గడ్డపై జరిగిన సిరీస్‌లలో భారత్ మూడు సార్లు విజేతగా నిలిచింది. శ్రీలంక రెండు సార్లు మాత్రమే సిరీస్‌ను గెలుచుకుంది. ఒక రెండు సిరీస్‌లు సమంగా ముగిసాయి. ఇక, భారత గడ్డపై, తటస్థ వేదికల్లో జరిగిన వన్డేల్లో కూడా భారత్‌దే పైచేయిగా ఉంది.

150	ఇరు జట్ల మధ్య జరిగిన వన్డేలు
83	భారత్ సాధించిన విజయాలు
55	శ్రీలంక గెలిచిన మ్యాచ్‌లు
3	లంక గడ్డపై భారత్ సాధించిన సిరీస్‌లు
9	స్వదేశంలో లంకపై భారత్ గెలిచిన వన్డే సిరీస్‌లు
363	శ్రీలంకలో భారత్ సాధించిన అత్యధిక స్కోరు
320	సొంత గడ్డపై భారత్‌పై శ్రీలంక సాధించిన అత్యధిక స్కోరు



కోహ్లి ఓ అద్భుత కెప్టెన్

ఆసీస్ మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్



మెల్‌బోర్న్: విరాట్ కోహ్లి ఓ అద్భుత సారథి అని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ అన్నాడు. అతనిలా జట్టును ముందుండి నడిపించడం అందరికి సాధ్యం కాదన్నాడు. అతని తీరు అచ్చం ఆస్ట్రేలియా క్రికెటర్ల పంథాను తలపిస్తుందన్నాడు. శ్రీలంక సిరీస్‌లో అతని దూకుడు తనను ఎంతో ఆకట్టుకుందన్నాడు. జట్టును ముందుండి నడిపించడంలో కోహ్లికి ఎవరూ సాటిరారన్నాడు. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లోని అత్యుత్తమ కెప్టెన్లలో కోహ్లికే తాను అగ్రస్థానం ఇస్తానని క్లార్క్ అన్నాడు. గతంలో రికి పాంటింగ్ కూడా ఇలానే జట్టును ముందుండి నడిపించే వాడన్నాడు. ఆ తర్వాత ఇలా జట్టును విజయపథంలో నడిపిస్తున్న కెప్టెన్ కోహ్లి మాత్రమే అన్నాడు. కొంతకాలంగా భారత్ నిలకడైన ఆటను కనబరచడం తనను ఎంతో ఆనంద పరుస్తుందన్నాడు. భవిష్యత్తులో టీమిండియాను ఓడించడం ఇతర జట్లకు కష్టంతో కూడుకున్న పనిగా మారుతుందని క్లార్క్ జోస్యం చెప్పాడు. శ్రీలంకపై భారత్ ఏకచక్రాధిపత్యం చెలాయించిందన్నాడు. ఒకప్పుడూ ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, వెస్టిండీస్‌లు మాత్రమే ఇలా టెస్టుల్లో ఏకపక్ష విజయాలు సాధించే వన్నాడు. ఇప్పుడూ కోహ్లి పర్యవేక్షణలో టీమిండియా కూడా ఇదే బాటలో ప్రయాణిస్తోందని క్లార్క్ అభిప్రాయపడ్డాడు.

న్యూజిలాండ్ వేదికగా

అండర్ -19 ప్రపంచకప్



దుబాయి: ఐసిసి అండర్–19 ప్రపంచకప్‌కు న్యూజిలాండ్ ఆతిథ్యం ఇవ్వనుంది. 2018లో న్యూజిలాండ్ వేదికగా ఈ ప్రపంచకప్ జరుగనుంది. ఐసిసి టెస్టు ర్యాంకింగ్స్‌లో టాప్ టెన్‌లో ఉన్న జట్లు దీనికి నేరుగా అర్హత సాధిస్తాయి. మిగిలిన జట్లను అర్హత పోటీల ద్వారా ఎంపిక చేశారు. 2018 జనవరి 13 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఈ ప్రపంచకప్ జరుగుతుంది. దీనికి సంబంధించిన వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి ప్రతినిధులు గురువారం వెల్లడించారు. కాగా, పోటీల్లో పాల్గొనే జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. కిందటి సారి రన్నరప్‌గా ఉన్న భారత్ గ్రూప్–బిలో చోటు సంపాదించింది. భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, జింబాబ్వే, క్వాలిఫయర్ పపువా న్యూగయానా గ్రూప్–బిలో ఉన్నాయి. గ్రూప్–ఎలో డిఫెండింగ్ చాంపియన్ వెస్టిండీస్, ఆతిథ్య న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్లతో పాటు క్వాలిఫయర్ కెన్యాలకు చోటు కల్పించారు. గ్రూప్–సిలో ఇంగ్లాండ్, బంగ్లాదేశ్, కెనడా, నమీబియా జట్లు ఉన్నాయి. గ్రూప్–డిలో పాకిస్థాన్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్, స్కాట్లాండ్ జట్లను ఎంపిక చేశారు. కాగా, న్యూజిలాండ్‌లోని ఏడు వేదికల్లో ప్రపంచకప్ మ్యాచ్‌లను నిర్వహిస్తారు. 22 రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో అభిమానులకు ఉచిత ప్రవేశాన్ని కల్పిస్తున్నారు. జనవరి 13న జరిగే ప్రారంభ మ్యాచ్‌లో న్యూజిలాండ్, ప్రస్తుతం చాంపియన్ వెస్టిండీస్ జట్లు తలపడుతాయి. కాగా, భారత్ 2000లో తొలిసారి మహ్మద్ కైఫ్ కెప్టెన్సీలో అండర్–19 ప్రపంచకప్‌ను సాధించింది. 2008లో విరాట్ కోహ్లి, 2012లో ఉన్ముక్త్ చంద్ సారథ్యంలో భారత యువ జట్టు విశ్వవిజేతగా నిలిచింది. కిందటి ప్రపంచకప్‌లో భారత్ రన్నరప్‌ను కైవసం చేసుకుంది.

దంబుల్లా చేరిన టీమిండియా

దంబుల్లా: శ్రీలంకతో జరిగే తొలి వన్డే మ్యాచ్ కోసం టీమిండియా గురువారం దంబుల్లా చేరుకుంది. ఇప్పటి వరకు క్యాండీలో ఉన్న భారత జట్టు ఆదివారం జరిగే మొదటి వన్డే కోసం ఇక్కడికి వచ్చింది. కెప్టెన్ విరాట్ కోహ్లి, వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ, ప్రధాన కోచ్ రవిశాస్త్రి, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీలతో సహా జట్టు సభ్యులంతా దంబుల్లాకు చేరుకున్నారు. ఇప్పటికే మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత్ తాజాగా ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో శ్రీలంకతో తలపడనుంది. భారత జట్టు ఇక్కడికి చేరుకున్న ఫొటోను భారత క్రికెట్ బోర్డు ట్వీట్టర్‌లో పోస్ట్ చేసింది. కాగా, ఈ సిరీస్ కోసం భారత జట్టు కొంత మంది సీనియర్ క్రికెటర్లకు విశ్రాంతి ఇచ్చింది. ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, ఫాస్ట్ బౌలర్లు మహ్మద్ షమి, ఉమేశ్ యాదవ్‌లను సిరీస్‌కు ఎంపిక చేయలేదు. కాగా, ఈ సిరీస్‌లో అందరి దృష్టి మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీపై నిలువనుంది. అతని భవితవ్యంపై బిసిసిఐ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ఈ సిరీస్‌లో నిలకడైన ఆటను కనబరచాల్సిన బాధ్యత ధోనీపై నెలకొంది. దీంతో తీవ్ర ఒత్తిడి నేపథ్యంలో అతను ఎలా ఆడుతాడన్నది అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.